
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



మంగళవారం | 7-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 189 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ.9.17 తదుపరి పాడ్యమి తె.5.53 వరకు; నక్షత్రం: రేవతి రా.1.28 తదుపరి అశ్విని; వర్జ్యం: మ.2.45-4.10, దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, రా.9.56-10.43, అమృతఘడియలు: రా.11.19-12.45, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 5.55 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



టాటా ట్రస్టులో ఇంటి పోరు!

TATA TRUSTS

నోయెల్ టాటా అధికారాలపై గుస్సా

10న టాటా ట్రస్ట్స్ బోర్డు సమావేశం

న్యూఢిల్లీ: టాటాల సామ్రాజ్యంలోనూ ఇంటి పోరు ప్రారంభమైనట్టు సమాచారం. రతన్ టాటా వారసుడిగా పగ్గాలు చేపట్టిన ఆయన సోదరుడు, టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా అధికారాలపై ట్రస్టు సభ్యులు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. టాటా గ్రూప్ మాతృ సంస్థ టాటా సన్స్ ఈక్విటీలో టాటా ట్రస్ట్స్‌కు 66 శాతానికిపైగా వాటా ఉంది. టాటా సన్స్ బోర్డులోకి నోయెల్ టాటా కొందరి పేర్లను సూచించగా నలుగురు ట్రస్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో ఈ నెల 10న జరిగే టాటా ట్రస్ట్స్ బోర్డు సమావేశం గరంగరంగా జరుగుతుందని భావిస్తున్నారు.

టాటా సన్స్ లిస్టింగ్‌పై చర్చ

శుక్రవారం జరిగే టాటా ట్రస్ట్స్ బోర్డు సమావేశంలో టాటా సన్స్ లిస్టింగ్‌పైనా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. నిజానికి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం గత నెలాఖరుకే ఈ కంపెనీ ఐపీఓ పూర్తి కావాల్సి ఉంది. అయితే సెబీ అనుమతి ఉన్నా టాటా గ్రూప్ ఆ పని పూర్తి చేయలేక పోయింది. మరోవైపు టాటా సన్స్ ఈక్విటీలో 18.37 శాతం వాటా ఉన్న షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్ తన అప్పుల భారం తగ్గించుకోవాలని భావిస్తోంది. వీలైనంత త్వరగా ఐపీఓ జారీ చేస్తే పారదర్శకంగా తన వాటాను మార్కెట్ ధరకు విక్రయించి బయట పడొచ్చని ఆశించింది.

అయితే ఐపీఓ వాయిదాల మీద వాయిదాలు పడడంతో తీవ్ర అసంతృప్తితో ఉంది. తన భార్య ఎస్‌పీ గ్రూప్ చీఫ్ సోదరి కావడంతో నోయెల్ టాటా దీనిపైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. దీనికి కూడా టాటా ట్రస్ట్‌లోని కొందరు ట్రస్టీలు నోయెల్ టాటాను తప్పుపడుతున్నట్టు సమాచారం.

బంగారు నగ.. భగ భగ

- పసిడి సరికొత్త ఆల్‌టైం రికార్డు
- రూ.1.23 లక్షలు దాటిన 10 గ్రాముల ధర
- ఒక్కరోజులో రూ.2,700 పెరుగుదల



న్యూఢిల్లీ: పండగ సీజన్‌లో పసిడి, వెండి బెంబేలెత్తిస్తున్నాయి. ఈ విలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. తులం బంగారం రూ.1.23 లక్షలు దాటేయగా.. కిలో వెండి రూ.1.60 లక్షల దిశగా పరుగులు తీస్తోంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం సోమవారం ఏకంగా రూ.2,700 ఎగబాకి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1,23,300కు పెరిగింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.2,700 పెరిగి కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,22,700కు చేరింది. వెండిదీ అదే తీరు. కేజీ సిల్వర్ రూ.7,400 పెరుగుదలతో మరో కొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.1,57,400కు ఎగబాకింది. ఖజానా ఖాళీ అవడంతో అమెరికా ప్రభుత్వ యంత్రాంగం స్తంభించిపోయి (యూఎస్ షట్‌డౌన్) 6 రోజులవుతుండటంతో పాటు డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డు కనిష్ఠానికి క్షీణించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు తెలిపాయి.

4,000 డాలర్లకు చేరువలో ఔన్స్ గోల్డ్

షట్‌డౌన్‌తో అమెరికాలో రాజకీయ, ఆర్థిక అనిశ్చితి మరింత పెరగడంతో పాటు ఫ్రాన్స్, జపాన్‌లో తాజా రాజకీయ పరిణామాలు అంతర్జాతీయంగా విలువైన లోహాల ధరలను ఎగదోస్తున్నాయి. అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీ రేట్లను మరో 0.25 శాతం తగ్గించవచ్చన్న అంచనాలూ బులియన్ ర్యాలీకి మరో కారణం.ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు తొలిసారిగా 3,900 డాలర్ల మైలురాయిని దాటేసింది. సిల్వర్ సైతం ఒక శాతానికి పైగా పెరిగి 48.75 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. ఈ ఏడాదిలో ఇప్పటికే 50 శాతానికి పైగా పెరిగిన ఔన్స్ గోల్డ్ అతి త్వరలో 4,000 డాలర్లు మించిపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏపీలో ఓఎన్‌జీసీ భారీ పెట్టుబడులు



రూ.8,110 కోట్లతో 172 బావుల తవ్వకం

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ).. ఆంధ్రప్రదేశ్‌లో చమురు, సహజ వాయువుల అన్వేషణను ఉధృతం చేస్తోంది. ఇందులో భాగంగా రూ.8,110 కోట్ల పెట్టుబడి అంచనాతో రాష్ట్రంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్ ప్రాంతంలోని భూ ఉపరితల ప్రాంతాల్లో 172 బావులు తవ్వబోతోంది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎఫ్‌సీసీ)కు చెందిన నిపుణుల కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. కోనసీమ ప్రాంతంలో తనకు కేటాయించిన ఎనిమిది పెట్రోలియం మైనింగ్ లీజు (పీఎంఎల్) బ్లాకుల్లో ఓఎన్‌జీసీ ఈ తవ్వకాలు జరపనుంది. ఇందులో పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ) కోసం రూ.172 కోట్లు, ప్రజాభిప్రాయ సేకరణ కోసం రూ.11 కోట్లు ఖర్చు చేయనుంది.

షరతులు: కేజీ బేసిన్ ప్రాంతంలో చమురు, గ్యాస్ తవ్వకాలకు అనుమతి ఇస్తూనే పర్యావరణ సంరక్షణకు ఎంఓఈఎఫ్‌సీసీ పెద్దపీట వేసింది. ఓఎన్‌జీసీ తవ్వే ఈ 172 బావుల్లో ఏ బావి కూడా కోరంగి వన్యప్రాణి సంరక్షణా కేంద్రానికి పది కిలోమీటర్ల లోపు ఉండకూడదని స్పష్టం చేసింది. అలాగే ముందస్తు అనుమతి లేకుండా అటవీ ప్రాంతాలు, సంరక్షిత ప్రాంతాల నుంచి ఎలాంటి పైప్‌లైన్లు వేయకూడదని షరతు విధించింది. చమురు, గ్యాస్ క్షేత్రాల కారణంగా కోనసీమ ప్రాంతంలో భూమి కుంగిపోతోందన్న నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో ఈఎఫ్‌సీసీ నిపుణుల కమిటీ ఈ షరతులు విధించినట్టు భావిస్తున్నారు.

భారీ నిక్షేపాలు: కేజీ బేసిన్‌లో దాదాపు 69.8 కోట్ల టన్నుల చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు అంచనా. ఇది గత ఆర్థిక సంవత్సరం మన దేశం దిగుమతి చేసుకున్న ముడి చమురు కంటే దాదాపు రెండు రెట్లు ఎక్కువ. దీంతో ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఈ ప్రాంతంలో పెద్దఎత్తున చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషిస్తున్నాయి. రిలయన్స్ ఇప్పటికే ఈ ప్రాంత లోతట్టు సముద్ర జలాల్లో గ్యాస్ ఉత్పత్తి చేపట్టింది. ఓఎన్‌జీసీ కూడా 500 కోట్ల డాలర్ల పెట్టుబడితో ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఉత్పత్తి ప్రారంభించింది. ఇప్పుడు కేజీ బేసిన్‌లోని ఉపరితల ప్రాంతంలోనూ పెద్దఎత్తున బావులు తవ్వి చమురు, గ్యాస్ ఉత్పత్తి ప్రారంభించాలని యోచిస్తోంది.

చమురు గిరాకీ మరింత పైకే

పునరుత్పాదక ఇంధన వినియోగం ఎంతగా పెరుగుతున్నా మన దేశంలో చమురు గిరాకీ ఇప్పట్లో తగ్గేలా లేదు. ప్రస్తుతం రోజుకు 54 లక్షల బ్యారళ్ల వరకు ఉన్న డిమాండ్ 2050 నాటికి 91 లక్షల బ్యారళ్లకు చేరుతుందని బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) ప్రధాన ఆర్థికవేత్త స్పెన్సర్ డేల్ అంచనా. ఇదే సమయంలో దేశ సహజ వాయువు డిమాండ్ కూడా రెండింతలు పెరిగి 15,300 కోట్ల ఘనపు మీటర్లకు చేరుతుదని తెలిపారు. వచ్చే పాతికేళ్లలో చమురు గిరాకీ మరే దేశంలోనూ ఈ స్థాయిలో పెరగదని తేల్చిచెప్పారు. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి ఎంతగా పెరిగినా భారత ఇంధన వినియోగంలో చమురు వాటా హవా కొనసాగుతుందన్నారు.

నవంబరు 25 నుంచి హైదరాబాద్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): దక్షిణాసియాలోనే అతి పెద్ద పౌల్ట్రీ సదస్సును వచ్చే నెల 25 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) తెలిపింది. సోమవారం నాడిక్కడ ఐపీఈఎంఏ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ దిశగా స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్తు కోసం 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను "వన్ నేషన్ వన్ ఎక్స్‌పో" థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించే ఈ ఎక్స్‌పోలో 1,500కి పైగా ప్రతినిధులు, అంతర్జాతీయ నిపుణులు పాల్గొని సస్టేనబుల్ ఫీడ్ సొల్యూషన్స్ ఆటోమేషన్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాలపై చర్చిస్తారని తెలిపారు. అలాగే 50 దేశాల నుంచి 500కి పైగా ఎగ్జిబిటర్స్ పాల్గొంటారని ఉదయ్ పేర్కొన్నారు.

ఏపీ ప్లాంట్ కోసం రూ.1,908 కోట్ల నిధుల సమీకరణ

హీరో ఫ్యూచర్ ఎనర్జీస్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో నిర్మించనున్న 120 మెగావాట్ల సామర్థ్యం గల పునరుత్పాదక ఇంధన హైబ్రిడ్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకుల నుంచి రూ.1,908 కోట్లు సమీకరించినట్టు హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ప్రకటించింది. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న వేళల్లో అందుకు అవసరమైన విద్యుత్‌ను అందించే ఈ ప్రాజెక్టును ఎస్‌జేవీఎన్‌కు కాంట్రాక్టు ఇచ్చారు. ఇది పవన, సౌర విద్యుత్ రెండింటినీ సమీకృతం చేస్తుంది. తిరిగి చెల్లించేందుకు 21 సంవత్సరాల కాల పరిమితి ఉన్న ఈ నిధుల సహాయంతో ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి ప్రారంభించే వీలు కలుగుతుందని కంపెనీ తెలిపింది.

ఫార్మా ఎగుమతుల కోసం తొలి రీఫర్ రైల్ సర్వీస్

హైదరాబాద్: హైదరాబాద్ సమీపంలోని తిమ్మాపూర్‌లో ఉన్న తమ కేంద్రం నుంచి నవసేవకు (జేఎన్‌పీఏ) తొలి రీఫర్ రైల్ సరకు రవాణా సేవను ఓషియన్ నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ (వన్) సహాయంతో ప్రారంభించినట్టు డీపీ వరల్డ్ తెలిపింది. దీనివల్ల తిమ్మాపూర్ ఐసీడీ నుంచి నవసేవకు రిఫ్రిజిరేటెడ్ రైలు అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. ఇది ప్రధానంగా ప్రాంతీయ ఫార్మా ఎగుమతిదారులకు ఎంతో ఉపయోగపడుతుందని, వారికి అవసరమైన లాజిస్టిక్ సొల్యూషన్లు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. ఈ వీక్లీ సర్వీసు ద్వారా 40 అడుగుల నిడివి గల 43 కంటైనర్లను ఒకే రైలు ద్వారా రవాణా చేసే అవకాశం ఉంటుంది.

లలిత జువెలరీ రూ. 1,700 కోట్ల ఐపీఓ

హైదరాబాద్: మరో జువెలరీ కంపెనీ త్వరలో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. చెన్నై కేంద్రంగా పనిచేసే లలిత జువెలరీ మార్ట్ రూ.1,700 కోట్ల సమీకరణ కోసం ఐపీఓ జారీ చేయనుంది. ఈ ఏడాది జూన్ 6న కంపెనీ ఇందు కోసం క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసింది. ఈ దరఖాస్తుపై సెబీ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయక పోవడంతో కంపెనీ ఐపీఓకు మార్గం సుగమమైంది. ఫ్రెష్ ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,200 కోట్లు, ప్రమోటర్ కిరణ్ కుమార్ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద రూ.500 కోట్ల షేర్లను ఈ ఇష్యూ ద్వారా విక్రయించబోతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా లలిత జువెలరీ మార్ట్ 57 స్టోర్లు నిర్వహిస్తోంది. కాగా కంపెనీ తమిళనాడులో రెండు మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లను నిర్వహిస్తోంది.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

583 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, హెల్త్‌కేర్ రంగ షేర్లలో కొనుగోళ్లతో సోమవారం సెన్సెక్స్ 582.95 పాయింట్లు బలపడి 81,790.12 వద్ద ముగిసింది. ఒక దశలో సూచీ 639.25 పాయింట్లు ఎగబాకి 81,846.42 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, 183.40 పాయింట్ల వృద్ధితో 25,077.65 వద్ద స్థిరపడింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,500 పాయింట్లకు పైగా, నిఫ్టీ 466 పాయింట్లు లాభపడ్డాయి. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.459.84 లక్షల కోట్లకు పెరిగింది.

నిరాశపరిచిన అమీన్‌జీ రబ్బర్: సోమవారం బీఎస్ఈ ఎస్ఎంఈ ఎక్స్ఛేంజీలో లిస్ట్ అయిన హైదరాబాద్ కేంద్రంగా ఉన్న అమీన్‌జీ రబ్బర్ లిమిటెడ్ మదుపరులను నిరాశపరిచింది. ఇటీవల రూ.30 కోట్ల సమీకరణ కోసం ఐపీఓకు వచ్చిన ఈ కంపెనీ ఒక్కో షేరును రూ.95-100కు జారీ చేసింది. సోమవారం బీఎస్ఈలో రూ.101 వద్ద లిస్టయిన కంపెనీ షేరు ఇంట్రాడేలో ఒక దశలో రూ.96.05కు పడిపోయింది. చివరికి రూ.6.05 స్వల్ప లాభంతో రూ.106.05 వద్ద ముగిసింది.

- సాంప్రే న్యూట్రిషన్స్ లిమిటెడ్.. ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్ల (ఎఫ్‌సీసీబీ) జారీ ద్వారా రూ.355 కోట్లు సమీకరించనుంది. ఈ మేరకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం లభించిందని కంపెనీ వెల్లడించింది. రూ.355.06 కోట్లకు సమానమైన ఎఫ్‌సీసీబీలను జారీ చేయటం ద్వారా ఈ మొత్తాలను సమీకరించనుంది. ఈ మొత్తాలను కంపెనీ ఈజిప్ట్, లైబీరియా సహా వర్ధమాన మార్కెట్లలో కార్యకలాపాలను విస్తరించేందుకు ఉపయోగించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	530
వరంగల్	517	గోదావరి	530
చిత్తూరు	528	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	124
వరంగల్	115	గుంటూరు	122
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	119
కర్నూలు	115	నెల్లూరు	124
విశాఖపట్నం	127	అనంతపురం	124
గోదావరి	124		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,20,770 ▲	1,10,700 ▲	1,66,000 ▲
విజయవాడ	1,23,000 ▲	1,17,000 ▲	1,56,850 ▲
విశాఖపట్నం	1,22,920 ▲	1,10,000 ▲	1,67,000 ▲
రాజమండ్రి	1,20,760 ▲	1,10,700 ▲	1,53,800 ▲
ప్రొద్దుటూరు	1,23,700 ▲	1,13,800 ▲	1,55,000 ▲
ముంబై	1,19,249 ▲	1,09,232 ▲	1,48,833 ▲



తజ్మీన్ బ్రిట్స్ (101)

బ్రిట్స్..భళా!

తజ్మీన్ రికార్డు శతకం

కివీస్‌పై సఫారీల గెలుపు

ఇండోర్: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా బోణీ చేసింది. తజ్మీన్ బ్రిట్స్ (101) అసాధారణ ఫామ్‌ను కొనసాగిస్తూ శతకంతో అదరగొట్టడంతో సోమవారం న్యూజిలాండ్‌పై సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఏడాది బ్రిట్స్‌కు ఇది ఐదో వన్డే శతకం కావడం విశేషం. ఈ క్రమంలో ఒక కేలండర్ ఇయర్‌లో నాలుగు శతకాలు బాదిన టీమిండియా స్టార్ స్మృతి మంధాన రికార్డును బ్రిట్స్ అధిగమించింది. మంధాన నిరుడు నాలుగు, ఈ సంవత్సరం కూడా నాలుగు సెంచరీలు చేసింది. ఇక.. ఈ టోర్నీలో తమ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై 69 పరుగులకే కుప్పకూలిన సౌతాఫ్రికా.. కివీస్‌పై ఆల్‌రౌండ్ షో ప్రదర్శించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 47.5 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ సోఫీ డివైన్ (85), బ్రూక్ హ్యాలీడే (45), జార్జియా ప్లిమ్మర్ (31) రాణించారు. స్పిన్నర్ ఎంలబాకు 4 వికెట్లు దక్కాయి. కివీస్ తమ చివరి ఏడు వికెట్లను కేవలం 44 పరుగుల తేడాతో కోల్పోయింది ఆ తర్వాత ఛేదనలో సౌతాఫ్రికా 40.5 ఓవర్లలోనే 234/4 స్కోరుతో నెగ్గింది. రెండో వికెట్‌కు బ్రిట్స్-సున్ లూస్ (83 నాటౌట్) 159 రన్స్ జోడించారు. కెర్‌కు 2 వికెట్లు లభించాయి. బ్రిట్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 47.5 ఓవర్లలో 231 ఆలౌట్ (సోఫీ డివైన్ 85, బ్రూక్ హ్యాలీడే 45, జార్జియా ప్లిమ్మర్ 31, ఎంలబా 4/40); దక్షిణాఫ్రికా: 40.5 ఓవర్లలో 234/4 (తజ్మీన్ బ్రిట్స్ 101, సున్ లూస్ 83 నాటౌట్, కెర్ 2/62).

ప్రపంచ కప్‌లో నేడు

ఇంగ్లండ్ X బంగ్లాదేశ్

మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

విశాఖ చేరుకున్న హర్మన్ సేన

9న దక్షిణాఫ్రికాతో మ్యాచ్



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): దక్షిణాఫ్రికాతో ఈనెల తొమ్మిదిన జరిగే మహిళల ప్రపంచ కప్ వన్డే మ్యాచ్‌లో తలపడే భారత జట్టు సోమవారం నగరానికి చేరుకుంది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటికే శ్రీలంక, పాకిస్థాన్ జట్లపై విజయాలు సాధించి మంచి ఊపుమీదుంది. భారత జట్టుకు విశాఖ విమానాశ్రయంలో ఆంధ్ర క్రికెట్ సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. భారత క్రికెటర్లు మంగళవారం సాయంత్రం సాధన చేస్తారు.

మిథాలీ పేరిట స్టాండ్

గేటుకు కల్పన పేరు

విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఒక స్టాండ్‌కు భారత మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరును, అలాగే స్టేడియంలోని ఓ గేటుకు మరో క్రికెటర్ రావి కల్పనల పేరు పెట్టనున్నారు. ఆదివారం ఇక్కడ భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మహిళల వరల్డ్‌కప్ మ్యాచ్ సందర్భంగా వీటిని ఆవిష్కరించనున్నారు. ఇటీవలే ఓ చాట్ షోలో మహిళా క్రికెటర్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని మంత్రి నారా లోకేష్‌కు స్మృతి మంధాన విజ్ఞప్తి చేసింది. తక్షణం స్పందించిన లోకేష్ స్టాండ్స్‌కు మహిళా క్రికెటర్ల పేర్లు పెట్టే ప్రతిపాదన చేయగా ఏసీఏ ఆమోదించింది.

డోపింగ్‌లో మళ్లీ దొరికిన ధనలక్ష్మి



న్యూఢిల్లీ: తమిళనాడు స్ప్రింటర్ ధనలక్ష్మీ శేఖర్ రెండోసారి డోపింగ్‌లో పట్టుబడింది. పంజాబ్‌లో జరిగిన ఓపెన్ అథ్లెటిక్ మీట్ సందర్భంగా జూలై 27న ఆమె నుంచి సేకరించిన శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకం డ్రొస్టానెలోన్ ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో నాడా ఆమెపై తాత్కాలిక సస్పెన్షన్ విధించింది. అంతకుముందు పది రోజుల క్రితం..అంటే జూలై 17న ఆమెపై ఉన్న నిషేధం తొలగిపోయింది. ఇక ధనలక్ష్మి రెండోసారి డోపీగా పట్టుబడడంతో విచారణ అనంతరం ఆమెపై 8ఏళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది.

వెళ్లి ఆటో నడుపుకోమంటారు

విమర్శకులపై సిరాజ్



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో పేసర్ మహ్మద్ సిరాజ్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో నిలకడగా చోటు దక్కించుకుంటున్నాడు. అయితే కెరీర్ ఆరంభంలో సరిగ్గా రాణించకపోవడంతో విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగితేనే ఫలితం ఉంటుందని సిరాజ్ చెబుతున్నాడు. 'నువ్వు బాగా రాణిస్తే అభిమానులతో పాటు క్రీడాలోకం కూడా సిరాజ్‌లాంటి బౌలర్ మరొకరు లేడంటూ పొగుడుతారు. అదే విఫలమైతే.. 'నువ్వేం బౌలర్‌వి? వెళ్లి మీ తండ్రితో కలిసి ఆటో నడుపుకో' అంటూ విమర్శిస్తారు. అంత త్వరగా వీరు తమ అభిప్రాయాలను ఎలా మార్చుకుంటారు? అందుకే బయట నుంచి వచ్చే కామెంట్స్, విమర్శలను పట్టించుకోకూడదనుకున్నా. నా జట్టు సభ్యులు, కుటుంబం ఎలా ఆలోచిస్తున్నారన్నదే నాకు ముఖ్యం. ఇతరుల గురించి నాకనవసరం' అని సిరాజ్ స్పష్టం చేశాడు. భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పుడు ధోనీ కూడా తనకిదే సలహా ఇచ్చినట్టు గుర్తుచేసుకున్నాడు.

ఫైనల్లో హుస్సాముద్దీన్

చెన్నై: తెలుగు బాక్సర్ మొహమ్మద్ హుస్సాముద్దీన్ బీఎఫ్ఐ కప్ ఫైనల్లో ప్రవేశించి పతకం ఖాయం చేసుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల 55-60 కిలోల సెమీస్ బౌట్‌లో హుస్సాముద్దీన్ 5-0తో మితేష్ దేశ్వాల్ (రైల్వేస్)ను చిత్తుగా ఓడించాడు. మిగతా బాక్సర్లలో మాజీ వరల్డ్ చాంపియన్ అనుక్షిత బోరో, అరుంధతి చౌధురి స్వర్ణాలు సాధించారు. అనుక్షిత (అస్సాం) 60-65 కిలోల కేటగిరీ ఫైనల్లో 3-2తో పార్థవి (రాజస్థాన్)పై, 65-70 కిలోల ఫైనల్ బౌట్‌లో అరుంధతి (సర్వీసెస్) 5-0తో స్నేహ (ఏపీ)పై విజయం సాధించారు. 45-48 కిలోల ఫైనల్లో నివేదిత (ఉత్తరాఖండ్) 3-2తో మంజు రాణి (రైల్వేస్)ని ఓడించి విజేతగా నిలిచింది. భావన శర్మ (రైల్వేస్) 5-0తో సవిత (రైల్వేస్)పై నెగ్గి బంగారు పతకం దక్కించుకుంది.

ఢిల్లీ జోరు



చెన్నై: ప్రొ.కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ జోరు కొనసాగిస్తోంది. సోమవారం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో 29-26తో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌కు షాకిచ్చింది. ఈ గెలుపుతో తాజా సీజన్‌లో 20 పాయింట్లు సాధించిన తొలి జట్టుగా ఢిల్లీ నిలిచింది. ఢిల్లీ జట్టులో అషుమాలిక్ (8), సందీప్ (7) సత్తా చాటారు. రెజా, దీపాన్షు హైఫైవ్‌తో మెరిసినా జైపూర్‌కు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 36-28తో యూపీ యోధాస్‌ను చిత్తు చేసింది.

భగత్‌కు మూడు స్వర్ణాలు

అబియా పారా బ్యాడ్మింటన్



న్యూఢిల్లీ: నైజీరియాలో జరిగిన అబియా పారా బ్యాడ్మింటన్ టోర్నీలో ఏస్ షట్లర్ ప్రమోద్ భగత్ మూడు స్వర్ణాలు సాధించాడు. టోక్యో పారాలింపిక్స్‌లో పసిడి పతకం నెగ్గిన ప్రమోద్.. ఆ తర్వాత నాడాకు మూడు సార్లు తాను ఎక్కడ ఉన్నదీ తెలియజేయలేదు. దీంతో 18 నెలల నిషేధానికి గురైన భగత్.. పారిస్ పారాలింపిక్స్‌లో ఆడలేకపోయాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్ 3 కేటగిరీలో భారత షట్లర్ల మధ్య జరిగిన ఫైనల్లో ప్రమోద్ 21-7, 9-21, 21-9తో మాంటు కుమార్‌పై గెలిచాడు. డబుల్స్ తుదిపోరులో ప్రమోద్-సుకాంత్ కదమ్ జోడీ 21-13, 21-17తో నెగ్గింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆర్తీ పాటిల్‌తో కలసి ఆడిన ప్రమోద్ మూడో బంగారు పతకాన్ని సొంతం చేసుకొన్నాడు. మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో రజతం సాధించిన ఉమా సర్కార్.. డబుల్స్‌లో ఆర్తితో కలసి కాంస్యం అందుకొంది. డబ్ల్యూహెచ్1 విభాగంలో రంజిత్ సింగ్ మూడు కాంస్యాలు దక్కించుకొన్నాడు. ఎస్‌యు5 కేటగిరీలో కరణ్, రాహుల్, సతివద స్వర్ణ, రజత, కాంస్యాలతో క్లీన్‌స్వీప్ చేశారు.



జట్టు సంస్కృతి దెబ్బతినకూడదనే..

రోహిత్‌కు పగ్గాలివ్వలేదా?

ముంబై: ఆస్ట్రేలియాలో పర్యటనకు ఇటీవల ప్రకటించిన భారత జట్టులో రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. టీ20లు, టెస్టుల నుంచి వైదొలగిన హిట్‌మ్యాన్ కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్నాడు. కానీ ఒక ఫార్మాట్‌కే సారథిగా ఉన్న రోహిత్ తనదైన శైలిలో జట్టును నడిపిస్తాడని.. అది జట్టుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ భావిస్తున్నట్టు సమాచారం. 'రోహిత్ స్థాయి ఆటగాడు నాయకత్వ బాధ్యతల్లో ఉంటే..డ్రెస్సింగ్ రూమ్‌లో తనదైన ముద్ర వేస్తాడు. ఒకే ఫార్మాట్‌లో.. అది కూడా ఎప్పుడో జరిగే వన్డేలకు అతడు కెప్టెన్‌గా ఉండడం జట్టు సంస్కృతిని దెబ్బ తీస్తుంది' అని బీసీసీఐ ముఖ్యుడొకరు వెల్లడించారు. కోచ్‌గా నియమితుడైన గంభీర్ తొలి ఆరు నెలలు జట్టుపై ఏమాత్రం పట్టు సాధించలేకపోయాడట. అయితే న్యూజిలాండ్‌తో స్వదేశంలో, ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టు టెస్టులు ఓడిపోవడం గంభీర్‌కు కలిసొచ్చింది. ఆ రెండు సిరీస్‌లలో పరాజయాల అనంతరం కోచ్‌గా గంభీర్ జట్టును తన చేతుల్లోకి తీసుకున్నాడట.



చేదు వార్తలు వినాల్సి రావచ్చు..

వన్డే వరల్డ్ కప్‌కు జట్టును సన్నద్ధం చేసే క్రమంలో రోహిత్ శర్మను సారథ్య బాధ్యతల నుంచి తప్పించి ఉంటారని దిగ్గజ బ్యాటర్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయంతో రోహిత్ కూడా ఏకీభవిస్తాడని చెప్పాడు. '2027 ప్రపంచ కప్‌కు రోహిత్ సిద్ధంగా ఉంటాడో లేదో తెలియదు. అతడు వన్డేలే ఆడుతున్నాడు. అంతర్జాతీయ కేలండర్‌ను చూస్తే భారత జట్టు పెద్దగా 50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడబోవడంలేదు. ఏడాదికి ఐదు నుంచి ఏడు వన్డేలు ఆడితే వరల్డ్ కప్‌లాంటి పెద్ద టోర్నీకి కావాల్సినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించదు. అందుకే శుభ్‌మన్‌ను సన్నద్ధం చేసేందుకు కెప్టెన్సీపై నిర్ణయం తీసుకొని ఉంటారు. పైగా..50 ఓవర్ల ఫార్మాట్‌కు జట్టు యాజమాన్యం ప్రణాళికలను పటిష్టం చేసుకోవాలని భావిస్తున్నందున రాబోయే రోజుల్లో మరిన్ని చేదు వార్తలు వినాల్సి రావొచ్చు' అని గవాస్కర్ అన్నాడు. అంటే..రోహిత్ వన్డేలకూ వీడ్కోలు పలుకుతాడన్న అభిప్రాయాన్ని గవాస్కర్ పరోక్షంగా చెప్పాడన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

గిల్‌పై అగార్కర్ ఒత్తిడి తెచ్చాడు!



వన్డే జట్టు సారథ్యం నుంచి రోహిత్‌ను తొలగించడాన్ని టీమిండియా మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ తప్పుబట్టాడు. అంతేకాదు..వన్డే జట్టు కెప్టెన్సీ చేపట్టాలని గిల్‌పై చీఫ్ సెలెక్టర్ అగార్కర్ ఒత్తిడి తెచ్చి ఉంటాడని అభిప్రాయపడ్డాడు.

ముంబై వరుసగా రెండో విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) సీజన్-4లో ముంబై మీటియర్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం రాత్రి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబై 3-0తో (15-9, 15-8, 15-12) డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్‌పై గెలిచింది. ఈ గెలుపుతో ముంబై పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. ముంబై సారథి అమిత్ గులియాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 7-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 189

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి ఉ.9:17 తదుపరి పాడ్యమి తె.5:53 వరకు; నక్షత్రం: రేవతి రా.1:28 తదుపరి అశ్విని; వర్జ్యం: మ.2:45-4:10, దుర్ముహూర్తం: ఉ.8:31-9:18, రా.9:56-10:43; అమృతఘడియలు: రా.11:19-12:45, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:10, సూర్యాస్తమయం: 5:55

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీశైలం చరిత్రలోనే అత్యధిక వరద


జూన్ నుంచి ఇప్పటిదాకా ప్రాజెక్టులోకి 2,105 టీఎంసీల ఇన్‌ఫ్లో

ఈ వాటర్ ఇయర్‌లో మరో 100 టీఎంసీలు వచ్చే అవకాశం

1994, 2022లో 2,039 టీఎంసీల చొప్పున శ్రీశైలంలోకి వరద

నాగార్జునసాగర్‌కు ఇప్పటిదాకా 1,578 టీఎంసీల ఇన్‌ఫ్లో

బంగాళాఖాతంలోకి 3,905 టీఎంసీల గోదావరి జలాలు



9



సీజేఐపై బూటు విసరబోయిన లాయర్!

సుప్రీం కోర్టు హాల్లో దిగ్భ్రాంతికర ఘటన.. మధ్యలోనే అడ్డుకున్న భద్రతా సిబ్బంది

సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదంటూ నిందితుడు రాకేశ్ కిశోర్ నినాదాలు

విష్ణుమూర్తి విగ్రహం కేసులో జస్టిస్ గవాయ్ చేసిన వ్యాఖ్యలపై నిరసన.. లాయర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

దాడియత్నంపై చలించని జస్టిస్ గవాయ్.. విచారణలు కొనసాగించిన జడ్జిలు.. నిందితుడిపై కేసుకు సుప్రీంకోర్టు నిరాకరణ

3 గంటల తర్వాత నిందితుడి విడుదల.. బార్ కౌన్సిల్ సభ్యత్వం తాత్కాలికంగా రద్దు.. దేశంలో ఎక్కడా వాదించకుండా చర్యలు

దాడి ఘటనను తీవ్రంగా ఖండించిన ఖర్గే, సోనియా, రేవంత్, పవార్, పినరయి.. గవాయ్‌కు ఫోన్‌లో మోదీ పరామర్శ



▶ రాకేశ్ కిశోర్

న్యూఢిల్లీ, అక్టోబరు 6: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కోర్టు హాలులో సోమవారం దిగ్భ్రాంతికర సంఘటన జరిగింది. 71 సంవత్సరాల వృద్ధ న్యాయవాది ఒకరు జస్టిస్ గవాయ్ బెంచ్ మీదకు బూటు విసరబోయారు. అయితే, పక్కనే ఉన్న భద్రతా సిబ్బంది విజయవంతంగా బూటు బెంచ్ వరకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సంఘటన జరిగినప్పుడు జస్టిస్ గవాయ్ చలించలేదు. "మీరు పట్టించుకోవొకండి. మేం పట్టించుకోం. ఇలాంటి సంఘటనలు నన్ను ప్రభావితం చేయలేవు. మీ పని కానివ్వండి" అని న్యాయవాదులను ఉద్దేశించి అన్నారు. ఉదయం 11.35కు జస్టిస్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాదులు అత్యవసర కేసులను ప్రస్తావిస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఢిల్లీలోని మయూర్

మిగతా 10వ పేజీలో...

హైకోర్టులోనే తేల్చుకోండి

బీసీలకు 42% రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా?

ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు దాఖలు చేశారు?

పిటిషనర్‌కు సరైన సలహా ఇవ్వాలి కదా?.. న్యాయవాదిని ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం

జీవో 9ను సవాలు చేస్తూ వేసిన పిటిషన్ కొట్టివేత



న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. విచారణ పరిధి మేరకు హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లను 25 నుంచి 42 శాతానికి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబరులో జీవో 9 తీసుకొచ్చింది. ఆ జీవో రాజ్యాంగ విరుద్ధమని ఆరోపిస్తూ వంగా గోపాల్‌రెడ్డి ఈ నెల 4న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. "బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో 9ని తీసుకొచ్చింది. ఎస్సీలకు 15, ఎస్టీలకు 10 శాతంతో కలిపి రిజర్వేషన్లు 67 శాతానికి చేరతాయి. ఇది రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 2018లోని 'సెక్షన్ 285ఏ'కు విరుద్ధం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 243డీ, 243టీ కింద ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే. ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా సహా అనేక రాజ్యాంగ ధర్మాసనం తీర్పులు నిర్దేశించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఉల్లంఘించడమే. గతంలో మహారాష్ట్ర, బిహార్, రాజస్థాన్‌లు 50% పరిమితిని అధిగమించడానికి చేసిన ప్రయత్నాలను కోర్టులు కొట్టివేశాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని జీవో 9పై స్టే విధించండి" అని గోపాల్‌రెడ్డి కోరారు. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. రాష్ట్ర సర్కారు తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వి, సిద్ధార్థ్ దవే, ఏడీఎన్ రావు హాజరయ్యారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9ని సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేశామని, దీనిపై అత్యవసరంగా విచారించాలని అభ్యర్థించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందిస్తూ.. 'హైకోర్టు స్టే ఇవ్వకపోతే ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు వస్తారా? అసలు 32 ప్రకారం పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారు' అని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ.. దసరా సెలవులకు ముందు, హైకోర్టు చివరి పని దినం ముగిసిన తర్వాత స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం

మిగతా 11వ పేజీలో...

బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు!

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు శుభ పరిణామం

హైకోర్టులోనూ సానుకూల తీర్పే ఆశిస్తున్నాం

రిజర్వేషన్ల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

న్యాయ ప్రక్రియలోనూ బీజేపీ, బీఆర్ఎస్‌లు సహకరించాలి: మంత్రి పొన్నం

42%పై అన్ని వర్గాలూ సహకరించాలి

ప్రభుత్వ, పార్టీ పరంగానూ పోరాడి సాధిస్తాం: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

కోర్టుల్లో పిటిషన్లు ఉపసంహరించుకోవాలి: మల్లు రవి

11

గంపగుత్తగా 42 శాతం చెల్లదు

ఏబీసీడీలుగా బీసీలకు ఇవ్వాలి

ఉమ్మడిగా ఇస్తే ఎంబీసీలు అన్యాయమైపోతారు

జీవోను కొట్టేయాలంటూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు

జీవోను సమర్థిస్తూ వీహెచ్ మరికొందరి పిటిషన్లు



బిహార్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తున్న సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు

బిహార్ దంగల్ షురూ

అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

రెండు దశల్లో ఎన్నికలు.. నవంబరు 6, 11 తేదీల్లో పోలింగ్

14న ఓట్ల లెక్కింపు, ఫలితాలు.. సీట్లు 243.. మొత్తం ఓటర్లు 7.43 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. బిహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ చెప్పారు. నవంబరు 6, 11 తేదీల్లో పోలింగ్ జరుగుతుందని, 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్, వివేక్ జోషిలతో కలసి ఆయన ఈ వివరాలను వెల్లడించారు. అన్ని ఎన్నికల కన్నా ఈ ఎన్నికలు చాలా ముఖ్యమైనవని అభివర్ణించారు. అక్టోబరు నెలాఖరులో జరిగే ఛత్ పూజ ఉత్సవాల తర్వాత ఎన్నికలు జరపాలని

మిగతా 10వ పేజీలో...

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చే నెల 11న

ఈ నెల 13 నుంచి నామినేషన్లు

21 తుదిగడువు.. 22న పరిశీలన

24 దాకా ఉపసంహరణకు చాన్స్

నవంబరు 14న ఓట్ల లెక్కింపు

హైదరాబాద్ జిల్లాలో కోడ్

నేడో రేపో కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు

నేడు చర్చించనున్న సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్, మీనాక్షి

3 పేర్లతో అధిష్ఠానానికి జాబితా!

8

రోగనిరోధక వ్యవస్థపై పరిశోధనలు చేసిన ముగ్గురికి వైద్య నోబెల్

అమెరికా శాస్త్రవేత్తలు మేరీ బ్రన్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, జపాన్ శాస్త్రవేత్త సకగూచీలకు సంయుక్తంగా ప్రకటన

10



దాడిలో తీవ్రంగా గాయపడి రక్తమోడుతున్న ముఖంతో బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము

బెంగాల్లో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేపై దాడి

ఎంపీ ఖగెన్ ముర్ము తలకు తీవ్ర గాయాలు

వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల సందర్శనకు వెళ్లిన ఎంపీ, ఎమ్మెల్యేపై టీఎంసీ దాడి

బెంగాల్‌లో ఆటవిక రాజ్యం: బీజేపీ

ఇది బీజేపీ స్వయంకృతం: తృణమూల్

10



ఎలి లిల్లీ కంపెనీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రూ.8,800 కోట్లు

రాష్ట్రంలో అమెరికా దిగ్గజ ఫార్మా కంపెనీ ఎలి లిల్లీ పెట్టుబడులు

దేశంలోనే ఆ కంపెనీ తొలి తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటుకు సిద్ధం

సీఎం రేవంత్‌రెడ్డితో సంస్థ ప్రతినిధుల చర్చలు

వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు

త్వరలోనే నియామకాలు: కంపెనీ ప్రకటన

తెలంగాణకు ఇది ఒక గర్వకారణం

ఫార్మా కంపెనీలను ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఔషధ తయారీ కంపెనీ ఎలి లిల్లీ.. భారతదేశంలోనే తమ మొట్టమొదటి తయారీ కేంద్రాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. దీనికోసం 100 కోట్ల డాలర్ల (రూ.8,871 కోట్లు) పెట్టుబడులు పెడతామని తెలిపింది. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎలి లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, ఎలి లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్, సీఎం ప్రత్యేక కార్యదర్శి

మిగతా 11వ పేజీలో...

ఎకరానికి 177 కోట్లు!

రాష్ట్ర స్థిరాస్తి రంగ చరిత్రలో సరికొత్త రికార్డు

7.67 ఎకరాల భూమి రూ.1357 కోట్లు.. దుర్గంచెరువు పక్కనే కొండపై భూమి

వేలంలో కొన్న ఎంఎస్ఎన్ రియాల్టీ.. ఎకరం 152 కిలోల బంగారంతో సమానం

11 ఎకరాలు రూ.1,556 కోట్లకు కొన్న ప్రెస్టీజ్.. ప్రభుత్వానికి 3,135 కోట్ల ఆదాయం

మూడేళ్ల కిందట ఎకరం వంద కోట్లు.. నాడు రాజపుష్ప కొనుగోలు చేసిందే రికార్డు



రాయదుర్గం ఐటీ పార్కులో రికార్డు ధరకు టీజీఐఐసీ విక్రయించిన భూమి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వేలం బంగారమైంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మరోసారి రికార్డులు తిరగ రాసింది. ఓల్డ్ బాంబే హైవేకు, దుర్గం చెరువుకు మధ్య రాయదుర్గం ఐటీపార్క్‌లో భాగంగా ఉన్న కొండపై ఏడున్నర ఎకరాల భూమి రాష్ట్ర చరిత్రలోనే ఎరుగనంత రికార్డు స్థాయి ధరకు అమ్ముడు పోయింది.. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) నిర్వహించిన వేలంలో ఈ భూమి ఏకంగా ఎకరానికి రూ.177 కోట్లు పలికింది. మొత్తం 7.67 ఎకరాలకు రూ.1,357 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ వేలంతో తెలంగాణ భూమి విలువ కొత్త మైలురాయి నమోదు చేసింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2022లో నిర్వహించిన కోకాపేట్‌లోని నియోపోలిస్ వేలంలో ఎకరానికి రూ.100.75 కోట్ల

మిగతా 8వ పేజీలో...

మల్లోజుల లొంగుబాట!

మావోయిస్టు పార్టీని వీడేందుకు సిద్ధమైన అగ్రనేత?

పోలీసులతో సంప్రదింపులు? సమాచారం లేదంటున్న పోలీసులు

తాజాగా మల్లోజుల వేణుగోపాల్ మరో లేఖ విడుదల

పార్టీ తప్పిదాలే పోరాటాన్ని దెబ్బతీశాయి.. ప్రాణత్యాగాలను ఆపాలి

పార్టీ నష్టాలకు నేనూ కారకుడ్నే.. అందుకే తప్పుకొంటున్నా: మల్లోజుల

12

ఐసీయూలో ఆరుగురు ఆహుతి

- జైపూర్‌లోని ప్రభుత్వాస్పత్రిలో విద్యుదాఘాతం!
- ట్రామా సెంటర్‌లో వేగంగా మంటలు వ్యాప్తి
- అక్కడ చికిత్స పొందుతున్న 11 మందిలో ఐదుగురిని రక్షించిన సహాయ సిబ్బంది
- విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

10



వారంలోగా పత్తి కొనుగోళ్లు షురూ!

9

తెల్ల బంగారం కొనుగోళ్లకు తొలగిన అడ్డంకులు

జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐతో తుమ్మల చర్చలు సఫలం

జాబ్‌వర్క్ టెండర్లలో పాల్గొనాలని మిల్లర్ల నిర్ణయం

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నితీశ్‌కుమార్ ఎటుంటే బిహార్‌లో అధికారం అటు పరుగు దీస్తుందని ఆయన పార్టీవారు గొప్పగా చెబుతూంటారు. రెండుదశాబ్దాలుగా బిహార్‌లో జరుగుతున్నదేమిటో తెలిసిందే కనుక, గిట్టనివారు సైతం నిజమేనని అనక తప్పడం లేదు. ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటించడంతో, బిహార్‌లో ఏ పార్టీ గెలుస్తుందన్న ప్రశ్నకంటే, నితీశ్ మళ్ళీ సీఎం అవుతారా? అన్న చర్చే ఎక్కువగా సాగుతోంది. మొన్న శనివారం ప్రధాని సమక్షంలో జరిగిన ఒక జాతీయస్థాయి సమావేశంలో పాట్నానుంచి వర్చువల్‌గా పాల్గొన్న నితీశ్ నిముషానికి పైగా చేతులు జోడించి నమస్కారాలు పెడుతూ, వాటిని అదే పనిగా ఊపుతూ, అర్థంలేని చూపులు చూస్తున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. ప్రధాని మోదీని ప్రసన్నం చేసుకోవడానికి నితీశ్ మరీ సాగిలబడిపోతూ బిహారీల పరువు తీసేస్తున్నారని ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్ ఘాటుగా విమర్శించారు. నితీశ్ ఇలా వింతగా ప్రవర్తించడం కొత్తేమీ కాదంటూ, తనకు స్వాగతం పలుకుతూ ఒక మొక్కని అందించినవారి నెత్తిమీదే దానిని తిరిగి ఉంచి నితీశ్ నవ్వుతూండటం, జాతీయగీతాన్ని లక్ష్యపెట్టకుండా ఒక సీనియర్ అధికారితో ముచ్చట్లు పెట్టడం వంటి మరికొన్ని వీడియోలు కూడా ఈ ఎన్నికలవేళ ప్రచారంలోకి వస్తున్నాయి. ఈ సుశాసన్ బాబు మానసిక స్థితి సరిగా లేదనీ, 74ఏళ్ళ ఈయన ఇక బిహార్‌ను ఏలేందుకు ఎంతమాత్రం సమర్థుడుకాదని తేజస్వి అవకాశం దొరికినప్పుడల్లా ప్రచారం చేస్తూనే ఉన్నారు. అయితే, మళ్ళీ నితీశేనా? అన్న ప్రశ్న ఆయన ఆరోగ్యస్థితినుంచి పుట్టినది కాదు. బీజేపీ గతంలో లాగానే ఈమారు కూడా ఆయనపట్ల ఉదారంగా ఉంటుందా? అన్న అనుమానం వల్ల.

దేశవ్యాప్తంగా ఓటరుజాబితాల ప్రక్షాళనకు బిహార్ పునాదిగా, ప్రయోగ కేంద్రంగా ఎన్నికల సంఘానికి ఉపకరించింది. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) విపక్షాలకూ, ఎన్నికల సంఘానికీ మధ్య తీవ్రస్థాయి ఘర్షణ సృష్టించింది. రమారమి ఓ

బిహార్ భేరీ

యాబైలక్షల పేర్లు తొలగిన తరువాత ఇప్పుడు తుదిజాబితాలో మిగిలిన 7. 42కోట్లమంది ఓటర్లు రాజకీయపార్టీల భవిష్యత్తును నిర్ణయించబోతున్నారు. దేశవ్యాప్తంగా అమలు చేయాలనుకుంటున్న 17 కొత్త సంస్కరణలు కూడా బిహార్‌నుంచే మొదలవుతున్నాయి. ఒక పోలింగ్ బూత్‌ను 1200మంది ఓటర్లకు మాత్రమే పరిమితం చేయడం, ఈవీఎంల మీద అభ్యర్థుల కలర్ ఫోటోలు, ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును ముందుకు జరిపి, తప్పనిసరి చేయడం ఇత్యాదివి ఆహ్వానించదగినవి. రాహుల్ చేసిన'ఓట్ చోరీ' ఆరోపణలు, యాత్రలు ఎన్నికల సంఘాన్ని ఆత్మరక్షణలోకి నెట్టినమాట నిజం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో ఈసీ కుమ్మక్కయిందని, జాబితా ప్రక్షాళన పేరుతో విపక్షాల ఓట్లను గల్లంతుచేశారని ఆ పార్టీలు ఆరోపించడం, 'సర్'కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానంలో పలు కేసులు దాఖలు కావడం, చివరకు కోర్టు ఆదేశాల మేరకు ఓటరు యోగ్యతాపత్రంగా ఆధార్‌ను సైతం పరిగణనలోకి తీసుకోవడానికి ఈసీ తప్పనిసరిగా అంగీకరించడం తెలిసినవే. జాబితాలో తొలగింపులు, జోడింపుల అక్రమాలు బయటపడకుండా ఉండటానికే ఎన్నికల సంఘం మెషీన్ రీడబుల్ ఫార్మేట్‌లో ఓటరు లిస్టులు అందివ్వడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. ఈవీఎం డేటా, బ్యాటరీ లాగ్స్, సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వడానికి ఈసీ నిరాకరించడం, పైపెచ్చు నలభైఐదు రోజుల్లో ఫుటేజ్‌ను నాశనం చేయాలని కలెక్టర్లను ఆదేశించడం కూడా వివాదాస్పదమైనాయి. 'సర్'ను సవాలు చేయడంతో పాటు, ఎలక్షన్ కమిషనర్ల నియామక ప్రక్రియను కూడా తప్పుబడుతూ సుప్రీంకోర్టులో కేసులు దాఖలైనాయి. చీఫ్ జస్టిస్ స్థానంలో ప్రధాని నియమించిన ఒక మంత్రిని సెలక్షన్ ప్యానెల్‌లోకి తెచ్చి, ఎన్నికల సంఘాన్ని అధికారపక్షం హస్తగతం చేసుకుందంటూ విపక్షాలు మరోమారు విరుచుకుపడ్డాయి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కూడా గతానికి భిన్నంగా రాజకీయపార్టీలతో గట్టిగానే పోరాడారు.

ఐదేళ్ళక్రితం ఎన్నికల్లో మహాగఠ్బంధన్ కంటే ఓ పదిహేను అసెంబ్లీ స్థానాలను అధికంగా తెచ్చుకొని ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. అరవైఏనిమిది శాతం స్ట్రైక్‌రేట్‌తో 74సీట్లను నెగ్గుకొచ్చిన బీజేపీ, 37శాతం స్ట్రైక్‌రేట్‌తో 43సీట్లను మాత్రమే గెలుచుకున్న నితీశ్‌ను తమ అధినాయకత్వం ముఖ్యమంత్రి పీఠంమీద కూచోబెట్టినందుకు బిహార్ బీజేపీ నాయకులకు ఇప్పటికీ ఎంతో బాధగా ఉంది. ఈ మారు ఏమాత్రం లెక్కలో తేడా వచ్చినా, ఆ ఔదార్యం కొనసాగనివ్వకూడదని వారి వాదన, ఆవేదన.

రైతు క్షేమమా, ట్రంప్ స్నేహమా.. ఏది ముఖ్యం?

అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య ఒప్పందాలు, వాటికి సంబంధించిన సంస్థలు అన్నీ సంపన్న దేశాల ప్రయోజనాల కోసమే ఉన్నాయన్నది కాదనలేని నిజం. కాకులను కొట్టి గద్దలకు వేసినట్టు పేద, వర్ధమాన దేశాల మీద అభివృద్ధి చెందిన దేశాల పెత్తనాన్ని బలోపేతం చేయడానికే అవి అవతరించాయి. అప్పటికీ సంతృప్తి చెందని అమెరికా ఈ ఒప్పందాలు నిర్దేశించిన నియమాలను కూడా కాలరాస్తున్నది.

అమెరికా తన రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తూ, వారు పండించిన పంటలను తక్కువ ధరలకు ఎగుమతి చేసుకొని లాభపడేలా చూస్తున్నది. ఇది వర్ధమాన దేశాల్లో వ్యవసాయ సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. ఇంకా జన్యుమార్పిడి పంటల భారీ ఎగుమతి, వాణిజ్య పంటల సాగును మితి మించి ప్రోత్సహించడం వంటి చర్యలతో అమెరికా వంటి సంపన్న దేశాలు పేద దేశాల సాగు వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఆహారభద్రతకు హాని తెస్తున్నాయి.

అంతర్జాతీయ ఒప్పందాలు ఎంతగా సంపన్న దేశాలకు, బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు దాస్యం చేస్తున్నప్పటికీ వర్ధమాన దేశాల మేలు కోరి ఒకటీ అరా నియమాలను చేర్చకపోలేదు. 1995లో ఏర్పాటైన ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) సభ్య దేశాలు పరిమిత సుంకాలకు కట్టుబడాలనే నియమాన్ని విధించింది. ఈ సుంకాలను దాటాలంటే చర్చలు తప్పనిసరి అనే నిబంధననూ చేర్చింది. ఈ 'tariff bindings' ప్రకారం అమెరికా అన్ని రకాల విదేశీ సామగ్రి పైన సగటున 3.4 శాతానికి మించి సుంకాలను విధించకూడదు. అయితే చివరకు ఈ నిబంధనలన్నీ ఏనుగును పురికొస తాళ్ళతో బంధించినట్లే అయ్యింది. అమెరికా విశృంఖలత్వాన్ని ఆపే శక్తి వీటికి కొరవడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) ఇండియా తదితర వర్ధమాన, పేద దేశాలకు కొన్ని వెసులుబాట్లు కల్పించింది. వాటినే ప్రత్యేక వెసులుబాట్లు (special differential treatment – STD)గా పరిగణిస్తారు. విదేశీ వస్తువుల మీద తాము విధించే అధిక సుంకాలను క్రమక్రమంగా తగ్గించే అవకాశాన్ని ఈ నిబంధన అభివృద్ధి చెందుతున్న దేశాలకు కల్పించింది. దేశీయ కీలక రంగాలను సంపన్న దేశాల సరకుల దాడి నుంచి కాపాడుకోవడంలో ఇండియాకు ఈ ఎస్‌టీడీ ఉపయోగపడుతున్నది. ఆర్థిక బలహీన దేశాలు తమ వ్యవసాయాది రంగాలను కాపాడుకోడానికి సంపన్న దేశాల ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేయడానికి ఈ వెసులుబాటు అవకాశమిస్తున్నది. ఇండియా భారీ సుంకాలు విధిస్తున్నదని ట్రంప్ గగ్గోలు పెట్టడానికి ఇదే కారణం. ఇవి నియమబద్ధ సుంకాలు. ఇండియాతో వాణిజ్య లోటు తగ్గించుకోడానికి స్టీల్ దిగుమతుల మీద 25శాతం, అల్యూమినియం మీద 10 శాతం సుంకాలను అమెరికా విధించి ఉంది. అమెరికా వాణిజ్య చట్టం 232 సెక్షన్ కింద జాతీయ భద్రతా వసరాల కోసం వీటిని విధించినట్టు చెప్పుకున్నది. వాణిజ్య ఒప్పందాలను జాతీయ భద్రత పేరుతో ఉల్లంఘించడం అక్రమమని ప్రపంచ వాణిజ్య సంస్థ తీర్పు ఇచ్చింది. అయినా అమెరికా దూకుడు ఆగలేదు.

వాణిజ్య రంగంలో ఇండియాను బూటు కాళ్ళతో తొక్కిపట్టి తన షరతులకు అంగీకరింపజేయాలని ట్రంప్ తెగబడుతున్నాడు. ప్రధాని మోదీ తన సన్నిహిత మిత్రుడు అంటూనే భారతీయ సరకులపై 25శాతం సుంకంతోబాటు రష్యా నుంచి క్రూడాయిల్‌ను కొంటున్నందుకు అదనంగా మరి 25శాతం, మొత్తంగా 50 శాతం సుంకాలను విధించాడు. ట్రంప్ విధించిన ఈ 50శాతం సుంకాలు అమెరికాకు భారతీయ ఎగుమతులను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. ఆగస్టు 6 వరకు 10 శాతం సుంకాలనే భరించిన ఇండియా ఆ నెల 27 వరకు 25 శాతం, ఆ తర్వాత నుంచి 50 శాతం సుంకాలను చెల్లిస్తున్నది. ఈ విధంగా అధిక సుంకాల భారం ఆగస్టులో పరిమితమే అయినప్పటికీ ఆ కొద్ది రోజుల్లోనే ఇండియా నుంచి అమెరికాకు స్మార్ట్ ఫోన్ల ఎగుమతులు 58శాతం తగ్గిపోయాయి, మందుల ఎగుమతులు 13.3శాతం పతనమయ్యాయి. అల్యూమినియం 19శాతం; ఇనుము, స్టీలు 13.1 శాతం; రాగి 10.2 శాతం పడిపోయాయి. రొయ్యల వంటి సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతులు 43.8శాతం దెబ్బతిన్నాయి. ఈ అన్ని రంగాల్లోను దేశంలో ఉద్యోగాలు గణనీయంగా మాయమయ్యాయి. నిరుద్యోగం ప్రబలుతున్నది.

> భారత సువిశాల మార్కెట్‌పై అమెరికా కన్నేసింది. మన రైతుల ప్రయోజనాలపై పడగ నీడ పరిచింది. చవకగా లభిస్తున్న రష్యా చమురును కొనుగోలు చేయడం ఇండియా చేస్తున్న నేరంగా అమెరికా చూపిస్తున్నది. ఈ అమెరికా వైఖరి వల్ల రష్యా, చైనాలకు ఇండియా చేరువ కాక తప్పటం లేదు.

వాస్తవానికి ఇండియాపై ట్రంప్ కోపానికి కారణం మనం రష్యా నుంచి ఆయిల్ కొనడం ఒక్కటే కాదని, అమెరికా నుంచి జన్యు మార్పిడి మొక్కలను (మొక్కజొన్న) కొనుగోలు చేయకపోడమేనని స్పష్టపడిపోయింది. '140 కోట్ల జనాభా గల ఇండియా అమెరికా నుంచి ఒక బషేల్ (27.2 కిలోలు) మొక్కజొన్న కొనలేదా?' అని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లూత్నిక్ హుంకరించాడు. 'ఇండియా మెడలు వంచి అమెరికా మొక్కజొన్నను కొనిపిస్తాం చూడండి' అని గాండ్రించాడు. ప్రపంచంలోని అత్యధిక మొక్కజొన్న ఉత్పత్తిదార్లలో ఇండియా ఐదవ స్థానంలో ఉంది. దాని పంటే దానికి ఎక్కువైపోతున్నప్పుడు దానిని దిగుమతి చేసుకోవలసిన అవసరం ఇండియాకు లేదు. ఇండియాలో 50 కోట్లమంది వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. ఇలాంటప్పుడు అధిక సబ్సిడీల చౌక వ్యవసాయోత్పత్తులను అమెరికా నుంచి దిగుమతి చేసుకొని దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసుకోడం అంటే తానెక్కిన కొమ్మను నరుక్కోడమే అవుతుంది.



ట్రంప్ ప్రకటించిన ఏకపక్ష టారిఫ్ యుద్ధం అమెరికాకు మేలు చేయకపోగా తీవ్ర సంక్షోభాన్ని దాని మెడకు చుడుతున్నది. ధరలు పెరిగిపోయి అమెరికా పౌరుల జేబులు గుల్ల అయ్యే పరిస్థితి తలెత్తింది. చైనా మీద సుంకాలు పెంచడంతో అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి చేసుకోవడం అది మానుకున్నది. ప్రపంచంలో పండే సోయాబీన్ పంటలో 60శాతాన్ని చైనా దిగుమతి చేసుకుంటున్నది. ఇందులో సగం అమెరికా నుంచే కొనేది. ఇప్పుడు అది అమెరికా నుంచి కొనడం మానేసింది. ఆ మేరకు సోయాబీన్‌ను బ్రెజిల్ నుంచి కొంటున్నది. దీనితో అమెరికా రైతు నష్టాల్లో కూరుకుపోయాడు. ముఖ్యంగా ట్రంప్ మద్దతుదార్లు, మితవాద రైతులు అత్యధికంగా ఉన్న మధ్య అమెరికా రాష్ట్రాల (లోవా, నెబ్రెస్కా, కన్సాస్ తదితర రాష్ట్రాలు) సోయాబీన్, మొక్కజొన్న పంటలకు ఎగుమతి ద్వారాలు మూసుకుపోయాయి. దీనితో ఇండియాను భయపెట్టి తన జన్యు మార్పిడి మొక్కజొన్నను కొనుగోలు చేసేలా ఒప్పించాలని అమెరికా అన్ని ఉపాయాలను ప్రయోగిస్తున్నది. అమెరికా రైతు వర్గం చాలా బలమైనది. ఒక్కొక్క రైతుకీ కనీసపక్షం 500 నుంచి 10,000 ఎకరాల భూమి ఉంటుంది. వీరి లాభాల కోసం ఒకటి, అర ఎకరాల కమతాలు మాత్రమే ఉండే భారతీయ బక్క రైతు రక్తాన్ని మరింతగా పీల్చుకోవాలని అమెరికా చూస్తున్నది.

అమెరికన్ల అసంతృప్తి పెరిగి ఉప్పొంగితే తప్ప ట్రంప్ తలకు ఎక్కిన ఉన్మాదం తగ్గుముఖం పట్టదు. ట్రంప్‌తో దోస్తీనా, దేశీయ రైతు క్షేమమా... ఈ రెండిటిలో ఏది ముఖ్యమో తేల్చుకోలేక ప్రధాని మోదీ గుంజాటన పడుతున్నారు. ఇప్పటికే అమెరికా పత్తి దిగుమతులపై సుంకాలను మనం తాత్కాలికంగా తొలగించి దానిని పొడిగిస్తూ ఉన్నాం. చైనా మాదిరిగా అమెరికా సరకులపై ప్రతి సుంకాలను విధించి సవాలు చేయడానికి ఇంకా భయపడుతున్నాం. ఇది మోదీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నది. అమెరికా కపట మైత్రి, దాని భారీ సుంకాల వాస్తవికత ఎంతగా గాయపరుస్తున్నా, వాణిజ్య చర్చల్లో ఏదో ఒక సానుకూలత లభిస్తే మళ్ళీ దాని పంచన చేరవచ్చని బహుశా మోదీ ఎదురు చూస్తుండవచ్చు.

రక్తం చవి చూడనిదే పులి వదిలిపెట్టదనే సంగతి అందరికీ తెలిసిందే. భారత సువిశాల మార్కెట్‌పై అమెరికా కన్నేసింది. మన రైతుల ప్రయోజనాలపై పడగ నీడ పరిచింది. చవకగా లభిస్తున్న రష్యా చమురును కొనుగోలు చేయడం ఇండియా చేస్తున్న నేరంగా అమెరికా చూపిస్తున్నది. ఈ అమెరికా వైఖరి వల్ల రష్యా, చైనాలకు ఇండియా చేరువ కాక తప్పటం లేదు. మున్ముందు సైతం ఈ సాన్నిహిత్యాన్ని బలోపేతం చేసుకుని చైనాతో సరిహద్దు వివాదాన్ని కూడా ఉభయ హితంగా పరిష్కరించుకోగలిగితే ఇండియాకు గణనీయమైన మేలు జరుగుతుంది.

◆ గార శ్రీరామమూర్తి
సీనియర్ పాత్రికేయులు

గ్రామీణాభివృద్ధికి సీఎస్ఆర్ చేయూత

కంపెనీలు తమ నికర లాభంలో కొంత భాగాన్ని సమాజానికి ఉపయోగపడే పనుల కోసం ఖర్చు చేయడం- కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్). కంపెనీల చట్టం–2013 ప్రకారం, పెద్ద సంస్థలు తమ సగటు నికర లాభాలలో కనీసం రెండు శాతం తప్పనిసరిగా విద్య, ఆరోగ్యం, పర్యావరణం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలపై ఖర్చు చేయాలి. ఇది చాలా మంచి నిర్ణయం. ఎందుకంటే ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు పేదల సంక్షేమం, విద్య, వైద్యం, గ్రామ రహదారులు, పర్యావరణ రక్షణ లాంటి కార్యక్రమాలకు వెళ్తున్నాయి. దీంతో వ్యాపార సంస్థలు కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యత కూడా తీసుకుంటున్నాయి.

ఈ చట్టం అమలులో ఉన్నప్పటికీ, కంపెనీలు తమ కార్యాలయాలు, పరిశ్రమలు ఉన్న కేవలం నగరాల పరిసర ప్రాంతాలలోనే వీటిని ఖర్చు పెట్టడానికి ఇష్టపడుతున్నాయి. 70 శాతం ప్రజలు నివసిస్తున్న మారుమూల గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాలు, వెనుకబడిన జిల్లాలకు మాత్రం తక్కువ నిధులు వెళ్తున్నాయి. పట్టణాలలో జరిపే కార్యక్రమాల ద్వారా ఎక్కువ ప్రచారం, గుర్తింపు లభిస్తాయని కంపెనీలు భావిస్తున్నాయి. అందువల్ల ఎక్కువ అవసరం ఉన్న మారుమూల ప్రాంతాలకు సీఎస్ఆర్ నిధులు చేరడం లేదు. ఈ విధానం, నిధుల నిరుపయోగానికి దారితీస్తున్నది. ఇది దేశ సమగ్రాభివృద్ధి లక్ష్యానికి విరుద్ధం.

సామాజిక, ఆర్థిక స్థితిగతులు, వనరుల లభ్యత ఆధారంగా భారత ప్రభుత్వం కొన్ని జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించింది. ఇవి విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల పరంగా వెనుకబడి ఉన్నాయి. 2018లో నీతీ ఆయోగ్ 'ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రామ్' ప్రారంభించింది. దేశంలో వందకి పైగా జిల్లాలను గుర్తించి, వీటిని త్వరగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, నీటి వనరులు, నైపుణ్యాభివృద్ధి–ఉపాధి, రహదారులు, విద్యుత్, కనెక్టివిటీ లాంటి వాటిని ప్రధాన రంగాలుగా ఎంపిక చేసింది. ఈ ప్రాంతాల అభివృద్ధిపై ఎక్కువ నిధులు కేటాయించి, తగిన మౌలిక వసతులను కల్పిస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.



> పట్టణాలలో అభివృద్ధి జరిగితే అది సమగ్రాభివృద్ధి అనిపించుకోదు. గ్రామాలలో విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. కనీసం ఒక శాతం సీఎస్ఆర్ నిధులు వెనుకబడిన జిల్లాల్లో తప్పనిసరిగా ఖర్చు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించాలి.

చిన్న చిన్న పెట్టుబడులు గ్రామాలలో పెద్ద మార్పులను తీసుకురాగలవు. గ్రామాల మధ్య రహదారులు వేస్తే వందల కుటుంబాలు మార్కెట్, పాఠశాల, ఆసుపత్రి వంటి వాటికి సులభంగా వెళ్లగలుగుతాయి. ఆరోగ్య కార్యక్రమాల వల్ల మాతా–శిశు మరణాలు తగ్గుతాయి. నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. చెరువుల మరమ్మతు వల్ల వందల ఎకరాల్లో పంటలు పండుతాయి. ఇలా సీఎస్ఆర్ పెట్టుబడి వల్ల జీవన ప్రమాణాలు పెరుగుతాయి, వలసలు తగ్గుతాయి, గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

చాలా గ్రామాల్లో రహదారులు, తాగు నీరు, విద్యుత్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు లేవు. సరైన పాఠశాలలు, టీచర్లు లేకపోవడం వల్ల గిరిజన పిల్లల్లో డ్రాప్‌ఔట్ రేటు ఎక్కువ. పోషకాహార లోపం, మాతా–శిశు మరణాలు, కాలానుగుణ వ్యాధులు ఎక్కువ. వీటి నివారణకు మొబైల్ హెల్త్ యూనిట్లు, అవగాహన కార్యక్రమాలు అవసరం. వర్షాధార వ్యవసాయం వల్ల రైతులు నష్టపోతున్నారు. సీఎస్ఆర్ ద్వారా నీటి వనరులు, నైపుణ్యాభివృద్ధి, చిన్న వ్యాపారాలకు సహాయం చేయవచ్చు. గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధిలో భాగం కావడానికి సీఎస్ఆర్ నిధులు తోడ్పడతాయి.

టాటా స్టీల్ సంస్థవారు జార్ఖండ్ గిరిజన ప్రాంతాల్లో మాతా–శిశు ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేశారు. దీనివల్ల శిశు మరణాలు తగ్గాయి. ఐటీసీ కంపెనీ మధ్యప్రదేశ్ మారుమూల ప్రాంతాల రైతులకు డిజిటల్ కియోస్క్‌లను అందజేసింది. రైతులు పంట ధరలు, వాతావరణ సమాచారం, కొత్త పద్ధతులు తెలుసుకొని ఎక్కువ లాభం పొందుతున్నారు.

తెలంగాణలోని, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలలో కే–ఫిన్–టెక్, టెరాడేటా, మెడ్‌ప్లస్ వంటి కార్పొరేట్ సంస్థల సహకారంతో సాగునీటి బావులు, సోలార్ కంచెలు, వాటర్–షెడ్ లాంటి అనేక పనులను ఏకలవ్య ఫౌండేషన్ చేపట్టింది. దీంతో గతంలో ఒక్క పంట పండించే రైతులు, ఇప్పుడు రెండు పంటలు పండిస్తున్నారు. 30 శాతం వరకు ఆదాయం పెరిగి, వలసలు తగ్గాయి. వేదాంత సంస్థ ఒడిశా, రాజస్థాన్ గిరిజన ప్రాంతాల్లో ఆధునిక అంగన్‌వాడీలను నిర్మించింది. చిన్నారులకు విద్య, పోషకాహారం, ఆరోగ్యం అందించడంతో పాటు మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు.

గిరిజన, మారుమూల ప్రాంతాలలో సీఎస్ఆర్ ప్రాజెక్టులు అమలు చేయడానికి కొన్ని అడ్డంకులు ఉన్నాయి. సరైన రోడ్లు లేకపోవడం వల్ల ఆయా ప్రాంతాలకు చేరుకోవడం కష్టంగా ఉంది. విశ్వసనీయతతో పనిచేసే స్వచ్ఛంద సంస్థల కొరత ఉన్నది. స్థానిక పరిస్థితులు, భాషలు తెలిసిన యోగ్యమైన సిబ్బంది అందుబాటులో లేరు. సీఎస్ఆర్ సంస్థలు మారుమూల ప్రాంతాలలో పనిచేయడానికి సిద్ధంగా లేవు. గ్రామీణ ప్రాంతాలలో మార్పునకు కొంత ఎక్కువ సమయం పడుతుంది. అందుకు సంస్థలు సిద్ధం కావడం లేదు.

కనీసం ఒక శాతం సీఎస్ఆర్ నిధులు వెనుకబడిన జిల్లాల్లో తప్పనిసరిగా ఖర్చు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించాలి. వెనుకబడిన జిల్లాల్లో ప్రాజెక్టులు చేపట్టిన కంపెనీలకు ప్రభుత్వం అవార్డులు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి. స్థానిక ప్రభుత్వాలు, నీతీ ఆయోగ్, ఎన్జీఓలతో కలిసి ప్రాజెక్టులు అమలు చేయాలి. మొబైల్ యాప్‌లు, శాటిలైట్ మ్యాపింగ్ వాడి ప్రాజెక్టులను పర్యవేక్షించాలి. గ్రామాల సమూహాన్ని ఒక క్లస్టర్‌గా దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధికి యోచన చేయాలి.

కేవలం పట్టణాలలో అభివృద్ధి జరిగితే అది సమగ్రాభివృద్ధి అనిపించుకోదు. గ్రామాలలో విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. వ్యవసాయ రంగం, గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి చెందితే యువతకు జీవనోపాధితో పాటు నగరవాసులకు అవసరమైన నిత్యావసరాలు అందుబాటులోకి వస్తాయి. భారతదేశానికి మూలం గ్రామాలే. గ్రామాల బాగుకు ప్రభుత్వ కృషికి సీఎస్ఆర్ నిధుల సహకారం ఎంతైనా అవసరం.

• పి. వేణుగోపాల్‌రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు

ఏడాది యాదిలో కొత్త టీచర్లు

2024 డీఎస్సీ ద్వారా ఎంపికయిన 10,500 మంది ఉపాధ్యాయులు అక్టోబర్ 9తో ఒక సంవత్సరం సర్వీస్ పూర్తి చేసుకుంటున్నారు. ఏడాది కాలంగా కొత్త టీచర్లు విన్నూత పద్ధతిలో బోధన చేయడమే కాకుండా, ఇతర అంశాల్లో ఎంతో పరిణతి చెందిన ఉపాధ్యాయులుగా అనుభవం గడించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2017, 2024లో మాత్రమే డీఎస్సీ నిర్వహించారు. క్రమంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, గురుకుల పాఠశాలలు రావడం కూడా డీఎస్సీపై ప్రభావం చూపింది. అయితే ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయడంలో కాలయాపనతో అభ్యర్థులు 2017 డీఎస్సీ కోసం ప్రత్యక్ష ఆందోళనతో పాటు సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేసి విజయం సాధించారు. ఇక అనేక ఆందోళనల నేపథ్యంలో మళ్ళీ 2023లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ అతి తక్కువ పోస్టులు మంజూరు చేయడంతో అభ్యర్థులు నిరాశ చెంది, ఆందోళనలు చేశారు. అప్పుడే సాధారణ ఎన్నికల కోడ్ రావడం, కొత్త ప్రభుత్వం రావడంతో పరీక్షలు వాయిదాపడ్డాయి. అంతలోనే లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండడంతో మరిన్ని టీచర్ పోస్టులు జత చేసి డీఎస్సీ రీ నోటిఫికేషన్ జారీ చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేయగా, ఎన్నికల కోడ్ వచ్చే లోపే 11,062 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి, వేగంగా పరీక్షలు నిర్వహించి, నియామక ప్రక్రియ పూర్తి చేశారు. ముఖ్యమంత్రి, అధికారులు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంతో 2024 సెప్టెంబర్ 30న ఫలితాలు విడుదలయ్యాయి. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా డీఎస్సీ నియామక పత్రాలు అందుకోవడం మరువలేని ఘట్టం.

– రావుల రామ్మోహన్‌రెడ్డి

పౌర సమాజం మూడో కన్ను తెరవాలి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి (అక్టోబర్ 7) 22 నెలలు. సాధారణంగా మనుషులకు 21 సంవత్సరాలు నిండితే మానసికంగా కొంత పరిణతి వస్తుందని భావిస్తారు. ఐదేళ్ల పరిపాలనకు ఓటర్ల నుంచి అనుమతి పొందిన ఏ ప్రభుత్వమైనా 22 నెలల కాలంలో రాజకీయ పరిణతితో, తన పాలనా ప్రాధాన్యతలను నిర్ణయించుకుంటుందని ఆశిస్తాం. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి పరిణతితో వ్యవహరించడం లేదనే విషయం పౌర సమాజానికి స్పష్టంగా అర్థమవుతోంది. ప్రభుత్వంపై సాధారణ ప్రజలలో రోజురోజుకూ పెరుగుతున్న అసంతృప్తిని కూడా పౌర సమాజం గమనిస్తోంది.

గత పదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించి, ప్రజల పక్షాన పని చేసింది పౌర సమాజం. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా "రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని, ఫాసిస్టు పోకడలు కలిగిన బీజేపీని రాష్ట్రంలో బలపడకుండా చూడాలని" ప్రజలకు పిలుపు ఇచ్చింది. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేసిన తప్పులను విస్తృతంగా ప్రచారం చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఈ ప్రచారం పరోక్షంగా ఉపయోగపడింది. ఈ ప్రచారం సాగిస్తున్న కాలంలో, గత కాంగ్రెస్ ప్రభుత్వాల తప్పులు, ఆ పార్టీ ఆర్థిక, పారిశ్రామిక విధానాలు, గత కాంగ్రెస్ ప్రభుత్వాలలో సాగిన అవినీతి, ఆ పార్టీ నాయకుల ఫ్యూడల్ మనస్తత్వాల పట్ల పౌర సమాజానికి స్పష్టత ఉంది. కానీ దేశంలో, రాష్ట్రంలో ఉన్న ఒక ప్రత్యేక పరిస్థితిలో మాత్రమే పౌర సమాజం ఆనాడు తన రాజకీయ వైఖరిని నిర్ణయించుకుంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ప్రజల సమస్యలన్నీ పరిష్కారమవుతాయనే భ్రమ కూడా ఆనాడు పౌర సమాజానికి లేదు. కానీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరెస్సెస్‌పై సాగిస్తున్న సైద్ధాంతిక పోరాటం, రాష్ట్ర ప్రజలకు ఆయన ఇచ్చిన హామీలు, కేంద్రంలో బీజేపీ సాగిస్తున్న అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమి ముందుకు రావడం వంటి పరిణామాల వల్ల కాంగ్రెస్ గత ప్రభుత్వాల పాలనా తీరుకు కొంత భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వ పాలన ఉంటుందని పౌర సమాజం ఆశించింది.

ప్రజా సంఘాలు, పౌర సమాజ బృందాలతో నిత్య సమన్వయంతో, ప్రజల సమస్యలపై లోతైన చర్చలతో, విచక్షణతో కూడిన, పర్యావరణ హితమైన అభివృద్ధి నమూనాతో రేవంత్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని పౌర సమాజం ఆశించింది. దళితులు, ఆదివాసీలు, అత్యంత వెనుకబడిన వర్గాలు, మతపర మైనారిటీలు, ఆర్థికంగా పేద ప్రజలకు మేలు చేసే బడ్జెట్ ప్రాధాన్యతలతో ఈ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని భావించింది. ఆరు గ్యారంటీలతో పాటు, ప్రజాస్వామిక పాలన 7వ గ్యారంటీగా ఇచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ప్రజల హక్కులను హరించడంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను పునరావృతం చేయబోదని కూడా ఆశించింది.

> కాంగ్రెస్ పార్టీ తన అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన అనేక హామీలు అమలు కావడం లేదు. ముఖ్యంగా వికలాంగులు, వితంతు మహిళలు, వృద్ధులు సహా లక్షలాది పేదలకు అందాల్సిన కొత్త ఆసరా పెంఛన్ల ప్రక్రియ మొదలు కాలేదు. రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధుల అమలుకు నిర్దిష్ట ప్రణాళికే లేదు. ఆదివాసీలకు అడవిపై హక్కులు దఖలు పడేలా, వారికి సామూదాయక హక్కులు కల్పించకపోగా, పులుల సంరక్షణ, అభయారణ్యాల పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొడుతోంది.



కానీ గత 22 నెలలలో ఈ ఆశలేవీ నెరవేరలేదు.

ప్రభుత్వం ఏర్పడిన మొదటి దశలో తప్ప, రాష్ట్ర ముఖ్యమంత్రి పౌర సమాజ ప్రతినిధులను, ప్రజాసంఘాల ప్రతినిధులను కలవడమే లేదు. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం కూడా పౌర సమాజంతో చర్చించడం లేదు. దీనికి తోడు గత ప్రభుత్వం లాగే ప్రజా సంఘాల కార్యకర్తల ముందస్తు అరెస్టులు, గ్రామాలలో ప్రజల సభలకు అనుమతి నిరాకరణ, ప్రజలను కలవడానికి వెళుతున్న పౌర సమాజ, ప్రజా సంఘాల ప్రతినిధులను అరెస్టు చెయ్యడం వంటి చర్యలకు పాల్పడుతున్నది.

కాంగ్రెస్ పార్టీ తన అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన అనేక హామీలు అమలు కావడం లేదు. ముఖ్యంగా వికలాంగులు, వితంతు మహిళలు, వృద్ధులు సహా లక్షలాది పేదలకు అందాల్సిన కొత్త ఆసరా పెంఛన్ల ప్రక్రియ మొదలు కాలేదు. రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధుల అమలుకు నిర్దిష్ట ప్రణాళికే లేదు. ఆదివాసీలకు అడవిపై హక్కులు దఖలు పడేలా, వారికి సాముదాయక హక్కులు కల్పించకపోగా, పులుల సంరక్షణ, అభయారణ్యాల పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొడుతోంది.

రాష్ట్రంలో 2011 చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తిస్తామనీ, వారికి రైతు భరోసా సహాయం అందిస్తామనీ; వ్యవసాయ కూలీలను కూడా రైతు బీమా పరిధిలోకి తీసుకువస్తామనీ; సమగ్ర వ్యవసాయ విధానం రూపొందిస్తామనీ, సమగ్ర పంటల బీమా పథకం అమలు చేస్తామనీ, శాస్త్రీయ పంటల ప్రణాళిక రూపొందిస్తామనీ ఇచ్చిన హామీలు అమలు కాలేదు.


గిగ్, ప్లాట్‌ఫారం కార్మికులకు సమగ్ర చట్టం తెస్తామనీ, హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామనీ, బీడీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తామన్న హామీలు అమలు కాలేదు. అలాగే ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరిస్తామనీ, మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ. పదివేలు వేతనం ఇస్తామనీ, అన్ని ప్రభుత్వరంగ సంస్థలలో కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామనీ ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదు.

విద్యా రంగానికి హామీ ఇచ్చినట్లుగా 15 శాతం బడ్జెట్ కేటాయించకుండా, విద్యా రంగంలో వేసిన కమిషన్ ఇప్పటికే ఇచ్చిన సిఫారసులను అమలు చేయకుండా, కొత్త జీవో జారీ చేసి మరో కమిషన్ వేయడం ఇంకా జాప్యం చేయడానికే. ఇప్పటికే సమస్యలతో ఇబ్బందిపడుతున్న వేలాది ప్రభుత్వ స్కూళ్లను, రెసిడెన్షియల్ స్కూళ్లను బాగు చేయకుండా, ఒక్కో స్కూల్‌కు 200 కోట్ల రూపాయలతో 100కు పైగా కొత్త స్కూళ్లకు నిధులు కేటాయించడానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, మళ్ళీ 30 వేల కోట్లు అప్పు చేయడమంటే రాజకీయ నేతలను, కాంట్రాక్టర్లను పోషించడానికే అని అర్థం.

సమగ్ర ప్రాజెక్టు రిపోర్టులు లేకుండానే మెట్రో రైల్ విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డు, మూసీ నది పునరుద్ధరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రాష్ట్రమంతా 8, 12 లేన్ల రహదారుల పేరుతో రేవంత్ ప్రభుత్వం ముందుకు తెస్తున్న అభివృద్ధి నమూనా బీజేపీ, బీఆర్ఎస్‌లు అమలు చేసిన పాత అభివృద్ధి నమూనాకు భిన్నమైనది కాదు. యూపీఏ ప్రభుత్వం తెచ్చిన 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా, కేసీఆర్ తెచ్చిన 2016 భూసేకరణ చట్టం అమలు చేసి, రైతుల నుంచి లక్షలాది ఎకరాలను గుంజుకునే నమూనా ఇది. దళితుల చేతుల్లో ఉన్న కొద్దిపాటి భూములు లాక్కునే రియల్ ఎస్టేట్ అభివృద్ధి నమూనా.

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఈ విషయాలపై లోతుగా సమీక్షించుకుని, జరిగిన తప్పులను, నడుస్తున్న మార్గాన్ని సవరించుకోవాలి. పౌర సమాజంతో, ప్రజా సంఘాలతో చర్చించి, సరైన విధానాలు అమలుచేయాలి. ప్రాధాన్యతలు నిర్ణయించుకుని, ప్రజలకు, ముఖ్యంగా పేదలకు ఇచ్చిన హామీలను వేగంగా అమలు చేయకపోతే ఈ ప్రభుత్వం చేజేతులా తన ప్రతిష్ఠను పోగొట్టుకుంటుంది. రాష్ట్రంలో మళ్ళీ బీజేపీ కూటమి పెరుగుదలకు కారణమవుతుంది. ప్రభుత్వ తప్పులను పౌర సమాజం ప్రశ్నించకపోతే, ప్రజల గొంతు బలహీనమవుతుంది. పౌర సమాజం తన ప్రతిష్ఠను కోల్పోతుంది. అది మొత్తం సమాజానికి మరింత నష్టం.

▪ కన్నెగంటి రవి
సామాజిక కార్యకర్త





ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

• వరంగల్ కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన నోడల్ అధికారులతో మాట్లాడుతూ.. సమన్వయంతో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. ఓటరు జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, సిబ్బంది నియామకం, పోలింగ్ సామగ్రి సరఫరా వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమలయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుశాఖతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. నోడల్ అధికారులకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్ పనులు వేగవంతం చేయాలి

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు మాస్టర్ ప్లాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించినందున పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెగా టెక్స్‌టైల్ పార్కులో గ్రీన్ కవరింగ్, ఆర్వోబీ పనులు, కుడా లేఔట్, డ్రెయినేజీ, విద్యుత్, తాగునీటి వసతి తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మీ, ఇండస్ట్రీయల్ జోనల్ మేనేజర్ స్వామి, కుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అజిత్‌రెడ్డి, గీసుగొండ, సంగెం తహసీల్దార్లు రియాజుద్దీన్, జి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ 'డీల'ర్లు



హనుమకొండ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు కమీషన్ చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వ కమీషన్ వాటా డీలర్లకు ఇంకా విడుదల కాలేదు. బకాయిలు ఎప్పుడెప్పుడు అందుతాయా.. అని డీలర్లు ఎదురు చూస్తున్నారు. దసరా పండుగ క్రమంలో కేంద్రం కరుణిస్తుందని ఆశించగా డీలర్లకు నిరాశే మిగిలింది. ఈ మాసం తొలి వారం ముగుస్తున్నా ఇంకా కమీషన్ విషయంలో కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలను కేంద్రం పట్టించుకోవడం లేదనే ఆగ్రహానికి డీలర్లు గురవుతున్నారు. ఇక ఉపేక్షించేది లేదని, త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా షాపుల నిరవధిక బంద్ పాటించాలనే నిర్ణయానికి వస్తున్నారు. రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. రెండు ప్రభుత్వాల వాటా కమీషన్ రూపంలో డీలర్లకు చేరుతుంది. కిలో బియ్యం పంపిణీకి రూ.1.40 పైసల కమీషన్ చొప్పున డీలర్‌కు చెల్లింపు ఉంటుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.0.50 చెల్లిస్తుంది. కేంద్రం రూ.0.90 పైసలను భరిస్తూ ఈ మేరకు డీలర్ ఎన్ని కిలోలు పంపిణీ చేస్తే ఆ లెక్కన కమీషన్ డబ్బులు అందుకుంటాడు. ఈ లెక్కన ప్రతీ నెల డీలర్‌కు కమీషన్ డబ్బులు అందాల్సి ఉంటుంది. ఈ విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. డీలర్లు రోడ్లెక్కి నిరసనలు, ధర్నాలు చేయడంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతులోని ఐదు నెలల కమీషన్ బకాయిలను విడుదల చేసింది. కానీ, కేంద్రం మాత్రం ఇప్పటికీ స్పందించకపోవడమే డీలర్లకు ఆగ్రహాన్ని కలిగిస్తోంది.

రూ.12.5 కోట్లకు పైగా బకాయిలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,200 రేషన్ షాపులు ఉన్నాయి. షాపులకు సంబంధించిన డీలర్లకు కేంద్ర ప్రభుత్వ కమీషన్ వాటా డబ్బులు రూ.12.5 కోట్లకు పైగా విడుదల కావాల్సి ఉంది. ఒక్కో డీలర్‌కు రూ.50వేల నుంచి లక్షకు పైగా డబ్బులు రావాల్సి ఉంది. దసరా పండుగ ఖర్చులకు అయినా డబ్బులు చేతిలో పడుతాయనే ఆశతో డీలర్లు ఉండగా కేంద్రం కిమ్మనలేదు. అక్టోబరు నెల కూడా రావడంతో ఆరు నెలల కమీషన్ బకాయిలు అందక డీలర్లు అప్పుల పాలవుతున్నారు. షాపుల అద్దెలు కూడా చెల్లించని దుస్థితిలో ఉన్నామంటూ వాపోతున్నారు.

ఆరు నెలలుగా అందని కమీషన్

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.12.5 కోట్లు పెండింగ్
- ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి లక్షకు పైగా బకాయి
- రాష్ట్రం కరుణించినా.. కనికరించని కేంద్రం
- షాపుల బంద్‌కు సిద్ధమవుతున్న డీలర్లు

ముఖ్యమంత్రికి విజ్ఞప్తి..

ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు, తదితర ప్రతినిధులు హైదరాబాద్‌లో కలిశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు కమీషన్ విడుదలను ప్రస్తావించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విడుదల చేయించాలని కోరారు. అదే విధంగా అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని విన్నవించారు. ఇప్పటికీ కమీషన్ డబ్బులు రాకపోవడంతో మరోసారి ముఖ్యమంత్రిని కలువాలని డీలర్లు భావిస్తున్నారు. తమ పరిస్థితిని వివరించి కేంద్రంపై మరింత ఒత్తిడి తెచ్చేలా చూడాలని ముఖ్యమంత్రిని వేడుకోనున్నట్లు డీలర్లు చెబుతున్నారు.

బకాయిలను కేంద్రం తక్షణమే విడుదల చేయాలి

బత్తుల రమేశ్ బాబు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం తక్షణమే రేషన్ డీలర్ల కమీషన్ బకాయిలను విడుదల చేయాలి. లేదంటే షాపులను నిరవధికంగా బంద్ చేస్తాం. సన్న బియ్యం సరఫరా కావడంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదనే బంద్ విషయంలో ప్రస్తుతానికి వెనక్కు తగ్గాం. ఇదే పరిస్థితి కొనసాగితే తప్పక బంద్ పాటిస్తాం. ఇందుకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంతో మాట్లాడి మా సమస్య పరిష్కారించాలని విజ్ఞప్తి. కమీషన్ డబ్బులు నెల నెలా క్రమంగా విడుదల చేయాలి. కమీషన్ డబ్బులను రూ.300కు పెంచడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విన్నవించుకుంటున్నాం.

నిరవధిక బంద్ దిశగా డీలర్లు

దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని కేంద్రం కమీషన్ డబ్బులు విడుదల చేస్తుందని డీలర్లు ఆశించారు. అప్పటికే షాపుల నిరవధిక బంద్ పాటించాలనే నిర్ణయానికి వచ్చిన డీలర్లు పండుగ సమయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు సృష్టించరాదనే భావంతో వేచి చూశారు. కానీ, అక్టోబరు కూడా రావడం ఆరు నెలలుగా బకాయిలు అందకపోవడంతో ఇక రేషన్ షాపుల నిరవధిక బంద్‌కు సిద్ధమవ్వడమే మార్గమనే నిర్ణయానికి డీలర్లు వస్తున్నారు.

బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయండి

నగర మేయర్ గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్



రెండు కంపెనీల అధికారులతో మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో 80 నుంచి 100 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి చేసేందుకు కావాల్సిన సామర్థ్యం గల మిథనైజేషన్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు పలు కంపెనీల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీపీఎస్‌లో భాగంగా శక్తి పీడబ్ల్యూసీ ఏజెన్సీ అధికారులు బయో గ్యాస్ తయారీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బయో గ్యాస్ తయారీ కోసం రెండు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని, డీపీఆర్‌లు సిద్ధం చేయడం జరుగుతుందని అన్నారు. వరంగల్ నగరంలో 10ఎకరాల స్థలంలో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని రెండు కంపెనీల సూచనల మేరకు చెత్త సేకరణలో నూతన ఆవిష్కరణలు చేయనున్నట్టు మేయర్ తెలిపారు. ఇందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు మహేందర్, రవికుమార్, సంతోష్‌బాబు, ఎన్ఐయూ కో- ఆర్డినేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైన్‌లలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి

వరంగల్ ట్రైసిటీస్‌లోని డ్రైన్‌లలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను సూచించారు. సోమవారం వరంగల్ నగరంలో 24, 29 డివిజన్‌లలోని మట్టెవాడ, రామన్నపేట, కాకతీయ టాకీస్‌లతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి ప్రజల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై మేయర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి శానిటేషన్ అధికారులు, సిబ్బందిని మందలించారు. పైప్‌లైన్, డ్రైనేజీల శుభ్రం, మంచి నీటి సరఫరాపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్‌లలో ఆగిపోయిన అభివృద్ధి పనులను పునరుద్ధరించాలని సూచించారు. ఇంకా జంక్షన్‌లలో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపించాలన్నారు. పాత విద్యుత్ స్తంభాల స్థలంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని అన్నారు. రామన్నపేట గాంధీ బొమ్మ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీకాంత్, వార్డ్ ఆఫీసర్ సాయికుమార్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపి కబురు



- ప్రమోషన్లు ఇచ్చేందుకు పాలకమండలి ఆమోదం
- కాంట్రాక్టు అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయస్సు పెంపు
- పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలకు పచ్చజెండా
- వర్సిటీ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఓకే..

5

పాకాలలో త్వరలో సఫారి టూర్



- వన్యప్రాణుల మధ్య 2 గంటల ప్రయాణం
- పర్యాటకులకు పూర్తి స్థాయిలో కనువిందు

5

మద్యం టెండర్లకు 14 దరఖాస్తులు

వరంగల్ క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ (వరంగల్ అర్బన్) జిల్లాలోని 69 మద్యం షాపులకు గాను ఈ నెల 25న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా గడిచిన 11 రోజుల్లో 14 దరఖాస్తులు వచ్చినట్టు వరంగల్ అర్బన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. 5వ తేదీ వరకు 7 దరఖాస్తులు రాగా 6వ తేదీ వరకు మరో 7 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. వరంగల్ (వరంగల్ రూరల్) జిల్లాలోని 57 మద్యం షాపులకు గాను 6వ తేదీ వరకు 4 దరఖాస్తులు వచ్చినట్లు సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్‌ల్ల ఎక్సైజ్ సీఐ పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్



బీఆర్ఎస్‌ది ధోకా పాలన... మాది ప్రజాపాలన

హనుమకొండ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బీఆర్ఎస్ పాలన 'ధోకా పాలన' కాగా.. అభివృద్ధి, సంక్షేమంలో కాంగ్రెస్‌ది ప్రజాపాలనగా ఘనత పొందుతోందని హనుమకొండ జిల్లా కాం గ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలన వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీలను పొందుపరుస్తూ రూపొందించిన 'బీఆర్ఎస్ ధోకా పాలన' కార్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. మాజీ మంత్రి కేటీఆర్ 'బాకీ' కార్డులంటూ విడుదల చేయడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమల్లోకి తెస్తున్నామన్నారు. రుణమాఫీ, గృహాలక్ష్మీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగ ఖాళీల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం పంపిణీ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ అమలు చేస్తుంటే కేటీఆర్ బాకీ కార్డంటూ విమర్శలు చేయడం అనైతికమన్నారు. ఇంటింటికి కార్డులను పంపిణీ చేసి బీఆర్ఎస్ ద్రోహాలను తెలియపరుస్తామన్నారు.



కార్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, తదితరులు

మమ్మల్ని ప్రజలు విశ్వసించారు వారికి ఎల్లవేళలా రుణపడే ఉంటామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను 70 శాతం వరకు నెరవేర్చామన్నారు. ఇంకా మిగిలిన 30 శాతాన్ని కూడా పూర్తి చేస్తామన్నారు.

- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- సంక్షేమ పథకాలను అమలు చేయలేదు
- బీఆర్ఎస్ హామీల విస్మరణను కార్డుల రూపంలో తెలియచేస్తాం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రాష్ట్రాన్ని దొంగల్లా దోచుకున్నారు :

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దొంగల్లా దోచుకున్నారని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయలేదని, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ విద్య, రైతులకు రుణాలు మాఫీ చేయలేదన్నారు. కొత్త రుణాలు ఇవ్వలేదన్నారు. ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేని చేతకానితనం బీఆర్ఎస్‌దని ధ్వజమెత్తారు. యూనివర్సిటీలకు వైస్ ఛాన్స్‌లర్లను నియమించలేదన్నారు.

చర్చకు రాని దద్దమ్మలు

బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ రెండేళ్ల పాలన తీరుపై చర్చకు రమ్మంటే బీఆర్ఎస్ నేతలు ముఖం చాటేస్తున్నారని రాజేందర్‌రెడ్డి దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నేతలు దద్దమ్మలని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ తాము సవాల్ విసురుతున్నామని చర్చకు రావాలని డిమాండ్ చేశారు. వరంగల్ భద్రకాళి బండ్ లేదా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌ను చర్చా వేదికగా చేసుకుందామన్నారు.

వరల్డ్ బ్యాంక్‌కు బాకీ పెట్టారు

రాష్ట్రాన్ని అప్పుల మయంగా చేసి వరల్డ్ బ్యాంక్‌కు బీఆర్ఎస్ తెలంగాణను బాకీ పెట్టిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య

(మిగతా 4లో..)





ఎంబీబీఎస్ విద్యార్థి ఆర్ముళ్ల గణేష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

గణేష్ ఎంబీబీఎస్ చదువు బాధ్యత కేటీఆర్‌దే

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన నిరుపేద విద్యార్థి తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక స్థోమత లేక ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఆర్ముళ్ల గణేష్ ఎంబీబీఎస్ చదువు బాధ్యత మాజీ మంత్రి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీసుకుంటారని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేటీఆర్ విద్యార్థికి అండగా ఉంటామని ట్విట్టర్‌లో స్పందించడంతో దాస్యం వినయ్ భాస్కర్ ఆ విద్యార్థికి రూ. లక్షా 50వేలు నగదు విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాలను ఆదుకున్నారని పేర్కొన్నారు. వేలాది మంది పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా అందించినట్లు తెలిపారు. ఆర్ముళ్ల గణేష్ చదువు పూర్తి బాధ్యత కేటీఆర్ తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాసు , బోలెపాక రాజేష్, పాస్టర్ స్వామిదాసు గణేష్ ఆర్థిక పరిస్థితిపై కేటీఆర్‌కు ఆర్థిక సహాయం కోసం ట్విట్టర్‌లో పెట్టడంపై వినయ్ భాస్కర్ వారికి అభినందనలు తెలిపారు.

రేపు జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో (రేపు) బుధవారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్ -17 క్రీడా పోటీల కార్యదర్శి ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ - 17 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే బాల బాలికలు 1 జనవరి 2009 తర్వాత జన్మించిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో నిర్వహించే బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో హనుమకొండ అశోక జంక్షన్‌లోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్ -17 బాల బాలికల చాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకొని ఈ నెల8న హనుమకొండ డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని ప్రశాంత్ ఆ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకై 9866450592లో సంప్రదించాలని ప్రశాంత్ సూచించారు.

ప్రపంచ టాప్ శాస్త్రవేత్తల్లో రమేశ్



నర్సంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో వరంగల్ జిల్లా నర్సంపేటలోని మెడికల్ కళాశాల బయో కెమిస్ట్రీ విభాగం ఇన్‌చార్జి హెడ్, అసోసియేట్ ప్రొఫెసర్ కందిమల్ల రమేశ్‌కు చోటు దక్కింది. అమెరికాలోని ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్, నెదర్లాండ్‌లోని ఎల్సివియర్ వర్సిటీలు సంయుక్తంగా ప్రకటించిన విశ్వ టాప్ 2 శాతం సైంటిస్టుల జాబితా (2025)లో రమేశ్ ఎంపికయ్యారు. ఆయనకు వరుసగా నాలుగో సంవత్సరం (2022-2025) ఈ గౌరవం దక్కడం విశేషం. రమేశ్ క్లినికల్ మెడిసిన్, న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగంలో 360.881 మంది శాస్త్రవేత్తల్లో 3,405వ స్థానంలో నిలిచారు. ఆయనకు హెచ్ ఇండెక్స్ 17, హెచ్ఎమ్ ఇండెక్స్ 5.91లు నమోదయ్యాయి. న్యూరో డిజెనరేటివ్ వ్యాధులు, మైటోకాండ్రియల్ బయాలజీ, అల్జీమర్స్ వ్యాధిపై చేసిన పరిశోధనకు గాను ఎంపికయ్యారు. తన పరిశోధనలు అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమై ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్నాయని రమేశ్ తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని బయో మెడికల్ పరిశోధనలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రీవెన్స్ వినతులపై తక్షణ పరిష్కారం చూపండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- 61 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం చూపాలని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇటీవల ఒకే ప్రాంతంలో ఫిర్యాదులు తరుచుగా వస్తున్నాయని సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రధానంగా శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మలేరియా విభాగం సిబ్బంది నగరంతో పాటు విలీన గ్రామాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 61 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్లు సమ్మయ్య, రవీందర్, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, పన్నుల అధికారి రామకృష్ణ, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హార్టికల్చర్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా ఉన్నాయి. ఇంజనీరింగ్ - 18, హెల్త్, శానిటేషన్ - 7, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 6, టౌన్‌ప్లానింగ్ - 29 మంచి నీటి సరాఫరా - 1 ఇలా మొత్తం 61 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు..

- వరంగల్ దేశాయిపేట 22వ డివిజన్‌లోకమ్యునిటీ హాల్ రోడ్డుపై కొందరు వ్యక్తులు రోడ్డును ఆక్రమించి ఇళ్లు నిర్మించడంతో పాటు రోడ్డుపై ర్యాంపు పోశారు. ఇదేమిటని అడిన వారిపై దాడులకు దిగుతున్నారని అదే కాలనీకి చెందిన కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ శివనగర్ ప్రాంతంలో పైప్‌లైన్ పగిలి రోడ్డుపైకి డ్రైయినేజీ నీరు వస్తోందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ జులైవాడలో ఓ వ్యక్తి 80 ఫీట్ల రోడ్డును ఆక్రమించి అక్రమ కట్టడాలు చేస్తున్నాడనీ, కుడా మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 ఫీట్లు ఉండాల్సిన రోడ్డు ఇప్పుడు 50 ఫీట్లకు చేరిందని కాలనీకి చెందిన కె. వీరస్వామి అనే వ్యక్తి కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు.
- హసన్‌పర్తి నుంచి పెంబర్తి రోడ్డుకు వెళ్లే మార్గంలోని అంబేద్కర్ నగర్‌లో వీధి లైట్లు 24 గంటలు వెలుగుతూనే ఉన్నాయని స్థానిక కార్పొరేటర్ శివకుమార్ విజ్ఞప్తి చేశారు.

ఇంజనీరింగ్ విభాగంలో పర్సంటేజీల దందా

చెల్లించలేక అగ్రిమెంట్‌కు దూరంగా ఉంటున్న కాంట్రాక్టర్లు

మట్టెవాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో అవినీతి జరుగుతోందని, ఇంజనీరింగ్ విభాగంలో పర్సంటేజీలు ముట్టచెబితేనే పనులకు అగ్రిమెంట్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో వరంగల్ తూర్పు, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధిలోని అభివృద్ధి పనుల టెండర్లు ఇటీవల పూర్తయినప్పటికీ అగ్రిమెంట్ చేసుకోవడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. కాశిబుగ్గ సర్కిల్‌లో ప్రతీ డివిజన్‌కు రూ.50లక్షలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేసి ఇంజనీర్లు టెండర్లు పిలిచారు. మొత్తం 29 పనులకు టెండర్లు పిలవగా ఇప్పటి వరకు 25 పూర్తయ్యాయి. మిగిలిన నాలుగు పనులకు ఎవరూ రాలేదు. టెండర్లు పూర్తయిన 25పనుల్లో ఇప్పటివరకు 8 పనులకు మాత్రమే ఇంజనీరింగ్ అధికారులు అగ్రిమెంట్లను పూర్తి చేశారు. మిగతా 17 డివిజన్లలో అగ్రిమెంట్లు పూర్తి చేసి ఎల్‌వో ఇచ్చేందుకు ఇంజనీరింగ్ అధికారులు 6శాతం పర్సంటేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంటే మళ్లీ కొత్త పనులకు కొర్రీలు పెడుతూ అగ్రిమెంట్లు చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి డివిజన్లలో అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

స్థానిక అభ్యర్థులు నిబంధనలు పాటించాల్సిందే

వర్ధన్నపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఈ నెల 8న కోర్టు ఎలాంటి అడ్డంకులు చెప్పకుంటే 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎంత మేర ఖర్చు చేయాలనే దానికి సంబంధించి ఇప్పటికే ఎన్నికల కమిషన్ నిబంధనలను విడుదల చేసింది. ఫలితాలు వెలువడిన 45 రోజుల్లో ఖర్చుల వివరాలను అభ్యర్థులు కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుంది. జడ్పీటీసీ అభ్యర్థికి రూ.4లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థికి రూ.1లక్ష 50వేల వ్యయ పరిమితి ఉంటుంది. 5వేలు అంత కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థికి రూ.2లక్షల 50 వేలు, వార్డు సభ్యుడికి రూ. 50వేలు వ్యయ పరిమితి ఉంది. 5వేల కంటే తక్కువ జనాబా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.1లక్షా 50వేలు, వార్డు సభ్యుడికి రూ.30 వేలు పరిమితి విధించారు. అభ్యర్థి పోటీ చేసే ప్రాంతంలో రాజకీయ పార్టీలు చేసే ఖర్చు కూడా అభ్యర్థి ఖాతాలో జమవుతుంది. ఫలానా అభ్యర్థి అని కాకుండా పార్టీ తరుపున పోటీ చేసే వారందరీ కోసం సాధారణ ప్రచారానికి చేసే ఖర్చులను మాత్రం అభ్యర్థుల ఖాతాల్లో చూపించాల్సిన అవసరం లేదు. జడ్పీటీసీ అభ్యర్థులు జడ్పీ సీఈవోకు, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులు అభ్యర్థులు ఎంపీడీవోకు ఖర్చుల వివరాలను సమర్పించాలి. నిర్ణీత సమయంలోగా ఎన్నికల వ్యయ వివరాలు ఇవ్వకుంటే పదవిని కోల్పోయినట్లేనని చట్టం చెబుతుంది. అభ్యర్థులు గెలిచినా, ఓడినా ఎన్నికల్లో పెట్టిన ఖర్చుల వివరాలను సమర్పించడం మాత్రం తప్పనిసరి. ఎన్నికల్లో ఓడిపోయాం కదా.. వివరాలను సమర్పించకున్నా ఇబ్బందేమీ లేదు అనుకుంటే భవిష్యత్‌లో మరోసారి ఎన్నికల్లో పోటీకి ఇబ్బందులు తప్పవు.




ఐనవోలు పోలీస్‌స్టేషన్ భవనం

ఉత్తమ పోలీస్‌స్టేషన్లలో ఐనవోలుకు రెండో స్థానం ?

ఆలిండియాలో 70వ స్థానం

ఐనవోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపిక కావడానికి అడుగుదూరంలో నిలిచింది. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపిక చేయడం తెలిసిందే. దేశవ్యాప్తంగా 16,800 పోలీస్‌స్టేషన్లు ఉండగా అందులో ఈ యేడు (2025) ఐనవోలు పోలీస్‌స్టేషన్ ఆలిండియా వ్యాప్తంగా 70వ స్థానం, రాష్ట్రంలో 2 స్థానంలో ఆన్‌లైన్ పెర్‌ఫార్మెన్స్ కార్యక్రమంలో ఎంపికైంది. ఒక ఆన్‌లైన్ కార్యక్రమాలే కాకుండా వివిధ విభాగాల్లో సేవలు, విధులను హోమ్ మినిస్టరి విభాగ బృందం క్షేత్రస్థాయిలో పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి ర్యాంకును నిర్ణయిస్తారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్‌కు దేశంలోనే ఉత్తమ ర్యాంక్ సాధించేలా కృషి చేస్తున్నారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం లేదు. దేవస్థానం సత్రాలలో కొనసాగుతుంది. హోమ్ మినిస్టరి బృందం పోలీస్‌స్టేషన్‌కు వచ్చినపుడు స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారుల దరఖాస్తులు సన్నిహిత కౌంటర్ ద్వారా స్వీకరణ, వాటి పరిశీలన బాధితులకు లభించిన న్యాయం, కేసుల నమోదు వివరాలు, శిక్షలు, పోలీసుల విధి నిర్వహణ, చెడు రుగ్మతలపై ప్రజలను చైతన్యపరిచిన కార్యక్రమాలు, ఫ్రెండ్లీ పోలీస్ విధానం తదితర విషయాలను పరిశీలించి రాష్ట్రంలో మొదటిది దేశంలో ఉత్తమ ర్యాంక్ పొందాలన్న లక్ష్యంగా ఎస్సై పస్తం శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అంతర్జాతీయ సదస్సుకు రాజ్‌కుమార్



హనుమకొండ కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు ఆగపాటి రాజ్‌కుమార్ అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. తమిళనాడులోని మధురై కామరాజ్ యూనివర్సిటీలో విశ్వర్షి వాసిలి వాఙ్మయం-దృక్పథాల ఆవిష్కరణ అనే అంశంపై ఈ నెల 9, 10, 11 తేదీలలో జరగనున్న అంతర్జాతీయ సదస్సులో 'వసంతగానం చేద్దామంటున్న వాసిలి కవిత్వం- ఒక పరిశీలన' అనే అంశంపై ఆగపాటి రాజ్‌కుమార్ పత్ర సమర్పణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

పెద్దవంగర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బోమ్మరబోయిన ప్రదీప్, భూక్య కృష్ణ, ఠాగుర్, రవితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దు కుందామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని తెలిపారు. ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జింక మాంసం స్వాధీనం



పట్టుబడిన భద్రయ్య

మహాముత్తారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వండిన జింక మాంసాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పెడపల్లి రేంజర్ వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంగోత్ భద్రయ్య ప్రతి రోజూ తన మేకల మందతో అడవిలోకి వెళ్తుంటాడు. ఈ క్రమంలో అతడు తన ఇంటి వద్ద జింక మాంసం వండుకుంటున్నాడనే సమాచారం రావడంతో ఫారెస్టు అధికారులు దాడులు నిర్వహించారు. అతడి ఇంటి నుంచి కేజీ మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మాంసం ఎక్కడిదని అడగ్గా మేకలు మేపడానికి తాను వెళ్లగా అడవిలో చనిపోయి ఉన్న జింక కనిపించిందని, ఆ కళేబరం నుంచి కొంత మాంసాన్ని తెచ్చుకొని వండుకుంటున్నానని చెప్పాడు. దీంతో భద్రయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్టు రేంజర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో అస్లం ఖాన్, ఎఫ్‌బీవో అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.



వండిన జింక మాంసం

కాంటింజెన్సీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కొత్తగూడలో వర్కర్లకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ విద్యాసంస్థల్లో పని చేస్తున్న కాంటింజెన్సీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, కొత్తగూడ గ్రామ మాజీ సర్పంచ్ భూపతి తిరుపతి డిమాండ్ చేశారు. కాంటింజెన్సీ వర్కర్లు కొత్తగూడలో చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ నాయకులు సోమవారం సంఘీభావం పలికారు. వర్కర్లకు మద్దతుగా సమ్మెలో భైఠాయించారు. కార్యక్రమంలో నాయకులు భూక్య మల్లయ్య, సోలం శ్రావణ్, జిమ్మిడి శ్రీనివాస్, బంగారి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది ధోకా పాలన... మాది ప్రజాపాలన

(3వ పేజీ తరువాయి)

ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పు మిగిలిందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఈ భారాన్ని మోస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో గతంలో 16 సీట్లు సాధించిన బీఆర్ఎస్ ఈ సారి ఒక్క సీటు గెలువలేదన్నారు. బీజేపీకి ఆ పార్టీ సరెండర్ అయ్యిందని ఆరోపించారు.

టిల్లుకు నాలెడ్జ్ నిల్లు.. ఎమ్మెల్యే నాగరాజు

టిల్లు...కేటీఆర్‌కు నాలెడ్జ్ నిల్లంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వ్యాఖ్యానించారు. పిట్ట కథలు చెబుతూ ఏమి మాట్లాడతాడో అతనికే తెలియదని, కేటీఆర్ ఓ జోకర్ అంటూ వ్యాఖ్యానించారు. గ్రూప్ -1 పోస్టులను రూ.3 నుంచి రూ.కోట్లకు అమ్ముకున్నారని కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం తెలివి తక్కువ తనానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ కుటుంబం గజదొంగల్లా రాష్ట్రాన్ని దోచుకుందని నాగరాజు మండిపడ్డారు. బీఆర్‌యస్ పాలనలో అన్ని వర్గాలు దగాకు గురయ్యాయని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ విమర్శించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారన్నారు.

సమావేశంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, కిసాన్ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, ఆనంద్ మోజెస్, మార్క విజయ్, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో పాటు మండల సమ్మయ్య, వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుండెపోటుతో గ్రేహౌండ్స్ ఆర్ఎస్సై మృతి

- నివాళులర్పించిన గ్రేహౌండ్స్ డీఐజీ కల్మాల్, ఎమ్మెల్యే కడియం
- పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్‌కు చెందిన గ్రేహౌండ్స్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గంగుల అచ్యుతరెడ్డి (54) శనివారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఆయన స్వగ్రామం రాఘవాపూర్‌లో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. గ్రేహౌండ్స్ డీఐజీ కల్మాల్ మృతుడి ఇంటిని చేరుకుని నివాళులర్పించారు. గ్రేహౌండ్స్ ఎస్పీ సత్య శ్రీనివాస్, డీఎస్పీలు పేగ్, సాగర్, ఆర్ఐలు దాసు, శంకర్‌తోపాటు రిటైర్డ్ ఉద్యోగులు, ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నివాళులర్పించారు. అంతిమయాత్రకు ముందు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.



అచ్యుత రెడ్డి (ఫైల్)

1990లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన అచ్యుత రెడ్డి 1994 వరకు నిజామాబాద్ డిచ్‌పల్లిలో విధులు నిర్వహించారు. 1994లో మామునూర్ బెటాలియన్‌కు చేరుకొని అక్కడ కొంతకాలం పనిచేసి గ్రేహౌండ్స్ విభాగంలో చేరి ప్రతిభ కనబరిచి అంచెలంచెలుగా ఆర్ఎస్‌గా ఎదిగారు. శనివారం గ్రేహౌండ్స్ ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తుండగా క్యాంపులోనే గుండెపోటుకు గురి కాగా అక్కడి సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పలుమార్లు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, కుమారుడు, కూతురు ఉన్నారు.



అచ్యుత రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అచ్యుత రెడ్డి అకాల మరణం తీరనిలోటని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాఘవాపూర్ మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, నాయకులు నాగరబోయిన యాదగిరి, బత్తిని దశరథంగౌడ్, కాసాని బొందయ్య, కందుల గట్టయ్య, మహేష్ రెడ్డి, పవన్ పాల్గొన్నారు.


ఐదు గుట్టల్లో మన ఆనవాళ్లు

ఆనాటి కొల్లాపూర్ నేటి కొలన్‌పల్లి



వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొలన్‌పెల్లి గ్రామంలో ఉన్న బురుజు

- చరిత్రకు మారుపేరుగా నిలుస్తున్న గ్రామం
- పాలకుల నిర్లక్ష్యంతో తెలియకుండా పోతున్న చరిత్ర
- గుప్త నిధుల కోసం దుండగుల తవ్వకాలు
- పట్టించుకోని ప్రభుత్వం, పురావస్తు శాఖ అధికారులు



దేవుడి గుట్టపై ఉన్న రామాలయం

రాయపర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అందమైన, అతి సుందరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఎటు చూసిన పచ్చని పంట పొలాలతో ఉండే గ్రామంలో గ్రామానికి ఎంతో విశిష్టతను తెచ్చే గుట్టలు ఇక్కడి ప్రాధాన్యత. వరుసగా ఒక్కో గుట్ట ఒక్కో ప్రాధాన్యంగా చెప్పుకుంటూ గ్రామానికి అభిముఖంగా ఉండే ఈ గుట్టల్లో ఏదో తెలియని వింతలతో పాటు ప్రజలకు చెప్పుకునే నిజాలు, జరిగిన సన్నివేశాలు, మాట్లాడుకునే పూర్వ కాలం నాటి విషయాలు దాగున్నాయి. ఆనాటి ఇంత వైభవం కలిగిన గుట్టలను గుర్తు తెలియని వ్యక్తులు దోచేస్తున్నారు. ఎంతో భక్తితో నిర్మించిన కట్టడాలను కాల గర్భంలో కలిపేస్తున్నారు. దేవుడి విగ్రహాలను ధ్వంసం చేయడమే కాకుండా ధ్వజ స్తంభాలను సైతం పగులగొట్టి ముక్కలు చేస్తున్నారు. పడిపోయిన శిథిలాలు, శాసనాలు, చెల్లాచెదురుగా పడి ఉన్న కట్టడాలు వాటి చరిత్రను రూపుమాపి దర్శనమిస్తున్నాయి. అదే వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొలన్‌పెల్లి ఒకప్పటి కొల్లాపూర్ పట్నం.

ఢిల్లీ సుల్తాన్, కాకతీయుల ఆనవాళ్లు...

ఢిల్లీ సుల్తాన్‌లు దేశాన్ని పరిపాలించిన కాలంలోనే ఈ గ్రామానికి రాజధానిగా హైదరాబాద్ దుండిగల్, తాలుకాగా రాయగిరి, పోలీస్‌స్టేషన్‌గా పెద్దపెండ్యాల ఉండేవని చరిత్రకారులతో పాటు ఇక్కడి వృద్ధులు చెపుతున్నారు. దఫేదారులు, జమానాలు గ్రామంలో పెద్ద బురుజును ఏర్పాటు చేసుకుని తమ పాలనను కొనసాగిస్తూ ప్రజల వద్ద శిస్తు వసూలు చేసేవారు. కాకతీయుల కట్టడాలు ఎక్కడా చెక్కు చెదరకుండా ఉన్నట్లే ఈ కొలన్‌పెల్లి గ్రామంలో కూడా అటువంటి రాతి కట్టడాలు కనిపిస్తాయి.

గుట్టల విశేషాలు ఇవే...

ఈ గ్రామానికి అందమైన ఐదు గుట్టలు ఊరికి అభిముఖంగా ఉన్నాయి. వీటి పేర్లు దేవుని గుట్ట, బైరేను గుట్ట, నూనేను గుట్ట, పెద్ద గుట్ట, ఎర్రబోడు గుట్ట. ఒక్కో గుట్టపై ఒక్కో దేవుడిని పూర్వ కాలంలో ఆరాధించేవారని, అందుకు నిదర్శనంగా ఆలయాలు సైతం ప్రస్తుతం కనిపిస్తున్నాయి. చెన్నకేశవ స్వామి దేవాలయం, లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, శివాలయం, నాగులమ్మ గుడి, సీతమ్మ వారి పొల్లుగుంట, ఆంజనేయస్వామి ఆలయం, యాదవ, కురుమలు ఆదరించే భస్మదేవుడు, బయ్యాల దేవుడు ఈ గుట్టల్లో కొలువై ఉన్నారు. ఇక్కడ రాములవారి పాదాలు, గ్వె(గుహ)గా పిలువ బడే మునీశ్వరుల గుట్ట అందరినీ ఆకర్షించేలా కనిపిస్తాయి. దేవుడి గుట్ట వద్ద ఎదురుగా ఉండే కొలను ఎల్లప్పుడు నిండి ఉండేదని ఎంతో పవిత్రంగా ఉండేదని ఈ కొలను ఆధారంగా గ్రామానికి కొలన్‌పెల్లి అని పేరు పెట్టినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

మునీశ్వరుడి గుట్టకు విశిష్టత...

గతంలో దేవుడి గుట్టపై పూజలు నిర్వహించే వారని, గ్రామానికి చెందిన వాసం లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తదితరులు చిడతలను కొడుతూ పాటలు పాడుతూ గుట్టపై నిద్రించే వాడని అంటున్నారు. కొన్ని రోజులకు మునీశ్వరుడి అవతారంలో గడ్డాన్ని పెంచుకుని గ్రామస్థులకు కనబడకుండా బైరేను గుట్టలో ఉన్న సొరంగ మార్గంలోకి వెళ్లి రోజుల తరబడి తపస్సు చేసేవాడని చెబుతున్నారు. అందుకు ఈ గుట్టలకు మునీశ్వరుడి గుట్టగా పేరు వచ్చిందని, సొరంగ మార్గం ద్వారా వెళ్లే లోపల పెద్ద గుహలాగా ఉంటుందనిదానిలోకి వెళ్లే ధైర్యంలేక దానిని మూసి వేసినట్లు గ్రామస్థులు తెలిపారు. దేవుడి గుట్టకు దిగువ భాగాన ఉండే శివాలయం, నాగులమ్మ విగ్రహాలు, కొలనుకుఆనుకునిఉన్న సీతమ్మ పొల్లు గుంటకు ఎంతో విశిష్టత ఉందని గ్రామస్థులు తెలిపారు.

భద్రాద్రికి వెళ్తుండగా...

పూర్వకాలంలో సీతారాములు భద్రాద్రికి వెళ్తుండగా కొలన్‌పెల్లి గ్రామం అటవీ ప్రాంతం కావడంతో దేవుడి గుట్ట వద్ద విడిది చేశారని అప్పుడు ఈ కొలను వద్ద రాముడు పాదాలు మోపారని గ్రామస్థులు చెపుతున్నారు. అలాగే సీతమ్మ వారు లవకుశులను జన్మనిచ్చినప్పుడు లవకుశుల బొడ్డును సైతం తొలగించి కోనేట్లో వేయడంతో దీనిని గొల్లుకుంట అంటారని చెప్పారు. పొల్లు కుంట వద్ద సీతాదేవి పరమ శివుడిని స్మరిస్తూ ఉన్న ఆకారంలో ఉండే లింగం కూడా ఉంది. సీతారాముల వారిని కూడా ఇక్కడే పరమశివుడు, మహావిష్ణువును స్మరిస్తూ కాశీకావడిని ఏర్పాటు చేసి వారిని భుజాలపై మోశాడని దానికి సంబంధించిన గుర్తులు సైతం కనిపిస్తాయని గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా ప్రతి శనివారం గుట్టపైకి వెళ్లే వారికి పెద్ద నాగ సర్పం కనిపిస్తుందని పూర్వీకులు చెపుతున్నారు. స్వామి వారు కలలోకి వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించండని, విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలని తెలిపినట్లు, గ్రామంలో శుభాలు జరుగుతాయని చెప్పడంతో కొన్ని రోజుల పాటు ప్రతి శనివారం దేవుడి గుట్ట పూజలు నిర్వహించేవారని చెపుతున్నారు.

దేవుడి గుట్టకు ఎదురుగా కొలనులో ఆలయానికి సంబంధించిన విగ్రహాలు,శిథిలాలు, వివిధ రాతి కట్టడాలు ఉన్నాయని గ్రామంలోని వేద పండితుడు చెబుతున్నారు.కొలనులో ఉపాధి హామీ పథకం కింద కూలీలతో తవ్వకాలు చేపట్టగా శివలింగం, నాగ స్వరూపాలు బయట పడ్డాయని అన్నారు. గడ్డపార లోపలికి సులభంగా వెళ్తుందని, నీరు ఊటలా పైకి వచ్చాయని తెలిపారు. తమ చిన్ననాటి కాలంలో చుట్టూ పక్కల గ్రామాల నుంచి చాలా మంది ప్రజలు మొక్కులు తీర్చుకోవడానికి జాతరలా బండ్లు కట్టుకుని వచ్చిపూజలు చేసే వారని వృద్ధులు తెలిపారు.

కాకతీయుల కట్టడం శిథిలావస్థకు చేరడంతో అందులో ఉన్న ఆలయంలో కొందరు దుండగులు తవ్వకాలు జరిపి దేవతామూర్తులను తొలగించి గుప్తనిధులు కాజేసినట్లు గ్రామస్థులు బావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్వ వైభవం తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుట్టకు దిగువగా ఉన్న శివాలయం, పక్కన నాగులమ్మ విగ్రహాలు



మునీశ్వరుల గుట్టలోకి వెళ్లే సొరంగ మార్గం

పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి



గుట్టలపై ఉన్న దేవాలయాలను కాపాడాలి. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలి. ప్రజాప్రతినిధులు అధికారులు దీన్ని పర్యవేక్షించి తగు చర్యలు చేపట్టాలి. గ్రామంలో ఉన్న దేవాలయాల విశిష్టతను అందరికి చాటి చెప్పేలా చర్యలు తీసుకోవాలి.

\- జక్కుల నర్సయ్య, కొలన్‌పెల్లి

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గ్రామంలో ఉన్న ఐదు గుట్టలపై అధ్యయనం చేసేలా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలి. కాకతీయుల కట్టడాల్లో శిథిలావస్థకు చేరిన విగ్రహాలతో పాటు కొలనులో ఉన్న విగ్రహాలను శాసనాలను వెలికి తీసి పూర్వ వైభవం తీసుకురావాలి. పురావస్తు శాఖ అధికారులు సర్వే చేసి చారిత్రక సంపదను కాపాడాలి.

\- కృష్ణమాచార్యులు, కొలన్‌పెల్లి

పిడుగు పాటుకో యాప్..

- పిడుగు రాకపై ముందే సూచన
- దామిని యాప్‌తో సత్ఫలితాలు



దామిని యాప్

స్టేషన్‌ఘన్‌పూర్‌టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో ప్రతీరోజు ఎక్కడో ఒక చోట వానలు పడుతున్నాయి. వాన పడిన సమయంలో మెరుపులు, పిడుగులు పడుతూనే ఉన్నాయి. భారీ వర్షాలు కురిసే సమయంలో మెరుపులు వాటితో పాటే పిడుగులు పడడం సహజం. ఐతే పిడుగులు పడిన ప్రతీసారి ఎక్క డో అక్కడ ప్రాణ, ఆస్తి నష్టాలు జరగడం అంతే సహజం అయిపో యింది. పిడుగు పడడం ముందే తెలిస్తే ఈ ప్రమాదాలనుఎంతో కొంత అరికట్టవచ్చు. ఇప్పుడు పిడుగు పడే కొద్ది నిమిషాల ముందు హెచ్చరించే యాప్ కూడావచ్చేసింది. ఆ వివరాలు మీ కోసం..

దామిని యాప్..

వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పాటుకు గురి కాకుండా ఉండేందుకు సాంకేతికత అందుబాటులోకి వచ్చేసింది. కేంద్ర ఎర్త్ సైన్సెస్ మినిస్ట్రీఈ డిపార్ట్‌మెంట్ దామిని లైట్నింగ్ అలెర్ట్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఈ యాప్‌ను ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాతావరణ సంబంధిత వివరాలతో పాటు మనం ఉంటున్న ప్రాంతంలో పిడుగు పడే 25 నిమిషాల ముందే సూచనను తెలుసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు భాషల్లో యాప్‌ను వినియోగించుకోవచ్చు. దీని కోసం లోకేషన్ వివరాలు తెలిపాల్సి ఉంటుంది.

పిడుగు పాటు నివారణకు జాగ్రత్తలు

యాప్ ద్వారా ఒక ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందని ముందే తెలిస్తే అక్కడ ఉన్న వారు వెంటనే పిడుగు పాటును తప్పించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కిందకు వెళ్లరాదు. నీరు ఉండే ప్రాంతానికి, విద్యుత్ పోల్స్ వద్దకు కూడ వెళ్లకూడదు. పెద్దగా ఉండే చెట్లు పిడుగులను ఆకట్టుకుంటాయి. అందుకే ఎట్టి పరిస్థితిలో చెట్టు కిందకు వెళ్లకుండా దగ్గరలో ఉన్న ఇంటిలోకి వెళ్లడానికి ప్రయత్నించాలి. సమీపంలో ఇల్లు లేకపోతే వెంటనే నేలపై పడుకోవాలి. విద్యుత్‌తో ప్రత్యక్ష సంబంధం ఉండే సెల్ ఫోన్, కంప్యూటర్‌లకు, బైక్‌లు, ట్రాక్టర్లకు దూరంగా ఉండాలి. ఎలక్ట్రానిక్ పరికరాల స్విచ్‌లు తొలగించి ఆఫ్ చేయాలి. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సింకులు, బాత్ టబ్‌ల వద్ద ఉండకూడదు. కాంక్రీట్ నేలపై, కాంక్రీట్ గోడలను ఆనుకుని పడుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. వీటి ద్వారా మెరుపు ప్రయాణించే అవకాశాలు ఉంటాయి. ఉరుములతో కూడిన వర్షం ఉన్నప్పుడు స్నానం చేయరాదు. గిన్నెలు కడగవద్దని చెబుతున్నారు. ఇళ్లు, భవనాలపై పిడుగులు పడకుండా విద్యుత్ ఎర్తింగ్ సరిగా చేయించుకోవాలి.



పిడుగు పడి కాలిన విద్యుత్ వైర్లు(ఫైల్)

వ్యవసాయ మార్కెట్‌లో సాంకేతిక సమస్య

- సరుకుల కొనుగోళ్లలో జాప్యం
- ఇబ్బందులు పడిన రైతులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో సరుకుల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరిగింది. సరుకులకు తూకం వేసేటప్పుడు దడువాయిలు వినియోగించే పీవోఎస్ మిషన్లలో మారిన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన లేకపోవడం, సాఫ్ట్‌వేర్ సరిగ్గా పనిచేయకపోవడంతో కొనుగోళ్ల నిలిచిపోయాయి. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెటింగ్‌శాఖ అధికారుల తీరు బాగాలేదని మండిపడ్డారు. ఈ విషయాన్ని దడువాయిలు వెంటనే ఇన్‌చార్జి కార్యదర్శికి తెలిపారు. అయితే నూతన సాఫ్ట్‌వేర్‌పై అధికారులకు, దడువాయిలకు అవగాహన లేకపోవడంతో ఆయన సైతం ఏమీ చేయలేకపోయారు. చివరకు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రాము దడువాయిలకు చిట్టాబుక్ ఇచ్చి తూకం వేసిన వివరాలను అందులో నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో రైతులు శాంతించారు. ఇక ముందు రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న వర్సిటీ ప్రొఫెసర్లు, మాదిగ నేతలు

ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ అందాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

కేయూ క్యాంపస్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలు దళితుల్లోని అన్ని వర్గాలకు అందాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సూచించారు. సోమవారం కేయూ గణితశాస్త్ర విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా, కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్.సుజాతల నేతృత్వంలో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఘన సన్మానం చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ విద్య, ఉద్యోగాలతో పాటు అన్ని విభాగాల్లో అమలు జరిగేలా చూడాలన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలుస్తామన్నారు. 30 ఏళ్ళ సుదీర్ఘ పోరాటంలో అనేక అవాంతరాలను ఎదుర్కొన్నామని చెప్పారు. ఉద్యోగాల్లో, ప్రమోషన్లలో ఎస్సీ వర్గీరణ జరుపాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉద్యోగులు జాతి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పీడిత వర్గాలవిముక్తికి పోరాటాలు చేస్తామన్నారు. భారీ గజామాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్, హాస్టల్స్ డైరెక్టర్‌ఎల్‌పీ రాజ్‌కుమార్, బీసీ నేత డాక్టర్ తాడూరి శాస్త్రి, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, డాక్టర్ సంకినేని వెంకన్న, డాక్టర్ మంద వీరాస్వామి, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దనయ్య, దిలీప్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ సిలివేరు రాజ్‌కుమార్, కుమ్మరి రాజయ్య, మంద రాజు, మంద శ్యామ్, బొక్క మొగిలి, బొచ్చు తిరుపతి, కుమ్మరి శ్రీనాథ్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ వంగాల సుధాకర్, వడ్డెపల్లి మోహన్,డాక్టర్ పుల్లా కుమార్, డాక్టర్ కుమారస్వామి, బొక్క దయాకర్, ప్రవీణ్ కుమార్‌తోపాటు విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాకాలలో త్వరలో సఫారి టూర్

- వన్యప్రాణుల మధ్య 2 గంటల ప్రయాణం
- పర్యాటకులకు పూర్తిస్థాయిలో కనువిందు

ఖానాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సహజ సిద్ధ అందాలకు నిలయమైన పాకాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పాకాలకు విచ్చేసే పర్యాటకుల సౌకర్యార్థం ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టింది. పాకాలకు ప్రధానంగా యువ పర్యాటకులను అధికంగా విచ్చేస్తుంటారు. పాకాలకు విచ్చేసే యువ పర్యాటకుల్లో జోష్ నింపేందుకు త్వరలో సఫారి టూర్ అందుబాటులోకి రానుంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.28లక్షలతో సఫారి టూర్ రూపుదిద్దుకుంటున్నది. ఇప్పటికే సఫారి టూర్ కోసం రెండు వాహనాల కొనుగోలు పూర్తయింది. ఆధునీకీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అదేవిధంగా వర్షాలు తగ్గుముఖం పట్టగానే సఫారి ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.





పాకాలలో సఫారి టూర్‌కు సిద్ధమయ్యే వాహనం (మోడల్), సఫారి టూర్ వెళ్లే మార్గంలో రాళ్లపై అటవీ జంతువుల బొమ్మలు

దట్టమైన అడివిలో 10 కిలోమీటర్లు

పాకాల దట్టమైన అడవి ప్రాంతంలో 10 కిలోమీటర్లు సఫారి టూర్ ఉండేవిధంగా అటవీ అధికారులు రోడ్ మ్యాప్‌ను సిద్ధంచేస్తున్నారు. చిలుకమ్మనగర్ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి సఫారి వాహనంలో (7 గురికి పరిమితం) లోపలికి వెళ్లి అడవినంతా చుట్టేస్తూ మధ్యలో దుప్పులు, కొండగొర్రెలు, కణుజులు, కృష్ణ జింకలు, అడవి పందులు, నెమళ్లు, నక్కలు, తోడేళ్లు, అడవి పిల్లులతో పాటు వివిధ రకాల పక్షులను చూస్తూ టూర్‌ను కొనసాగించడం జరుగుతుంది. అదేవిధంగా అడవిలోపల, అటవీ జంతువులను, పక్షులను చూసే విధంగా అక్కడక్కడ వ్యూ లైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు అడవి మధ్యలో వాచ్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులు టవర్ ఎక్కి అడవిని పూర్తిగా వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అడవి మధ్యలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన నీటి కుంటలలోని తాబేళ్లతో పర్యాటకులు సేద తీరేవిధంగా అటవీ అధికారులు సఫారి టూర్‌ను తీర్చిదిద్దుతున్నారు. రా కింగ్ మౌంటెన్ వద్ద సెల్ఫీ ఫొటోలు దిగేవిధంగా ఏర్పాటుచేస్తున్నారు. మొత్తంగా రెండు గంటల ప్రయాణం తరువాత పూర్తిస్థాయి సంతృప్తి చెందిన తరువాత సంగెం కాలువ సమీపంలో సఫారి టూర్ ముగియనుంది.

ఒక రోజు పర్యాటకానికి అడుగులు

పాకాలకు విచ్చేసే పర్యాటకులు పూర్తిగా ఒక రోజు గడిపే విధంగా అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. పాకాలలో బోటింగ్ చేయడంతో పాటు, ట్రెక్కింగ్, సఫారి టూర్, నైట్ క్యాంపెనింగ్ కలిపి ఒక రోజు పూర్తిగా పాకాలలో గడిపే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నిధుల వెసులు బాటును బట్టి పనులను చేపడుతున్నామని అటవీ అధికారులు తెలుపుతున్నారు. నవంబర్ నెలలో సఫారి టూర్‌ను ప్రారంభించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. సఫారి టూర్ అందుబాటులోకి వస్తే పర్యాటకులకు మంచి కనువిందు కానుంది.

పాకాల పర్యాటకంపై ప్రత్యేక దృష్టి



పాకాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే లక్షల రూపాయల నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులను చేపట్టాం. ఇటీవల బోటింగ్ పాయింట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, చిన్నపిల్లలకు ప్లేయింగ్ ఏరియాను అందుబాటులోకి తీసుకువచ్చాం. బట్టర్‌ఫ్లై గార్డెన్ ఆధునీకీకరణ చేపట్టాం. బ్యాటరీ వాహనం కొనుగోలు చేశాం. కట్ట పొడవునా సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. వర్షాలు తగ్గగానే సఫారి టూర్‌ను ప్రారంభిస్తాం. సఫారిటూర్‌తో పర్యాటకుల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉంది.

\- రవికిరణ్, నర్సంపేట ఎఫ్ఆర్వో

కేయూ 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపికబురు..

- ప్రమోషన్లు ఇచ్చేందుకు పాలకమండలి ఆమోదం
- కాంట్రాక్టు అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయస్సు పెంపు
- పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలకు పచ్చజెండా
- వర్సిటీ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఒకే..

కేయూ క్యాంపస్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపి కబురు వచ్చింది. కోర్టు కేసుల నేపథ్యంలో సుదీర్ఘకాలంగా ప్రమోషన్లకు నోచుకోలేకపోయిన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కేరీర్ అడ్వాన్స్ స్కీం (క్యాష్) ప్రమోషన్లు ఇచ్చేందుకు వర్సిటీ పాలక మండలి అమోదం తెలిపింది. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్‌లో కేయూ పాలక మండలి సమావేశం జరిగింది. కేయూ వీసీ, పాలక మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవాసేన, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, బొద్దిరెడ్డి రమాదేవి, సుకుమారి, మల్లం నవీన్, బాలు చౌహాన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డిలు హాజరైయ్యారు.ఈ సందర్భంగా 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు,కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రమోషన్ల కల్పించాలని నిర్ణయించారు. అలాగే వర్సిటీ చుట్టూ కంపోండ్ వాల్ నిర్మాణానికి రూ.20లక్షలను కేటాయించారు. వర్సిటీ పరిధిలో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాల కోసం వర్సిటీ పాలక మండలి పచ్చజెండా ఊపింది. వర్సిటీ నియామ నిబంధనల మేరకు అధ్యాపకుల అవసరాల రీత్యా 130 మందిని వివిధ విభాగాల్లో పార్టుటైమ్ టీచింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయించారు. కాంట్రాక్టు అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 65 ఏళ్ళకు పెంచిన ఉత్తర్వులకు ఆమోదం తెలిపింది. ఉద్యోగులు మరణిస్తే వారి అంత్యక్రియలకు రూ.20వేల నుంచి రూ.30 వేలకు పెంచారు. భూ కబ్జాల వివాదంతో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్‌కు గురైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబును మళ్ళీ విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. అయితే అశోక్ బాబును విధుల్లోకి తీసుకుంటూనే డిమోషన్ చేస్తారనే ప్రచారం వర్సిటీలో కొనసాగుతోంది. అశోక్‌బాబుతో పాటు భూ ఆరోపణలు ఎదుర్కొంటున్న అందరికీ ఉద్యోగాలు మళ్ళీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే వర్సిటీ క్యాంపస్‌లో అశోక్‌బాబును విధుల్లోకి తీసుకోకుండా అనుబంధ కళాశాలల్లో పనిచేసే విధంగా సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

కొత్త పీహెచ్‌డీ అడ్మిషన్లపై సస్పెన్స్..

సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో కేయూలో వివిధ విభాగాల్లో నూతనంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల నిర్ణయం తీసుకుంటారని భావించినప్పటికీ ఏ నిర్ణయం తీసుకోకుండా సస్పెన్స్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. పీహెచ్‌డీ అడ్మిషన్లపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమించిన కమిటీ తుది నివేదిక అందచేయకపోవడంతో పాలక మండలి అడ్మిషన్ల విషయాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి, ఇతర సిబ్బంది,రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నేతృత్వంలో రూసా అభివృద్ధిపనులపైనా ప్రత్యేకంగా సమావేశం జరిగింది. వర్సిటీ ఉన్నతాధికారులు, డీఆర్‌లు, ఏఆర్‌లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరికి జరిమానా

వరంగల్ లీగల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై నేరం రుజువైనందున ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున మొత్తం రూ. 30 వేలు జరిమానా చెల్లించాలని హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి. అపర్ణాదేవి సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. 23 మార్చి 2023న ఉదయం 10 గంటలకు కాజీపేట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా భవాని థియేటర్ ఎదురుగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న కవర్లలో ఎండు గంజాయి లభించింది. వారిని విచారించగా ఎండు గంజాయిని కొనుగోలు చేసి ఇతరులకు విక్రయించడానికి తీసుకెళ్తున్నామని అంగీకరించడంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువైనందున ఒక్కొరికి రూ.15వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ. సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా ఎం. శ్వేత, వై.సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. పీపీ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సంతోష్‌రెడ్డి

బీజేపీ బలోపేతం కోసం కృషి చేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి

రాంనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీజిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్మైల్ విద్య సంస్థల అధినేత మెర్రి కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు యువకులు బీజేపీలో చేరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువకులకు పార్టీ కండువాలు కప్పి సంతోష్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురుమూర్తి శివకుమార్, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, ఎస్టీ మోర్చ నాయకుడు నానునాయక్, భరత్‌గౌడ్ శ్రీనివాస్, అరణ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అమానుషం'

వరంగల్ లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొత్త రవి పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ప్రకటన జారీ చేశారు. సోమవారం సుప్రీంకోర్టులో కేసు విచారిస్తుండగా ఒక న్యాయవాది బేంచ్ వద్దకు వెళ్లి షూ తీసి చీఫ్ జస్టిస్‌పై విసరడం అమానుషమని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మూడో స్తంభంగా పేర్కొంటున్న న్యాయవ్యవస్థ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

డే కేర్ సెంటర్‌లో వృద్ధులకు ఫిజియోథెరపీ సేవలు

హనుమకొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని జడ్పీ కార్యాలయ సమీపంలో డే కేర్ సెంటర్‌లో వృద్ధులకు ఫిజియోథెరపి సేవలు అందిస్తున్నట్లు ఫిజియోథెరపి డాక్టర్ ఉష సోమవారం తెలిపారు. ప్రతీ రోజు 20 మంది వృద్ధ పురుషులు, మహిళలకు మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు ఇతర వ్యాధులకు వైద్యం అందిస్తున్నట్లు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని సీనియర్ సిటిజన్స్ సభ్యులు వినియోగించుకోవాలని తెలిపారు.



వృద్ధుడికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమతుల దృష్ట్యా మంగళవారం నగరంలోని పలు సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబారెడ్డి తెలిపారు. ఆర్ఈసీ సబ్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేస్ - 1, బ్యాంక్ కాలనీ, చైతన్యపురి కాలనీల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, కేయూసీ సబ్ స్టేషన్ పరిధిలోని నయీంనగర్, లస్కర్ సింగారం, రాజాజీనగర్ ఏరియాల్లో సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు, కుమార్‌పల్లి, ఈద్గ ఏరియాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్ స్టేషన్ పరిధిలోని శ్యామల గార్డెన్, నాగరాజు టెంపుల్, అమరావతినగర్, టీవీ టవర్ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, యాదవనగర్ సబ్ స్టేషన్ పరిధిలో తోటబడి, కొత్తూరు, కుమార్‌పల్లి మార్కెట్ ఏరియాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మచిలీబజార్ సబ్ స్టేషన్ పరిధిలోని గుడిబండల్, ఎస్సీ హాస్టల్ ఏరియాలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

సీనియర్ న్యాయవాది జాఫర్ అహ్మద్ మృతికి 'బార్' సంతాపం

వరంగల్ లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది సయ్యద్ జాఫర్ అహ్మద్ మృతి న్యాయవాద వృత్తికి తీరని లోటని హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమానికి బార్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సివిల్‌కేసులు వాదించడంలో జాఫర్ అహ్మద్ దిట్ట అని ఆయన నుంచి ఎంతో మంది యువ న్యాయవాదులు వృత్తి మెళకువలను నేర్చుకున్నారని గుర్తు చేశారు. వృత్తిపట్ల జాఫర్ అహ్మద్‌కు ఉన్న నిబద్ధత అంకితభావాన్ని జూనియర్లు పునికి పుచ్చుకొని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొత్త రవి, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు షైదం జైపాల్, ఉభయ జిల్లాల బార్ ప్రతినిధులు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలి

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రజనీకాంత్

వడ్డెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు తగిన న్యాయం చేయాలని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కందుకూరి రజినీకాంత్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ హనుమకొండ 56వ డివిజన్ పరిస్థితులను ఆమెకు వివరించారు. పార్టీని వెన్నంటి ఉన్న సీనియర్లకు సముచిత స్థానం కల్పిస్తామని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చినట్లు రజినీకాంత్ తెలిపారు.



మీనాక్షి నటరాజన్‌తో మాట్లాడుతున్న రజినీకాంత్

దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్

- ఆ పార్టీ ఏనాడూ ప్రజల గురించి పనిచేయలేదు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

న్యాశాయంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదంతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఆర్ఎస్ఎస్ ది అధికార కాంక్ష అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. వందేళ్ల చరిత్రలో ఆర్ఎస్ఎస్ ఏనాడూ ప్రజల గురించి పనిచేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ అంటే విభజన, మతోన్మాదం మాత్రమేనని, అలాంటి సంస్థ వందేళ్ల ఉత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదమన్నారు. మతవిద్వేష పునాదుల మీద నడుస్తూ దేశభక్తి అని చెప్పుకునే ఆర్ఎస్ఎస్‌ను ప్రధాన మంత్రి కీర్తించడం సరి కాదన్నారు. 1948లో అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్‌ను ఎందుకు నిషేధించారో నరేంద్రమోదీ ప్రజలకు చెప్పాలన్నారు. ఆర్ఎస్ఎస్ అసలు చరిత్రను ప్రజల ముందు ఉంచాలని, ఆర్ఎస్ఎస్ అంటే విభజన, విధ్వంసం మాత్రమేనన్నారు. త్యాగాల చరిత్రతో కమ్యూనిస్టులు ముందుకు సాగుతుంటే స్వార్థంతో ఆర్ఎస్ఎస్ అధికారమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు.

గొప్ప మానవతా సిద్ధాంతమున్న కమ్యూనిజానికి మరణం లేదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ నాయకులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మండ సదాలక్ష్మి, ఎన్ఏ స్టాలిన్, రాములు, ఓదెలు, సదానందం, మంచాల రమాదేవి, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, దీనా, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అంటేనే ధోకాపార్టీ అని తెలంగాణ ప్రజలకు తెలుసునని మాజీ ఎమ్మెల్యే , బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో తెలంగాణ రాష్ట్ర అస్థిత్వాన్ని సీమాంధ్రకు తాకట్టుపెట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో కలిపి ధోకా చేసిన కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అమలు చేయకుండా తప్పించుకు తిరుగుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన బాకీ కార్డులను చూసి కాంగ్రెస్ పార్టీ నేతలు భయపడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర లేదు. బోనస్ లేదు. రుణమాఫీ సంపూర్ణంగా జరుగలేదు. రైతు భరోసా ఎగవేసి సరిపడ యూరియా అందించలేక రైతులను ధోకా చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. మహిళలకు తులం బంగారం, మహాలక్ష్మి పథకం కింద రూ. 2500, వృద్ధులకు పింఛన్ పెంచకుండా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేక అన్ని వర్గాల ప్రజలను ధోకా చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రకటనలో కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

డీజీపీకి హోంగార్డుల అసోసియేషన్ వినతి

వరంగల్ క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హోంగార్డుల సమస్యలు పరిష్కరించి, సర్వీసులనుక్రమబద్ధీకరించాలని హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల అశోక్ అధ్వర్యంలో సోమవారం డీజీపీ శివధర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అశోక్‌కుమార్, జీ హరిబాబు, జాయింట్ సెక్రెటరీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమెరికాలోని న్యూ జెర్సీలో దసరా వేడుకల్లో సుందర్‌రాజ్ యాదవ్‌ను అభినందిస్తున్న ఎన్ఆర్ఐలు

విదేశాల్లో దసరా సంబరాలు జరపడం ఆనందంగా ఉంది

కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : దేశ విదేశాల్లో దసరా సంబరాలు జరపడం ఆనందంగా ఉందని కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. సోమవారం అమెరికాలోని న్యూ జెర్సీలో ఆట ఆధ్వర్యంలో రాయల్ ఆల్బర్ట్స్ ప్యాలెస్‌లో అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో దసరా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుందర్‌రాజ్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాన్ని ఉట్టిపడే విధంగా దసరా వేడుకలు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. పెద్ద సంఖ్యలో ఎన్ఆర్ఐల కుటుంబ సభ్యులతో పాల్గొని శమీ పూజ నిర్వహించి దసరా వేడుకలు నిర్వహించి రామలీల ప్రదర్శనలు, నృత్యాలు, సంగీత కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతీ ఏటా ఇలాంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని వారికి సుందర్‌రాజ్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాసర్ల శ్యామ్, పోక్ సింగర్ రేలారే రేలా గంగా, దాండియా శ్రీను పాల్గొన్నారు.

అక్రమాలపై ప్రశ్నిస్తే కుల బహిష్కరణా ?

- కుల పెద్దమనుషుల వేధింపుల నుంచి రక్షించండి
- బాధితుడు తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు ఆవేదన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

హసన్‌పర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కు లంలో జరిగే అక్రమాలు, భూకబ్జాలపై ప్రశ్నిస్తే కుల బహిష్కరణ పేరుతో వేధింపులకు పాల్పడుతున్న కుల పెద్దమనుషుల నుంచి తమను రక్షించాలని బాధితుడు తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు పోలీసులను వేడుకుంటున్నారు. సోమవారం ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తన గోడు వెళ్లబోసుకున్నారు. బాధితుడి కథనం ప్రకారం.. జయగిరికి చెందిన తాను ఎక్సైజ్ శాఖ నుంచి ఇచ్చిన గీత కార్మికుడి కార్డు కలిగి గీత పారిశ్రామిక సహకార సంఘం జయగిరిలో సభ్యత్వం కలిగి ఉన్నట్లు తెలిపారు. 276 మంది సభ్యులు కలిగిన కుల సంఘానికి సుమారు 17 ఎకరాల భూమితో పాటు లక్షల రూపాయల నగదు చిట్టీల రూపంలో కొనసాగుతుందని తెలిపారు. మూడు సంవత్సరాలుగా అధ్యక్షుడిగా పంజాల సాంబరాజు, ఉపాధ్యక్షులుగా మోటపోతుల రాజు, ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి విద్యాసాగర్, బుర్ర రాజు, చింత శ్రీను, పంజాల పరమేశ్వర్, కొత్తకొండ సదానందం పెద్దమనుషులుగా చలామణి అవుతూ కుల సంఘానికి సంబంధించిన భూమిని మాజీ ఎంపీటీసీ భర్త చంద్ర కుమార్ పెద్దమనుషులైన పంజాల సాంబరాజు, మోటపోతుల రాజుల సహకారంతో కబ్జా చేశారని ఆరోపించారు. కుల సంఘానికి సంబంధించిన లావాదేవీలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వర్తించడం సరికాదని ప్రశ్నించినందుకు తనతో పాటు తనకు సన్నిహితంగా ఉంటున్న కుల సభ్యులపై జరిమానా విధిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరికి రాకుండా తనతో ఎవరు మాట్లాడినా, తనకు సహకరిస్తున్న వారిపై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ తనను, తన కుటుంబ సభ్యులు, స్నేహితులను వేధింపులకు గురి చేస్తున్న పెద్దమనుషులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పెద్దమనుషులను పిలిపించి మాట్లాడినా వారు మారడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో బాధితుడి తండ్రి తాళ్లపెల్లి సుధాకర్, రామకృష్ణ, బాలకృష్ణ, దుర్గాప్రసాద్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే విద్యను అందించాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శ్రీకాంత్
- డిసెంబరు 10 నుంచి 12 వరకు రాష్ట్ర మహాసభలు

వడ్డెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిని కల్పించే విద్యను అందించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శ్రీకాంత్ కోరారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జాతీయ నేత పి. మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యా విధానాన్ని తుంగలో తొక్కి భ్రష్టు పట్టించాయని దుయ్యబట్టారు. తమ సంస్థ విద్యార్థులు, విద్యా రంగ సమస్యలపై రాజీలేని ఉద్యమాలను నిర్వహిస్తుందన్నారు. సమాజంలోని రుగ్మతలు, వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలో డిసెంబరు 10 నుంచి 12 వరకు నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్నారపు రాజేశ్వర్, శ్రీకాంత్, సహాయ కార్యదర్శి మస్తాన్, రాష్ట్ర కోశాధికారి కూతాటి రాణాప్రతాప్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్, జిల్లా నాయకులు ప్రకాష్‌రాజ్, సూర్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న ఎస్వీ శ్రీకాంత్, పీ నాగరాజు, పీ మహేష్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఇస్తున్న ఎంఈవో శ్రీనివాస్

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంఈవో ఎ.శ్రీనివాస్

హసన్‌పర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఎ.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను ఎంఈవో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షలో ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌ను పొందాలన్నారు. ఎంపికైన వారికి ప్రతీ సంవత్సరం రూ.12 వేల చొప్పున 4 సంవత్సరాలుగా రూ.48వేల వరకు వస్తాయన్నారు. అనంతరం హెచ్ఎం సుమాదేవి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం తమ పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో ఎంపికై స్కాలర్‌షిప్‌లు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా ప్రతినిధులు న్యాయవాది రవీందర్, మల్లికార్జున్, ఉపాధ్యాయులు శశికళ, ఆధర్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

వడ్డెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన కొంగంటి రాజ్‌కుమార్ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) సాధన కమిటీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆర్టీఐ సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశం మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీఐని పకడ్బందీగాఅమలు చేసేలా కృషి చేస్తానని రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

రెడ్లు అన్ని రంగాల్లో రాణించాలి

- భవానీనగర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి
- నూతన కార్యవర్గం ఎన్నిక

వడ్డెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):రెడ్డి కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలని భవానీనగర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు ఇ. రాంరెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని భవానీనగర్‌లో నిర్వహించిన రెడ్డి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్డి సంఘంలో సభ్యులైన వారికి సాధారణ రుణం కింద ఇచ్చే రూ. ఒక లక్షా 50 వేలను రూ.2 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. సంఘంలో సభ్యుడు ఎవరైనా అకాల మరణం చెందితే రూ. 10 వేల ఎక్స్‌గ్రేషియాను కుటుంబ సభ్యులకు చెల్లించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవానీనగర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఇ. రాంరెడ్డి, సహా అధ్యక్షులుగా ఎం. రాంరెడ్డి, సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా గుడి లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎన్. విజయ్ భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా సీహెచ్. ప్రేమాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వి. సత్యపాల్‌రెడ్డి, కె.ప్రభాకర్ రెడ్డి ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇ. రాంరెడ్డి

రక్షణ కోసం శిక్షణ ప్రారంభం

మామునూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల సమయంలో అనుసరించాల్సిన విధానంపై స్టేట్ డిజాస్టర్స్ రెస్పాన్స్ ఫోర్స్‌కు చెందిన 100 మంది సిబ్బందికి మామునూరు 4వ బెటాలియన్‌లో సోమవారం శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కమాండెంట్ పి.శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రాంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో చిక్కుకున్నవారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం కోసం ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే సహాయక చర్యలు అందించేందుకు ప్రతీ బెటాలియన్‌లో 100 మంది సిబ్బందితో ఒక ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేసి వారికి మెడికల్ ఫస్ట్ రెస్పాన్స్ (సీఎఫ్ఎస్ఆర్)కోర్స్, ఏడీఆర్‌సీ కోర్స్, రోప్ రెస్క్యూ ఆపరేషన్ వంటి కోర్సులలో 30 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలను రక్షించే మార్గాలపై ప్రత్యేక దృష్టిసారించే విధంగా శిక్షణతో పాటు అవసరమైన సామగ్రి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 17వ బెటాలియన్ కామాండెంట్ ఎం.ఐ.సురేష్,4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ పి.శ్రీనివాసరావు, వీరన్న, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రాజు, విజయ్, రవి,కార్తిక్, రాజ్‌కుమార్, రిజర్వు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో కమాండెంట్,పోలీస్ అధికారులు

తెలుసుకుందాం

మొలకలు ఇలా...

మొలకలు పోషకా భాండాగారాలే! అయితే అవి ఎంత పొడవు పెరిగిన తర్వాత తినడం ప్రయోజనకరం? తెలుసుకుందాం!



మొలకలు ఎంత పొడవు పెరిగితే వాటిలోని పోషకాలు అంతగా తగ్గిపోతాయి. మొలకలు వాటి పోషక శక్తిని మొక్కగా ఎదగడానికి ఖర్చు చేస్తాయి. కాబట్టి వాటిలోని పోషకాలను నష్టపోకుండా ఉండాలంటే మొలకెత్తిన వెంటనే తినేయాలి. అలాగే మొలకలు పొడవు పెరిగేకొద్దీ హానికారక బ్యాక్టీరియాను ఆకట్టుకుంటూ ఉటాయి. అలాగే జీర్ణ సమస్యలను కూడా తెచ్చి పెడతాయి. కాబట్టి మొలకల తోకలు గింజ పొడవు పెరిగిన వెంటనే తినేయాలి. అలాగే మొలకెత్తిన గింజలను ఒకట్రెండు రోజుల్లో తినేయాలి. ఈ మొలకల్లో జీవశక్తి ఉంటుంది. వీటికి పసుపు, నిమ్మరసం జోడించి తింటే, తేలికగా జీర్ణమవడంతో పాటు రోగనిరోధకశక్తి కూడా పెరుగుతుంది

పోషకాలు

పదార్థాలు పసందుగా...

పదార్థాల్లోని పోషకాలను మన శరీరం సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నా, జీర్ణ సమస్యలు వేధించకుండా ఉండాలన్నా కొన్ని నియమాలు పాటించాలి. అవేంటంటే...

పప్పులు: వండుకోడానికి ఒక రాత్రి ముందు కందిపప్పు, పెసరపప్పు మొదలైన పప్పులను నానబెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల వాటిలోని యాంటీ న్యూట్రియంట్లు వదిలిపోవడమే కాకుండా, ప్రొటీన్ శోషణ పెరుగుతుంది. ఇలా వండుకున్న పప్పులతో కడుపుబ్బరం సమస్య వేధించకుండా ఉంటుంది

సుగంధ ద్రవ్యాలు: నూనె లేకుండా వేయించి నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ చేసుకోవడం వల్ల వాటి సామర్థ్యం పెరుగుతుంది. తేలికగా జీర్ణమవుతాయి

సూప్: వీటికి యాపిల్, పైనాపిల్ మొదలైన పండ్లను జోడించకూడదు. వీటితో కడుపుబ్బరం వేధిస్తుంది. జీర్ణాగ్ని చల్లబడకుండా ఉండడం కోసం సూప్స్‌ను వేడిగానే తీసుకోవాలి

పాలు: తాగే ముందు తప్పనిసరిగా మరిగించాలి. పచ్చి పాలు జీర్ణం కావు

పండ్లు: భోజనంతో కలిపి కాకుండా పండ్లను విడిగా తినాలి. ఇతర పదార్థాలతో కలిపి తినడం వల్ల అసిడిటీ, పులిసే సమస్యలు వేధిస్తాయి



వైట్ డిశ్చార్జ్



యుక్త వయసు మొదలుకుని మెనోపాజ్ వరకూ మహిళల్లో కనిపించే అత్యంత సాధారణ లక్షణం... 'తెల్లబట్ట'! అయితే ఈ లక్షణాన్ని ప్రమాదకరంగా పరిగణించే సందర్భాలు కూడా ఉంటాయి. వాటి గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

ఆ తెలుపు సహజమేనా?

మహిళల్లో కనిపించే తెల్లబట్టను వైద్య పరిభాషలో 'లుకోరియా' అంటారు. యుక్తవయసు మొదలు మెనోపాజ్ దశ వరకూ మహిళల్లో ఈ లక్షణం కనిపించవచ్చు. మరీ ముఖ్యంగా టీనేజీ వయసు ఆడపిల్లల్లో ఈ లక్షణం అత్యంత సహజం. ఈ వయసు పిల్లల్లో హార్మోన్ల ఉధృతి ఫలితంగా తెల్లబట్ట కనిపించవచ్చు. ఆరోగ్యకరమైన అలవాట్లను కలిగి ఉండి, లైంగిక క్రీడలో పాల్గొనని యువతులు వైట్ డిశ్చార్జ్ గురించి కంగారుపడవలసిన అవసరం లేదు. ఒకవేళ స్రావం ఎక్కువగా ఉంటే ప్యాంటీ లైనర్స్ వాడుకోవాలి. అయితే ఈ సహజసిద్ధ స్రావానికి భయపడిపోయి వైద్యుల దగ్గరకు పరుగులు పెట్టే మహిళలు కూడా ఉంటారు. అయితే తెల్లబట్టను ఎప్పుడు ప్రమాదకరంగా భావించాలో తెలుసుకుని ఉండడం కూడా అవసరమే!

ఇవి సహజం

ఈ లక్షణాలతో కూడిన తెల్లబట్టతో ప్రమాదం లేదు. అవేంటంటే...

- దుర్వాసన లేకపోవడం
- తెల్లసొనలా పారదర్శకంగా ఉండడం
- జిగటతో సాగే గుణాన్ని కలిగి ఉండడం

ఇవి అసహజం

- పెరుగును పోలి ఉండడం
- పసుపు, ఆకుపచ్చ రంగులను కలిగి ఉండడం
- దుర్వాసన వెలువడడం
- దురద, మంట, అసౌకర్యం

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- జననావయాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- నెలసరి సమయంలో ప్యాడ్స్ పట్ల శుభ్రత పాటించాలి
- సర్జరీల తర్వాత ఇన్‌ఫెక్షన్లు సోకకుండా చూసుకోవాలి
- అసురక్షిత లైంగిక విధానాలకు దూరంగా ఉండాలి
- పోషకాహారంతో రక్తలేమిని తొలగించుకోవాలి
- వ్యాధినిరోధకశక్తి తగ్గకుండా చూసుకోవాలి
- మధుమేహాన్ని మందులతో అదుపులో పెట్టుకోవాలి

కారణాలు ఇవే!

దుర్వాసనతో కూడిన అసహజమైన తెల్లబట్టకు వేర్వేరు కారణాలుంటాయి. పలు రకాల ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు, లైంగిక వ్యాధులు, రక్తలేమితో వ్యాధినిరోధకశక్తి తగ్గడం.. ఈ సందర్భాల్లో దుర్వాసనతో కూడిన వైట్ డిశ్చార్జ్ కనిపిస్తుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే ఫెలోపియన్ ట్యూబ్స్ మూసుకుపోయి గర్భధారణ సమస్యలు తలెత్తవచ్చు, గర్భాశయ ముఖద్వారం దగ్గర పుండు ఏర్పడవచ్చు. ఈ పరిస్థితి దీర్ఘకాలంలో క్యాన్సర్‌గా మారవచ్చు. కాబట్టి తరచూ ఇన్‌ఫెక్షన్లతో కూడిన తెల్లబట్ట వేధిస్తున్నా, దుర్వాసన, రంగుతో కూడిన స్రావాలు కనిపిస్తున్నా, దురద, మంట వేధిస్తున్నా ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. రక్తపరీక్ష, శ్వాబ్ టెస్ట్‌తో ఇన్‌ఫెక్షన్ కారణాలను కనిపెట్టి వైద్యులు తగిన చికిత్సలను సూచిస్తారు. అలాగే క్యాన్సర్‌ను నిర్థారించే పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవడం కూడా అవసరమే!

చికిత్స ఇలా...

ఇన్‌ఫెక్షన్ సంబంధిత తెల్లబట్టకు వైద్యులు ప్రారంభంలో నోటి మాత్రలు సూచిస్తారు. అవసరాన్ని బట్టి జననావయవం దగ్గర ఉపయోగించే మాత్రలు, జెల్స్‌ను కూడా వైద్యులు సూచిస్తారు. రక్తం తక్కువగా ఉన్నప్పుడు ఐరన్ మాత్రలు సూచిస్తారు. ఒకవేళ ఈ చికిత్సతో సమస్య అదుపులోకి రాకపోతే, గర్భాశయ ముఖద్వారం దగ్గర ఏర్పడిన పుండును మాన్పడం కోసం 'క్రయోథెరపీ'ని ఆశ్రయించాలి. దీంతో పుండు దగ్గరి వ్యాధికారక కణాలు చనిపోయి, కొత్త కణాలు వృద్ధి చెందుతాయి. వైట్ డిశ్చార్జ్ వల్ల ఫెలోపియన్ ట్యూబులు పూర్తిగా మూసుకుపోయినప్పుడు, దెబ్బతిన్న ట్యూబును కత్తిరించి, కలపవలసి వస్తుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌గా మారితే, ఫెలోపియన్ ట్యూబ్స్‌తో పాటు గర్భాశయాన్ని తొలగించవలసి వస్తుంది. ఒకవేళ క్యాన్సర్ ఇతర అవయవాలకు పాకితే, కీమోథెరపీ, రేడియేషన్ కూడా అవసరమవుతుంది.



డాక్టర్ పి.నీలిమ, హెచ్ఒడి,
అబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజీ,
రెనోవా హాస్పిటల్స్
సనత్ నగర్, హైదరాబాద్.



అధ్యయనం




చికున్‌గున్యా ముప్పు

దీర్ఘకాలంలో భారతదేశం చికున్‌గున్యా ప్రభావానికి అధికంగా గురి కాక తప్పదనీ, ప్రతి ఏటా 51 లక్షల మంది భారతీయులు దోమల ద్వారా వ్యాపించే ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉందనీ బ్రిటిష్ మెడికల్ జర్నల్, గ్లోబల్ హెల్త్‌లో ప్రచురితమైన గ్లోబల్ మోడలింగ్ అధ్యయనం సూచిస్తోంది. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్‌కు చెందిన పరిశోధకులు చేపట్టిన అధ్యయనంలో దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావాలు ఆందోళన కలిగించేలా ఉంటున్నాయనీ, ఇప్పటికే చికున్‌గున్యా బారిన పడిన వారిలో 50 శాతం మంది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు ఆధారాల ద్వారా వెల్లడైందని వారు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 1.40 కోట్ల మంది ప్రజలు దీర్ఘకాలంలో చికున్ గున్యా బారిన పడే ముప్పును ఎదుర్కోబోతున్నట్టు ఈ అధ్యయనం అంచనా వేసింది. చికున్‌గున్యాకు సంబంధించి ఇప్పటివరకూ అందుబాటులో ఉన్న డాటాను, చికున్‌గున్యా సోకే అవకాశాలను పెంచే అంశాలతో జోడించడం ద్వారా ఈ వ్యాధి భారాన్ని అంచనా వేసిన మొట్టమొదటి అధ్యయనమిది. ఈ అధ్యయనంలో సమర్పించిన అంచనాలు ప్రాంతాల ప్రాధాన్యతకూ, పదేళ్లలోపు పిల్లలు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు లక్ష్యంగా వ్యాక్సీన్ అభివృద్ధికి తోడ్పడతాయని పరిశోధక బృందం భావిస్తోంది.

ఆరోగ్య కషాయాలు

చిన్నపాటి రుగ్మతలకు ఔషధాల మీద ఆధారపడకుండా కషాయాలను ఎంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. వేర్వేరు ఆరోగ్య సమస్యలకు సేవించదగిన వేర్వేరు కషాయాలు ఇవే!

ఆయుర్వేదం



త్రిఫల కషాయం

ఇక టీస్పూను త్రిఫల చూర్ణాన్ని రెండు కప్పుల నీళ్లకు జోడించి, ఆ నీళ్ల ఒక కప్పుకు తగ్గిపోయేవరకూ మరిగించాలి. ఈ కషాయం శరీరంలోని విషాలను హరించి, జీర్ణ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది.

సొంఠి కషాయం

సొంఠి, చిటికెడు బెల్లం, మిరియాల పొడి.. వీటిని గ్లాసు నీళ్లలో కలిపి మరిగించి తాగాలి. దీంతో అజీర్తి, వాంతులు తగ్గుతాయి

ఉసిరి, తేనె

తాజా ఉసిరి రసం, గోరువెచ్చని నీరు, ఒక స్పూను తేనెలను కలిపి తీసుకుంటే జీర్ణశక్తి మెరుగు పడుతుంది. అసిడిటీ అదుపులోకొస్తుంది. ఆకలి పెరుగుతుంది

వాము, ఇంగువ నీరు

వాము, చిటికెడు ఇంగువ గ్లాసు నీళ్లలో కలిపి మరిగించి తాగాలి. ఇలా చేస్తే, కడుపుబ్బరం తగ్గుతుంది. పొట్ట శుభ్రపడుతుంది.

ఐ కేర్

కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల తెరలతో కళ్లకు హాని జరుగుతుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఈ హాని నుంచి కళ్లను కాపాడుకోవడం కోసం ఎలాంటి కళ్లజోళ్లను వాడుకోవాలో తెలుసుకుందాం!



ఈ జోడుతో కళ్లకు రక్ష

తెరలు వెలువరించే నీలి రంగు నేరుగా కళ్లకు సోకడం హానికరం. కాబట్టి దాన్ని వడగట్టే పైపూత కలిగిన కళ్లజోళ్లను ఎంచుకోవాలి. సాధారణంగా ప్రతి కళ్లజోడులో ప్రకాశవంతమైన కాంతిని అడ్డుకునే 'యాంటీ రిఫ్లెక్షన్ కోటింగ్' ఉంటుంది. దీంతో కాంతి అద్దానికి తగిలి ప్రతిఫలించడం మూలంగా కళ్ల మీద ప్రభావం తగ్గుతుంది. దీనికి అదనంగా లెన్స్‌ను శుభ్రంగా ఉంచే 'యాంటీ స్మడ్జ్' పైపూతతో పాటు, 'బ్లూ లైట్ బ్లాకింగ్' పైపూత కూడా వేయించుకోవాలి.

డిజిటల్ లెన్స్‌తో...

కంప్యూటర్, ఫోన్ల వాడకంతో కళ్ల మీద ఒత్తిడి పడకుండా చేసే డిజిటల్ లెన్స్ కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. వీటిలో అంతర్గతంగా నిర్మితమయ్యే అకామడేషన్ ఏర్పాటు వల్ల, సాధారణ లెన్స్‌తో పోలిస్తే, ఈ డిజిటల్ లెన్స్ చూపులో మరింత స్పష్టతను అందించగలుగుతాయి. మరీ ముఖ్యంగా డిజిటల్ యాంటీ ఫెటీగ్ లెన్స్‌లు దగ్గరి పరిధికి పరిమితమై ఎక్కువ సమయాల పాటు పని చేసే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

లెన్స్ శుభ్రంగా...

లెన్స్ శుభ్రం చేసేటప్పుడు, ఆ మరకలు అద్దం మొత్తానికీ వ్యాపిస్తూ లెన్స్‌ను మరింత మసకబారుస్తూ ఉంటాయి. ఇలా జరగకుండా ఉండడం కోసం ఒక ప్రయత్నంలోనే లెన్స్‌ను శుభ్రపరచుకోడానికి సహాయపడే 'యాంటీ స్టాటిక్' లేదా 'హైడ్రోఫోబిక్ కోటింగ్' అనే పైపూతలు కూడా అందుబాటులో ఉన్నాయి.

పెరుగుతున్న మయోపియా

పిల్లల్లో మయోపియా పెరుగుతోంది. అందుకు వాళ్లు అనుసరిస్తున్న జీవనశైలే ప్రధాన కారణం. మొబైల్ ఫోన్ల వాడకం పిల్లల్లో పెరుగుతూ ఉండడంతో వాళ్ల కంటి మైనస్ పవర్ కూడా పెరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే 2050 నాటికి 50 శాతం మంది పిల్లలు మయోపియాకు గురవుతారని ఒక అంచనా! అయితే ఈ సమస్య ఉన్న పిల్లలు కంటికి దగ్గరగా ఉన్నవి స్పష్టంగా కనిపించే మయోపియా కళ్లజోడునే ఇప్పటివరకూ ఉపయోగించుకుంటూ ఉన్నారు. అయితే ఆ సౌలభ్యంతో పాటు, ఉన్న మయోపియా మరింత పెరగకుండా నియంత్రించే కళ్లజోళ్లు కూడా ఇప్పుడు అందుబాటులో కొచ్చాయి.

కళ్లు అలసిపోకుండా...

కంప్యూటర్ల ముందు ఏకాగ్రతతో పని చేసే సమయంలో తరచూ కనురెప్ప వేయడం మర్చిపోతూ ఉంటాం. దాంతో కళ్లు పొడిబారిపోవడం, కళ్ల మంటలు, కళ్లు ఎర్రబడడం, నీరు కారడం లాంటి సమస్యలు వేధిస్తాయి. ఇలా జరగకుండా ఉండాలంటే తప్పనిసరిగా 20:20:20 నియమం పాటించాలి. ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలోని వస్తువును చూడాలి.



సందీప్ రెడ్డి పడమటి,
ఆప్టోమెట్రిస్ట్,
కన్సల్టెంట్, ఎల్ వి ప్రసాద్
ఐ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.

బిడ్డల రక్షణ

కంగారూ కేర్‌తో మెదడు ఎదుగుదల

ప్రసవం తదనంతరం పసికందుకు తల్లి ఎంత దగ్గరగా ఉంటే అంత మెరుగ్గా బిడ్డ మెదడు ఎదుగుతుందని తాజా పరిశోధనలో తేలింది. కంగారూ కేర్‌లో భాగంగా, తరచూ బిడ్డను శరీరానికి హత్తుకోవడం వల్ల, నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో మెదడు ఎదుగుదల సమస్యలు సర్దుకుంటాయని పరిశోధకులు అంటున్నారు.

32 వారాలకంటే ముందే పుట్టిన పిల్లల్లో ఎదుగుదల లోపాలుంటాయి. ఎదిగే క్రమంలో ఇవి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడతాయి. అయితే ఈ లోపాలను సరిదిద్దే ఒక తాజా ఉపాయాన్ని పరిశోధకులు ఒక ప్రయోగం ద్వారా కనిపెట్టారు.



ఇందుకోసం 88 మంది నెలలు నిండకుండా పుట్టిన పిల్లల విషయంలో స్కిన్ టు స్కిన్ కాంటాక్ట్ లేదా కంగారూ కేర్ పద్ధతిని అనుసరించారు. దీన్లో భాగంగా రెండు నెలల పాటు రోజు మొత్తంలో కనీసం 24 నిమిషాల నుంచి 70 నిమిషాల పాటు పసికందులను తల్లికి చేరువగా ఉంచారు. ఆ తర్వాత పిల్లల మెదళ్లకు ఎమ్మారై స్కాన్ చేసినప్పుడు, ఇలాంటి పద్ధతి ఫలితంగా పిల్లల మెదళ్లలోని... ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, భావోద్వేగ నియంత్రణలకు సంబంధించిన పాత్‌వేస్ మార్పులు జరగడాన్ని పరిశోధకులు గమనించారు.

ఇలా మనసు దిటవు

జీవితంలో ఎన్నో హఠాత్పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. అలాంటి ఊహించని సందర్భాన్ని ఎదుర్కొని, మనసును కుదుటపరుచుకుని, జీవితంలో ముందుకు సాగే ఆత్మస్థయిర్యం అందరికీ ఉండకపోవచ్చు. అలాంటప్పుడు ఆ విపత్కర పరిస్థితుల్లో ఎలా నడుచుకోవాలో తెలుసుకుందాం!

సమస్యలు చెప్పి రావు. ఒక్కోసారి అందుకు సంసిద్ధమయ్యే సమయం కూడా చిక్కకపోవచ్చు. ఊహించని సమయంలో అకస్మాత్తుగా తలెత్తే జీవిత సమస్యలు ఎంతటివారినైనా అతలాకుతలం చేసేస్తాయి. హఠాత్తుగా రాత్రికి రాత్రే కుటుంబ పెద్ద గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవచ్చు. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధి బయల్పడవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఒక్కసారిగా కుదేలైపోతూ ఉంటాం. కానీ కాలాన్ని వెనక్కి మళ్లించలేకపోయినా, ఆ పరిస్థితితో ఎలా నడుచుకోవాలో, మనసును ఎలా దిటవు చేసుకోవాలో తెలుసుకోవాలి. సమిష్టిగా సమస్యతో పోరాడే ఆత్మస్థైర్యాన్ని కుటుంబం కూడగట్టుకోవాలి.

ధైర్యం నూరిపోస్తూ... ధైర్యంగా ఉంటూ...

కుటుంబంలో ఒకరికి తీవ్ర అనారోగ్యం సోకితే మిగతా కుటుంబ సభ్యులు ఎంతో వేదనకు లోనవుతారు. మరీ ముఖ్యంగా పెద్దలు ఓ పక్క బాధను దిగమింగుకుంటూనే, మిగతా కుటుంబసభ్యులను ఓదార్చవలసి వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో బెంబేలు పడిపోకుండా, అనారోగ్యానికి గురైన వ్యక్తులను భరోసా కల్పించాలి. వ్యాధికి సంబంధించిన లోతైన అవగాహనను ఏర్పరుచుకుంటూ, అందుబాటులోకొచ్చిన విజయవంతమైన చికిత్సల గురించి, కోలుకున్న వ్యక్తుల విజయగాథల గురించి రోగికి వివరిస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి. రోగి పట్ల జాలి కనబరచడం, విషాదకరమైన వృత్తాంతాలను గుర్తు చేసుకోవడం, చికిత్సకయ్యే ఖర్చుల గురించి, ఆర్థిక ఇబ్బందుల గురించి రోగి ముందే చర్చించడం లాంటివి చేయకూడదు. రోగిని తన గదికే పరిమితం చేయకుండా కుటుంబ వ్యవహారాల్లో జోక్యం కల్పిస్తూ ఉండాలి. వారికి నచ్చిన వ్యక్తులను ఇంటికి పిలిపిస్తూ, నచ్చిన పనులు చేయిస్తూ కాలక్షేపాన్ని అందించాలి. కుంగుబాటులోకి కూరుకుపోతున్నారేమోనని గమనిస్తూ ఉండాలి. వారి అభిరుచులకు సంబంధించిన వీడియోలు, సినిమాలు చూపించాలి. అవసరమనుకుంటే కౌన్సెలింగ్ థెరపిస్ట్‌ను ఇంటికి పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించాలి. రోగితో వ్యవహరించవలసిన తీరు గురించి కౌన్సెలర్‌ను అడిగి తెలుసుకోవాలి.

భాగస్వామిని కోల్పోతే...

గుండెపోటుతో అకస్మాత్తుగా భాగస్వామిని కోల్పోయినప్పుడు ఒక్కసారిగా చుట్టూ ఉన్న ప్రపంచమంతా కుప్పకూలిపోతుంది. జీవితంలో శూన్యం ఆవహిస్తుంది. నిజానికి ఈ దుస్థితిని ఎదుర్కొన్న ఎవరికైనా ఈ లోటు పూడ్చలేనిదే! అయినా ఆ పరిస్థితిని అంగీకరించే ఆత్మనిబ్బరాన్ని పెంపొందించుకోవాలి. జరిగిపోయినదాన్ని సరిదిద్దలేమనే విషయాన్ని మొదట అర్థం చేసుకుని, ముందు జరగబోయే పనుల గురించి ఆలోచించాలి. భాగస్వామి లేని లోటును భర్తీ చేసే బాధ్యత తమ మీద ఉందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఈ కష్టం నాకే రావాలా? నాకే ఇలా ఎందుకు జరిగింది? అనుకుంటూ కుంగుబాటుకు లోనవడం సరికాదు. మనకంటే ఎక్కువ కష్టాలను ఎదుర్కొనే వాళ్లు కూడా ఉంటారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. పిల్లలకు మనోధైర్యాన్ని నూరిపోస్తూ, మనోనిబ్బరంతో మసలుకోవడం అలవాటు చేసుకోవాలి. భాగస్వామిని కోల్పోయిన వేదన కొన్ని రోజుల పాటు వేధించవచ్చు. నిద్ర కరవవవచ్చు. నీరసించిపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో వైద్యుల సహాయం తీసుకోవాలి. నెలల తరబడి కుంగుబాటు వేధిస్తే మానసిక వైద్యులను ఆశ్రయించాలి. వీలైనంత త్వరగా జీవితాన్ని తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేయాలి. మనసు దిగులులో కూరుకుపోకుండా పనులు కల్పించుకోవాలి. గతాన్నే గుర్తు చేసుకునే ధోరణికి స్వస్తి చెప్పాలి. పాత జ్ఞాపకాలు పదే పదే వేధిస్తుంటే, స్థల మార్పిడి కొంత మేరకు సహాయపడుతుంది.





డాక్టర్ పి.రాధిక,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
విజయవాడ

భూకేటాయింపుల లెక్కలు తేల్చండి: పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు దశాబ్దాలుగా రెవెన్యూ శాఖ నుంచి వివిధ అవసరాల కోసం ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు సేకరించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు కేటాయించిన భూములు, వాటి వినియోగం, ప్రస్తుత పరిస్థితి మీద సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. సోమవారం అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నీటిపారుదల శాఖ, అటవీ శాఖలతోపాటు పలు విభాగల అవసరాల కోసం రెవెన్యూ శాఖ నుంచి భూములు కేటాయించారని, అయితే రాష్ట్ర విభజన తర్వాత కొన్ని కేటాయింపులు రద్దయ్యాయని చెప్పారు. గత 30-40 ఏళ్లలో అటవీ శాఖకు కేటాయించిన భూమి ఎంత అనేది తేల్చేందుకు అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు కలిసి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

ఆర్ట్ గ్యాలరీపై ప్రణాళిక సిద్ధం చేయండి: జూపల్లి

ఆర్ట్ గ్యాలరీని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. చిత్రకారులు, కళాకారులు ఈ గ్యాలరీని మరింత సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదాపూర్‌లోని ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన ఆయన ఆర్ట్ గ్యాలరీ సాంస్కృతిక కళాసారథి సంస్థల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కళాసారథి కార్యాలయంలోని ఆడియో, వీడియో స్టూడియోలో సౌండ్ ప్రూఫింగ్ పనులను తక్షణమే చేపట్టాలని సూచించారు.

సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్ సద్భావనా అవార్డు

రాజీవ్‌గాంధీ సద్భావనా అవార్డుకు ఈ ఏడాది సీడబ్ల్యూసీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్‌ను ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన వివరాలను అవార్డు ఎంపిక కమిటీ సభ్యులు బి కమలాకర్‌రావు, ఎ శ్యామ్‌మోహన్ వెల్లడించారు. 19న చార్మినార్ వద్ద జరిగే కార్యక్రమంలో ఖుర్షీద్‌కు అవార్డు ప్రదానం జరగనుందని తెలిపారు. 1990 అక్టోబరు 19న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చార్మినార్ వద్ద కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి సద్భావనా యాత్ర చేశారని, 35 ఏళ్లుగా రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రా స్మారక దినంగా పాటిస్తూ వివిధ రంగాల్లో సేవలందించిన ఒక ప్రముఖ వ్యక్తిని సద్భావనా అవార్డుతో సత్కరిస్తున్నామన్నారు.

నీట్, జేఈఈ స్టూడెంట్ మెంబర్‌షిప్ ప్రారంభం

నీట్, జేఈఈ-2026 విద్యార్థుల కోసం ఎడుగ్రామ్, ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం సంయుక్తంగా 'స్టూడెంట్ మెంబెర్ షిప్' రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారు. ఈ మెంబెర్‌షిప్ పొందడం ద్వారా ఒక్కో విద్యార్థి 2026 పరీక్షల వరకు వాట్సాప్/ ఈ-మెయిల్ ద్వారా డిజిటల్ మెటీరియల్ పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఎన్‌టీఏ సిలబస్ అనుగుణంగా ప్రతి విద్యార్థికి అవసరమైన నీట్, జేఈఈ స్టడీ మెటీరియల్, సొల్యూషన్స్, క్విక్ రివిజన్+ఫార్ములా బుక్‌లెట్స్, గ్రాండ్ టెస్టులు+సొల్యూషన్స్, క్వశ్చన్ బ్యాంక్స్ చాప్టర్ వైజ్ గ్రాండ్ టెస్టులు+సొల్యూషన్స్, ఎన్‌సీఈఆర్‌టీ మాక్స్, తదితర డిజిటల్ మెటీరియల్‌ను(వన్ ఇయర్ మెంబెర్ షిప్) ద్వారా పొందవచ్చు. ఆసక్తి కలిగిన విద్యార్థులు WWW.EDUGRAM 360.COM వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

రెండేళ్లలోపు చిన్నారులకు దగ్గు మందు ఇవ్వొద్దు

» రాష్ట్ర వైద్యశాఖ హెచ్చరిక

చిన్నారులకు దగ్గు, జలుబు రాగానే సిరప్‌ల వైద్యం ప్రమాదకరమని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. పిల్లలకు దగ్గు మందుల వాడకంపై జాగ్రత్తలు పాటించాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ సూచనల మేరకు వైద్యులు, తల్లిదండ్రులకు వైద్య ఆరోగ్యశాఖ సోమవారం అడ్వయిజరీ జారీ చేసింది. రెండేళ్లలోపు బాలలకు దగ్గు మందు ఇవ్వొద్దని, ఐదేళ్లలోపు పిల్లలకూ సాధారణంగా సిరప్‌లు వాడొద్దని పేర్కొంది. ఐదేళ్లు దాటిన చిన్నారులకు అవసరమైన మేరకు వైద్యుల పర్యవేక్షణలో సరైన మోతాదులో తక్కువ కాలంపాటు సిరప్‌లు వినియోగించాలని సూచించింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కూడా నాణ్యమైన తయారీ ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులే రోగులకందించాలని కోరింది. ఇదిలా ఉంటే, 2025 మే నుంచి 2027 ఏప్రిల్ వరకూ గడువు గల ఎస్ఆర్-13 బ్యాచ్ కోల్డ్రిఫ్ సిరప్‌ను వాడొద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరించింది. తమిళనాడులోని స్రేసన్ కంపెనీ తయారు చేసిన ఈ సిరప్ కలిగి ఉన్న వారు వెంటనే సమీప ఔషధ నియంత్రణ అధికారులకు అప్పగించాలని కోరింది. సంబంధిత ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800-599-6969 అందుబాటులోకి తెచ్చింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, బోధనాస్పత్రులకు ఈ సూచనలను తెలపడంతోపాటు కఠినంగా అమలు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించింది. దగ్గుమందుపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని కోరింది.

ఎంబీబీఎస్ విద్యార్థికి కేటీఆర్ ఆర్థిక సాయం



హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ పేద విద్యార్థి కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నా.. ట్యూషన్ ఫీజు కూడా కట్టలేని స్థితిలో ఉన్నాడని తనకు వచ్చిన ట్వీట్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించి ఆర్థిక సాయం అందించారు. వరంగల్‌లోని పెద్దమ్మగడ్డకు చెందిన ఆర్మూళ్ల గణేశ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను, తోబుట్టువును కోల్పోయి, తన అమ్మమ్మ ఇంట్లో పెరిగాడు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడు. ప్రతిభావంతుడైన పేద విద్యార్థి ఎంబీబీఎస్ కలను సాకారం చేసేందుకు తక్షణ సాయంగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ద్వారా రూ.1,50,000 చెక్కును కేటీఆర్ అందజేశారు. ఆ విద్యార్థి ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు అవసరమైన ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, ఇతర ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

వచ్చేనెల 11న

ఈ నెల 13 నుంచి నామినేషన్ల స్వీకరణ

» నామినేషన్లకు 21 తుది గడువు
» 24 వరకు ఉపసంహరణకు గడువు
» వచ్చేనెల 11న పోలింగ్.. 14న లెక్కింపు
» షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
» హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల కోడ్
» పారదర్శకంగా ఉప ఎన్నిక నిర్వహిస్తాం
» ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. నవంబరు 11న ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. 14న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచే నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 21 తుది గడువు కాగా, 22న పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 24 వరకు అవకాశం ఉంటుంది. ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో సోమవారం (ఈ నెల 6) నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ఎన్నికను పారదర్శకంగా నిర్వహిస్తామని, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. తుది ఓటరు జాబితాను కూడా ఇటీవలే విడుదల చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటికి అనుగుణంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు, వీవీప్యాట్ యంత్రాలను ఇప్పటికే పరీక్షించి సిద్ధం చేశామన్నారు. పోలింగ్ సాఫీగా జరిగేందుకు సాంకేతిక, భద్రతా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఓటర్లు ఓటరు జాబితాలో తమ పేర్లు, పోలింగ్ స్టేషన్ నంబర్, ఇతర వివరాలను పరిశీలించుకొని.. తగిన గుర్తింపు కార్డుతో ఓటు వేసేందుకు రావాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డుతోపాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, పెన్షన్ పత్రం వంటి గుర్తింపు పత్రాలను చూపించి ఓటు వేయవచ్చని వివరించారు. ఉప ఎన్నికలో పోటీచేసే అభ్యర్థులు తమ క్రిమినల్ నేపథ్యం, ఇతర వివరాలను పత్రికలు, టీవీ, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటించడం తప్పనిసరి అని సీఈవో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంతోపాటు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని 8 స్థానాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి.

హైదరాబాద్ జిల్లా పరిధిలో ఎన్నికల కోడ్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో హైదరాబాద్ జిల్లా పరిధిలోని ప్రాంతాలకు ఎన్నికల కోడ్ వర్తిస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రకటించారు. గ్రేటర్ పరిధిలో మేడ్చల్- మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు కూడా ఉన్నప్పటికీ.. ఎన్నికలు జరిగే జూబ్లీహిల్స్ నియోజకవర్గం హైదరాబాద్ జిల్లా పరిధిలో ఉన్న దృష్ట్యా ఇక్కడ మాత్రమే కోడ్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఇతర జిల్లాలకు వర్తించదన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో కలిసి బల్దియా ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర పోలీసులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగుతామన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 3.98 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, మరో ఐదు రోజులపాటు (ఈ నెల 11 వరకు) ఓటు నమోదుకు అవకాశం ఉన్నందున.. ఓటర్ల సంఖ్య 4లక్షలు దాటుతుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సగటున ఒక్కో కేంద్రంలో 980 మంది ఓటర్లు ఉంటారని వెల్లడించారు. కొందరు వ్యక్తులు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపిస్తామన్నారు. కాగా, లైసెన్స్‌డ్ రివాల్వర్లు ఉన్నవారు వాటిని వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయాలని నగర సీపీ సజ్జనార్ సూచించారు. రౌడీ/హిస్టరీ షీట్స్ ఉన్న వారిని బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు.

మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ అభ్యర్థి ప్రకటన

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేసే తమ అభ్యర్థిని మూడు రోజుల్లో ప్రకటిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సెగ్మెంటు టికెట్‌కు పోటీ ఉందన్న ఆయన గట్టి అభ్యర్థి కోసం అభిప్రాయ సేకరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, మాజీ ఎంపీ పి.రాములు, సీనియర్ నాయకుడు కోమల ఆంజనేయులుతో కూడిన త్రిసభ్య కమిటీ అభిప్రాయ సేకరణ చేపట్టిందని, అనంతరం పార్టీ ఎన్నికల కమిటీ అభ్యర్థిని ఖరారు చేస్తుందని రాంచందర్‌రావు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తాము గెలుచుకుని తీరుతామన్న ధీమా వ్యక్తం చేశారు.

నేడో రేపో కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన

» నేడు చర్చించనున్న సీఎం, పీసీసీ చీఫ్, మీనాక్షి
» మూడు పేర్లతో అధిష్ఠానానికి ప్రతిపాదన!
» స్థానిక నేత వైపే సీఎం రేవంత్ మొగ్గు
» బీసీ నేతకే టికెట్ దక్కే అవకాశం
» మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను.. వక్రీకరించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా
» డిసెంబరు నాటికి పార్టీ పదవుల భర్తీ
» మీడియాతో చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది ఒకటి రెండు రోజుల్లో తేలనుంది. అభ్యర్థి ఎంపికపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ మంగళవారం సమావేశం కానున్నారు. జూమ్ ద్వారా జరిగే ఈ సమావేశంలో మూడు పేర్లతో ప్రతిపాదనను ఖరారు చేసి పరిశీలన కోసం అధిష్ఠానానికి పంపనున్నారు. ఆ పేర్లను హైకమాండ్ పరిశీలించి మంగళవారం రాత్రి లేదా బుధవారం అభ్యర్థిని ప్రకటించనున్నట్లు సమాచారం. ఉప ఎన్నికకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామి నాలుగు పేర్లను ప్రతిపాదిస్తూ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ నివేదికతోపాటు సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థి ఎంపికపైన సీఎం రేవంత్, మహేశ్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్ చర్చించనున్నారు. నియోజకవర్గంలోని సామాజిక సమీకరణాలు, ప్రతిపాదిత అభ్యర్థుల సానుకూల, ప్రతికూల అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆశావహుల జాబితాను మూడు పేర్లకు కుదించనున్నారు. ఒక్కో పేరుకు సంబంధించి సానుకూల, ప్రతికూల అంశాలను ప్రస్తావిస్తూ సమగ్ర ప్రతిపాదనను అధిష్ఠానానికి పంపనున్నారు. అనంతరం అధిష్ఠానం.. సీఎంరేవంత్ సహా ఇతర నేతలను సంప్రదించి అభ్యర్థిని ఖరారు చేయనుంది. అయితే ఈ ఉప ఎన్నిక.. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా ప్రచారం జరుగుతుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయానికే అధిష్ఠానం ఓటు వేస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, స్థానిక నేతనే అభ్యర్థిగా ఎంపిక చేయాలన్న ప్రతిపాదనకు సీఎం రేవంత్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

రేసులో ప్రధానంగా నలుగురు..

అధికార పార్టీ అభ్యర్థిత్వం కావడం, ఎంఐఎం మద్దతుతో ఉప ఎన్నికలో గెలిచే అవకాశాలుండటంతో టికెట్ రేసులో ఉండేందుకు నేతలు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేసుకున్నారు. ఒకవేళ జూబ్లీహిల్స్ టికెట్ దక్కకపోయినా.. తమ రాజకీయ భవిష్యత్తుపై ప్రభుత్వం, పార్టీ నుంచి ఏదో ఒక హామీ లభిస్తుందన్న ఆశతోనూ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన వారు కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటున్నారు. ఈ మేరకు అధిష్ఠానం పెద్దలను, ముఖ్య నాయకులను సంప్రదిస్తున్నారు. అయితే ఎవరెన్ని ప్రయత్నాల్లో ఉన్నా.. రేసులో ప్రధానంగా నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ విషయంలో ఆలస్యం జరుగుతుండడంతో అజరుద్దీన్ సైతం జూబ్లీహిల్స్ టికెట్ కోసం అధిష్ఠానం పెద్దలను కలిశారు.

బీసీ నేతకే టికెట్ దక్కే అవకాశం!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ టికెట్ బీసీ నేతకే దక్కే అవకాశం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అధిష్ఠానం రెండు, మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేయనుందని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక మాదిరిగానే జూబ్లీహిల్స్‌లోనూ గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలను బీఆర్ఎస్ సోషల్ మీడియా వక్రీకరించిందని, ఈ విషయంలో అసత్య ప్రచారాలను నమ్మవద్దని అన్నారు. ఇక పార్టీ పదవులన్నీ డిసెంబరు చివరి నాటికి భర్తీ అవుతాయని తెలిపారు. మూడు రోజుల్లో మీనాక్షీ నటరాజన్, ముగ్గురు మంత్రులతో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బస్తీ బాట కార్యక్రమం చేపడతారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక పరిస్థితులను బట్టి సీపీఐ, సీపీఎం, టీజేఎస్ పార్టీల అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

మిస్టర్ హరీశ్‌రావు.. మాది చేతల ప్రభుత్వం: కోమటిరెడ్డి

» 31న సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): 'మిస్టర్ హరీశ్‌రావు.. మాది చేతల ప్రభుత్వం.. మీలా మాటల సర్కారు కాదు. మా ప్రభుత్వంలో విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. మీ హయాంలో శంకుస్థాపన స్థాయిలో విడిచిపెట్టిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్స్ (టిమ్స్) ఆస్పత్రులను వేగంగా నిర్మిస్తున్నాం' అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. టిమ్స్ ఆస్పత్రులపై ప్రభుత్వం జాప్యం చేస్తోందంటూ ఇటీవల హరీశ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి బదులిచ్చారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రూ.40 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని, తామే వాటిని చెల్లిస్తున్నామన్నారు. సనత్‌నగర్ టిమ్స్‌ను ఈనెల 31న ప్రారంభిస్తామని, అల్వాల్‌లోని టిమ్స్‌ను వచ్చే ఏడాది మార్చిలో, ఎల్బీనగర్ టిమ్స్‌ను అదే ఏడాది జూన్ నాటికి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అలాగే నిమ్స్ విస్తరణ పనులను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.

స్వస్థనారిలో 20 లక్షల మందికి వైద్య పరీక్షలు

» కార్యక్రమానికి అనూహ్య స్పందన
» 5,065 స్పెషలిస్టు క్యాంపులు: వైద్యశాఖ

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్థనారి, సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలకు భారీ స్పందన లభించింది. 16 రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరాల్లో ఉచితంగా 20 లక్షల మంది వైద్య సేవలు పొందారు. ఇందులో 14 లక్షల మంది మహిళలు కాగా వారితో పాటు శిబిరాలకు వచ్చిన మరో 6 లక్షల మంది పురుషులకు సైతం ఉచిత పరీక్షలు చేసినట్లు వైద్య శాఖ వెల్లడించింది. స్వస్థనారి కార్యక్రమాన్ని గత నెల 17న మధ్యప్రదేశ్‌లో ప్రధాని మోదీ ప్రారంభించారు. రాష్ట్రంలో వైద్యమంత్రి దామోదర రాజనర్సింహ వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రారంభించారు. అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. తెలంగాణ వ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాస్పత్రుల వరకు మొత్తం 5,065 స్పెషలిస్టు క్యాంపులు నిర్వహించారు. అలాగే 41,153 స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున 33 జిల్లాల్లో మెగా శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ వైద్య సేవలు అందించారు. వీటి ద్వారా 20,78,284 మంది వైద్య సేవలు పొందారని వైద్య శాఖ వెల్లడించింది.

ఎకరానికి రూ.177 కోట్లు!

2021 జూలై 15న	ఎకరం	60కోట్లు
2023 ఆగస్టు 3న	ఎకరం	100.75 కోట్లు
2025 అక్టోబర్ 6న	ఎకరం	177 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ధర పలికింది. అప్పట్లో గండిపేట వ్యూతో ఆ భూమికి అంతధర పలికింది. ఇప్పుడు దుర్గంచెరువు వ్యూతో ఉండే ఈ భూమి ఆ రికార్డును చెరిపేసింది. 2017లో ఇదే రాయదుర్గం ప్రాంతంలో ఎకరానికి రూ.42.59 కోట్లకు పలకగా, ఎనిమిదేళ్లలో నాలుగు రెట్లు పెరగడం గమనార్హం. ఇప్పుడు కొనుగోలు చేసిన భూమి ప్రస్తుత బంగారం ధరతో పోలిస్తే ఎకరా 152 కిలోల బంగారం ధరతో సమానం. టీజీఐఐసీ సోమవారం నిర్వహించిన వేలంలో ప్రముఖ జాతీయ, ప్రాంతీయ రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొన్నాయి. ఐటీ కారిడార్ ప్రాంతం కావడం రవాణాపరంగా అత్యంత సమీపంలోనే మెట్రో సదుపాయం ఉండటంతో 7.67 ఎకరాల ప్రభుత్వ భూమిని దక్కించుకునేందుకు స్థిరాస్తి సంస్థలు పోటీ పడ్డాయి. చివరకు ఎంఎస్ఎన్ రియాల్టీ సంస్థ అత్యధిక ధరకు మొత్తం భూమిని దక్కించుకుంది. 2022లో కోకాపేటలోని నియోపోలిస్‌లో హెచ్ఎండీఏ నిర్వహించిన వేలంలో ఎకరం ధర రూ.100.75 పలికినపుడు ఆ విషయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అప్పట్లో రాజపుష్ప ఈ భూమిని కొనుగోలు చేసింది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ప్రముఖ వాణిజ్య ప్రాంతంలోనూ ఇంత ధర లేదని అప్పట్లో స్థిరాస్తి నిపుణులు విశ్లేషించారు. దీనిపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీడియా సమావేశంలో ప్రస్తావించారు. ఈ ధర తెలంగాణ అభివృద్ధికి, రియల్ ఎస్టేట్ రంగం వేగవంతమైన ఎదుగుదలకు ఉదాహరణగా



ఎకరం 177 కోట్లు పలికిన స్థలం

పేర్కొన్నారు. అయితే, ఇప్పుడు అంతకుమించి ఎకరానికి రూ.77 కోట్లు అదనంగా అమ్ముడు పోయింది. రాష్ట్రంలోనే కాదు దేశ రియల్ ఎస్టేట్ రంగంలోనే ఇదో కొత్త మైలురాయి అని స్థిరాస్తి రంగం నిపుణులు పేర్కొంటున్నారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని మొత్తం 18.67 ఎకరాలను రెండు భాగాలుగా విభజించి టీజీఐఐసీ వేలం వేసింది. ఇందులో ఒకటి 7.67 ఎకరాలు కాగా మరోటి 11 ఎకరాలు. ప్రముఖ రియల్ ఎస్టేట్ రంగం సంస్థ ప్రెస్టీజ్ 11ఎకరాలను రూ.1556 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ లెక్కన ఇందులో ఎకరానికి రూ.141.45 కోట్ల ధర పలికింది. ఈ భూములతో ప్రభుత్వానికి రూ.2913 కోట్ల ఆదాయం సమకూరింది. రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ కలుపుకుంటే సర్కారుకు మొత్తం రూ.3,135 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

తెలంగాణకు గర్వకారణం

రాయదుర్గం వేలం విజయం తెలంగాణకు గర్వకారణమని టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ కె.శశాంక పేర్కొన్నారు. తొమ్మిది ఏళ్ల వ్యవధిలో రాయదుర్గం భూమి ధర నాలుగు రెట్లు పెరగడం హైదరాబాద్ స్థిరమైన అభివృద్ధి దిశలో కొనసాగుతున్న వేగాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. ఎకరానికి 177 కోట్ల రికార్డు ధర హైదరాబాద్ దీర్ఘకాలిక సామర్థ్యానికి సూచిక అని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుల నాయకత్వంలో పారదర్శక, వ్యాపారానుకూల వాతావరణం ఏర్పడిందని ఈ విజయంతో స్పష్టమైందన్నారు.

ఎందుకింత ధర?

బహుళ జాతి కంపెనీలు, ప్రపంచ సామర్థ్య కేంద్రాలకు ప్రాధాన్యత గల నగరంగా నిలువడంతో ప్రపంచ దేశాలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయి. ఐటీ, ఐఈఈఎస్, ఫార్మా, ఏరోస్పేస్, ఏవియేషన్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ వాహనాలు, ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానముండడంతో ఆఫీసు స్పేస్‌కు, నివాస, వాణిజ్య భవనాలకు డిమాండ్ ఉన్నది. ప్రధానంగా ఐటీ కారిడార్‌లో ప్రస్తుతం భూములు, స్థలాలు దొరకడమే గగనంగా మారిన పరిస్థితుల్లో ఈ స్థాయి ధరలు పలుకుతున్నాయనిరియల్టీ వర్గాలు అంటున్నాయి.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

యాక్షన్ కార్తీక్



నాగశౌర్య కథానాయకుడిగా రామ్ దేశినా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'. శ్రీనివాసరావు చింతపూడి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, పాటలు ఆకట్టుకున్నాయి. సోమవారం నాగశౌర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో పూర్తిస్థాయి యాక్షన్ అవతార్‌లో కనిపించారు నాగశౌర్య. సంభాషణలు, వినోదం, పోరాట ఘట్టాలు అలరించేలా ఉన్నాయి. త్వరలోనే సినిమా విడుదల కానుంది. ఈ చిత్రంలో సాయికుమార్, నరేశ్ వీకే, సముద్రఖని, వెన్నెలకిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, డీఓపీ: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జయరాజ్.

క్షేమంగా ఉన్నా



తన కారు ప్రమాదంపై విజయ్ దేవరకొండ స్పందించారు. తాను క్షేమంగా ఉన్నానని, ఇంటికి చేరుకున్నానని తెలిపారు. ఆందోళన చెందవద్దని అభిమానులకు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాగా, పుట్టపర్తి సత్యసాయి బాబా సమాధిని దర్శించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన సమయంలో విజయ్ కారుకు ప్రమాదం జరిగింది. జోగులాంబ గద్వాల్ జిల్లా సమీపంలో ఆయన కారును ఒక బొలేరో ఢీకొట్టడంతో కారు దెబ్బతింది. స్నేహితుడి కారులో ఆయన సురక్షితంగా హైదరాబాద్ చేరుకున్నారు.

అలంపూరు చౌరస్తా (ఆంధ్రజ్యోతి)

ఛాంపియన్ సిద్ధం




రోషన్ కథానాయకుడిగా జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న చిత్రం 'ఛాంపియన్'. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాను స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇటీవలె విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్‌కు మంచి ఆదరణ దక్కింది. సోమవారం సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. డిసెంబర్ 25న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది.



అక్కినేని నాగార్జున 100వ చిత్రం సోమవారం ప్రారంభమైంది. 'కింగ్ 100' అనేది వర్కింగ్ టైటిల్. భారీ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రానికి తమిళ దర్శకుడు, 'ఆకాశం' ఫేమ్ రా కార్తీక్ దర్శకుడు. 'లాటరీ కింగ్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

శక్తిమంతమైన లుక్



ధ్రువ సర్జా, ఐశ్వర్య అర్జున్ జంటగా అర్జున్ సర్జా స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'సీతా పయనం'. సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ధ్రువ సర్జా పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. త్వరలోనే సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఆయూబ్ ఖాన్, డీఓపీ: జి బాలమురుగన్, సంగీతం: అనూప్ రూబెన్స్.

సింగారి సిత్రాలు



ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు జంటగా నటిస్తున్న చిత్రం 'డ్యూడ్'. శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ నెల 17న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా చిత్రబృందం 'సింగారి' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా ఈ పాటను సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ స్వరపరిచి పాడారు. 'ప్రేమకథతో పాటు కుటుంబ భావోద్వేగాలు ప్రేక్షకులను అలరిస్తాయి. ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు నటన సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది. దర్శకుడు కథను మలిచిన తీరు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది, లవ్‌స్టోరీల్లో డ్యూడ్ చిత్రం ఒక సరికొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తుంది' అని మేకర్స్ తెలిపారు.

శ్రీశైలం చరిత్రలోనే అత్యధిక వరద

- జూన్ నుంచి ఇప్పటిదాకా ప్రాజెక్టులోకి 2105 టీఎంసీల ఇన్‌ఫ్లో
- ఈ వాటర్ ఇయర్‌లో మరో 100 టీఎంసీలు వచ్చే అవకాశం
- బంగాళాఖాతంలోకి 3905 టీఎంసీల గోదావరి జలాలు



హైదరాబాద్, గద్వాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక వరద నమోదైంది. ఈ సీజన్‌లో అంటే జూన్ 1 నుంచి ఇప్పటిదాకా 2105 టీఎంసీల వరద వచ్చింది. ఇది శ్రీశైలం ప్రాజెక్టు చరిత్రలోనే అత్యధిక వరద. శ్రీశైలం జలాశయానికి 1994-95లో 2039.23 టీఎంసీల వరద రాగా ఆ తర్వాత 2022-23లో 2039.87 టీఎంసీల వరద వచ్చింది. ఈ వాటర్ ఇయర్ (2025 జూన్ 1-2026 మే 31) పూర్తయ్యేనాటికి మరో 100 టీఎంసీల వరద రావొచ్చునని అంచనాలు వేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 1578 టీఎంసీలు, జూరాలకు 1480 టీఎంసీల వరద వచ్చింది. కృష్ణా బేసిన్‌లో ఇప్పటిదాకా 1382 టీఎంసీల జలాలు సముద్రంలో కలిశాయి. ఈ వాటర్ ఇయర్‌లో ఇప్పటిదాకా గోదావరి జలాలు 3,905 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 1246 టీఎంసీల వరద రాగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 822 టీఎంసీల వచ్చింది.

ప్రాజెక్టు రాతి ఫలకాల మధ్య పెలుసులు

శ్రీశైలం జలాశయం కింద భూగర్భంలోని భారీ రాతిఫలకాల మధ్య పెలుసులతో కూడిన బలహీన అతుకులున్నట్టు జియాలజికల్ సర్వే వెల్లడించగా.. డ్యామ్ దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్(భారీ గుంత) 120 మీటర్ల లోతు ఉందని 2018 జూలైలో నిర్వహించిన బాతోమెట్రిక్ సర్వేలోనూ తేలింది. డ్యామ్ పునాదుల లోతుకు గుంత లోతు మించిపోయినట్టు సమాచారం. గుంత.. డ్యామ్ పునాదుల వరకు విస్తరించి రాతిఫలకాల మధ్య పెలుసులతో ఉన్న జాయింట్ల(షీర్ జోన్)ను ప్రభావితం చేసి ఉండవచ్చునని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక తేల్చింది. శ్రీశైలం జలాశయం స్పిల్‌వేను గరిష్ఠంగా 19 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా నిర్మించారు. 2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తింది. 78 గంటల పాటు భీకర వరద కొనసాగడంతో జలాశయానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో జలాశయం కట్ట కుదుపునకు గురైంది. శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అయినప్పటికీ, నిర్వహణను ఏపీ ప్రభుత్వమే చూస్తోంది. తెలంగాణ విజ్ఞప్తితో ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూసీలు ఈ ప్రాజెక్టు రక్షణ చర్యలకు ఉపక్రమించాయి. దాంతో ఏపీ ప్రభుత్వం కూడా వరద తగ్గిన తర్వాత ప్రాజెక్టుకు మరమ్మతులు చేసే అవకాశం ఉంది.

'ఈశాన్య' సీజన్‌లో మిగులు వర్షాలు?

- 112 శాతం వర్షపాతం నమోదయ్యే చాన్స్

విశాఖపట్నం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో ఎక్కువ ప్రాంతాలకు ప్రయోజనం కలిగించే ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సోమవారం ఈ విషయాన్ని వెల్లడించింది. అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ ఈశాన్య రుతుపవనాల కాలంగా పరిగణిస్తారు. తమిళనాడు/పుదుచ్చేరి, రాయలసీమ, కోస్తాంధ్ర, కేరళ, దక్షిణ కర్ణాటక ప్రాంతాలకు ఈ రుతుపవనాలు పరిమితమవుతుంటాయి. ఈ మూడు నెలల కాలంలో దీర్ఘకాల సగటులో 112 శాతం, అదే అక్టోబరు నెలలో అయితే 115 శాతం వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఈ మూడు నెలల్లో దక్షిణాదితోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో మిగులు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దేశం నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమించిన రోజునే ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతంలో ప్రవేశిస్తాయి. ఈ నెల మూడో వారం అంటే 17 నుంచి 21 మధ్యన ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని పలు మోడళ్లు అంచనా వేస్తున్నాయి.



ఈబీ-5 ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ భాగస్వాములు సుబ్బరాజు పేరిచర్ల, సంపన్ మల్హోత్రాలతో.. ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఇల్యా ఫిష్కిన్

అమెరికా గ్రీన్‌కార్డుకు అత్యుత్తమ మార్గం ఈబీ-5

- ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఇల్యా ఫిష్కిన్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అమెరికా గ్రీన్ కార్డు పొందడానికి అత్యుత్తమ మార్గం.. ఈబీ-5 (ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ ఫిఫ్త్ ప్రిఫరెన్స్) వీసాయేనని ఆ దేశానికి చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఇల్యా ఫిష్కిన్ అన్నారు. అమెరికాలో పెట్టుబడులకు సంబంధించిన వీసా ప్రోగ్రామ్ ఈబీ-5 గురించి వివరించేందుకు తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆవరణలో.. న్యూయార్క్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ ఒక సమావేశాన్ని నిర్వహించింది. ఈబీ-5 ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ భాగస్వాములు సుబ్బరాజు పేరిచెర్ల, సంపన్ మల్హోత్రాలతో పాటు ఇల్యా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రంప్ వీసా నిబంధనలను కఠినతరం చేసిన తరువాత చాలామంది భారతీయులు ఈబీ-5 పథకం వైపు చూస్తున్నారని తెలిపారు. శాశ్వతంగా యుఎస్‌ఏలో నివసించాలనుకునే వారికి.. ఈ పథకం తోడ్పడుతుందన్నారు. కాగా.. ఈబీ-5 వీసా కోసం ఫార్మ్ ఐ-526 పూర్తి చేయాల్సి ఉంటుందని, అమెరికాలో టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియాలో కనీసం 8 లక్షల డాలర్లను, ఇతర ప్రాంతాల్లో 10.50 లక్షల డాలర్లను పెట్టుబడిగా పెట్టాలని.. లేదా కనీసం 10 మంది అమెరికన్లకు పూర్తిస్థాయి ఉద్యోగాలను అందించేలా సంస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సుబ్బరాజు, సంపన్ మల్హోత్రా తెలిపారు. అర్హత కలిగిన వారికి తొలుత రెండు సంవత్సరాలకు షరతులతో కూడిన గ్రీన్‌కార్డును అందిస్తారని, ఆ తరువాత ఐ-829ను దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించారు.

వారంలోగా పత్తి కొనుగోళ్లు షురూ!

తెల్ల బంగారం కొనుగోళ్లకు తొలగిన అడ్డంకులు.. జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐతో తుమ్మల చర్చలు సఫలం

- జాబ్‌వర్క్ టెండర్లలో పాల్గొనాలని మిల్లర్ల నిర్ణయం



(ఫైల్)

హైదరాబాద్, వరంగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లకు సంబంధించి అడ్డంకులు తొలగిపోయాయి. జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పిలిచిన జాబ్‌వర్క్ టెండర్లలో పాల్గొనబోమని కొద్దిరోజులుగా మొండికేస్తున్న జిన్నింగ్ మిల్లర్లు... సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన సమావేశంతో దారికొచ్చారు. జాబ్‌వర్క్ టెండర్లలో పాల్గొనాలని అసోసియేషన్ ప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. సీసీఐ విడుదల చేసిన టెండరు నోటిఫికేషన్‌లో లింట్ శాతం ఎల్-1, ఎల్-2 కేటాయింపులు, స్లాట్ బుకింగ్, ఏరియా మ్యాపింగ్ కోసం విధించిన నిబంధనలపై చర్చలు జరిపారు. దేశవ్యాప్తంగా ఒకే విధమైన నిబంధనలు అమలుచేస్తున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లోని జిన్నింగ్ మిల్లర్లు టెండర్లలో పాల్గొంటుండగా అదే పద్ధతిలో మన రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లర్లు కూడా నడుచుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. పత్తి కొనుగోళ్లలో ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో ఏవైనా సమస్యలు ఏర్పడితే, ప్రతివారం సమీక్ష నిర్వహించుకొని జిన్నింగ్ మిల్లర్లు, పత్తి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సీసీఐ అధికారులకు సూచించారు. వారం రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తుమ్మల సూచించగా, జిన్నింగ్ మిల్లర్లు అంగీకరించారు.

రైతులకు అవగాహన కల్పించాలి: తుమ్మల

వారంలోగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే లోపు రైతులకు పత్తి అమ్మకాలపై అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. మొబైల్ యాప్ డౌన్‌లోడ్, స్లాట్ బుకింగ్‌పై ఇప్పటికే రైతు వేదికల్లో వివరిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ అధికారులు సమన్వయం చేసుకొని రైతులను జాగృతం చేయాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబరును కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి, సీసీఐ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్, కేంద్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ పూర్ణేశ్ గురునాని, సీసీఐ బ్రాంచి మేనేజర్లు, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, జిన్నింగ్ మిల్లుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కపాస్'పై అవగాహన ఉందా?

కపాస్ కిసాన్ యాప్! పత్తి కొనుగోళ్లలో అక్రమాలను నివారించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఈ మొబైల్ యాప్‌పై రైతులకు ఎంత మేర అవగాహన ఉంది? ఈ యాప్‌తో కొనుగోళ్లు సాఫీగా జరగడం మాట దేవుడెరుగు.. రైతులకు కొత్త ఇబ్బందులు తలెత్తవు కదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పంటను విక్రయించుకోవాలనుకునే పత్తి రైతులు, తమ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని.. ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నంబరుతో పేరు, ఊరు, భూమి సర్వే నంబరు, సాగు విస్తీర్ణం తదితర వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. అనంతరం పత్తి విక్రయం కోసం స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత.. ఏ రోజు, ఏ సమయానికి, ఏ కేంద్రానికి పత్తిని తీసుకురావాలనేది ఆ యాప్ ద్వారానే రైతులకు సందేశం వస్తుంది. స్లాట్‌లో సూచించిన రోజు రైతు వెళితేనే సరుకు కొనుగోలు చేస్తారు. అయితే.. రైతుల్లో నిరక్షరాస్యులూ ఉంటారని.. వారికి ఈ ప్రక్రియపై అవగాహన ఉంటుందా? కేంద్రం ప్రవేశపెట్టిన ఈ యాప్ విధానం ఏ మేరకు సక్సెస్ అవుతుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పైగా చాలామంది రైతుల దగ్గర స్మార్ట్ ఫోన్లు ఉండవని.. ఈ కారణంగా రైతులు ఇతరులపై ఆధారపడాల్సి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తాగుబోతుల తెలంగాణగా మార్చింది కాంగ్రెస్సే

- అలయ్, బలయ్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు



వట్‌పల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిని పక్కనబెట్టి తాగుబోతుల రాష్ట్రంగా తెలంగాణను మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ హామీలను విస్మరించిందని హరీశ్‌రావు ఆరోపించారు. కనీసం రైతులకు యూరియా బస్తాలు కూడా అందించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర అభివృద్ధిని పాతాళానికి తోసి తాగుబోతుల తెలంగాణను చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. నిధులే లేవంటూ చెబుతున్న రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ, రూ.లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. అందోల్ నియోజకవర్గంలోని 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న సంకల్పంతో బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు నిర్మాణం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టిందని, ఆ పనులు మళ్లీ చేపట్టేందుకు త్వరలో పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయభేరి మోగించి సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

హైదరాబాద్ యువకుడి మృతి



షెరాజ్ మెహతాబ్

చాదర్‌ఘాట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన షెరాజ్ మోహతాబ్ మహ్మద్ (25) ప్రాణాలు కోల్పోయాడు. ఉన్నత ఉద్యోగావకాశాల కోసం ఇటీవలే అమెరికాకు వెళ్లిన షెరాజ్ మోహతాబ్ అకాలంగా మృతిచెందడం అందరినీ కలచివేసింది. షెరాజ్ తండ్రి అల్తాఫ్ మహ్మద్‌ఖాన్ (అల్తాఫ్ గోల్డీ) హైదరాబాద్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. కాగా కొన్నేళ్లుగా అమెరికాలో స్థిరపడ్డారు. షెరాజ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. షెరాజ్ మరణ వార్తతో స్వస్థలం చంచల్‌గూడలో విషాదఛాయలు అలముకున్నాయి. బంధువులు, స్నేహితులు అతడి నివాసానికి చేరుకుని షెరాజ్‌తో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కంటతడిపెట్టారు. మసీదులో నమాజ్ అనంతరం అతడి పేరుపై ముస్లిం షెరియా ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా గడిచిన 48 గంటల్లో అమెరికాలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పనిచేస్తున్న హైదరాబాద్ బీఎన్ రెడ్డినగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ దుండగుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

పెద్దల ప్రాణం తీసిన పిల్లల గొడవ

- ఇద్దరు తండ్రుల ఘర్షణ.. ఒకరి మృతి
- మేడ్చల్ జిల్లా అవుశాపూర్‌లో ఘటన




సయ్యద్ అమీర్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల గొడవ కాస్తా పెద్దల ఘర్షణకు దారి తీసి ఓ తండ్రి ప్రాణాన్ని బలి తీసుకున్న ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధిలోని అవుశాపూర్ గ్రామంలో జరిగింది. పక్కపక్కనే నివాసం ఉంటున్న సయ్యద్ అమీర్ (34), సయ్యద్ అలీల పిల్లలు ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటూ గొడవపడ్డారు. గమనించిన అమీర్ తన పిల్లలకు గొడవలు చేయొద్దని, స్నేహపూర్వకంగా ఉండాలని చెప్పి వారిని ఇంట్లోకి పంపించాడు. సయ్యద్ అలీకి అతడి కుమారుడు గొడవ గురించి చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన అలీ.. అమీర్‌తో గొడవకు దిగాడు. గొడవ పెద్దది కావడంతో ఒకరికొకరు దాడిచేసుకోగా అమీర్ చాతీలో అలీ పిడిగుద్దులు కురిపించాడు. గమనించిన స్థానికులు ఇద్దరిని శాంతింపచేసి ఇళ్లకు పంపించారు. అరగంట తర్వాత అమీర్‌కు చాతీలో నొప్పి వస్తుందని, చెమటలు పడుతున్నాయని చెప్పడంతో అతని కుటుంబసభ్యులు వెంటనే ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అమీర్ అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. అలీ దాడి చేయడం వల్లే తన భర్త చనిపోయాడని అమీర్ భార్య సోనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సోమవారం సాయంత్రం మృతదేహం ఇంటికి చేరుకోగానే స్థానికులతో కలిసి అతని కుటుంబసభ్యులు, బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జాతీయ రహదారి, సర్వీస్ రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. నష్టపరిహారం కింద రూ.20 లక్షలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించివేశారు. అనంతరం అమీర్ మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి.

ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలుడి మృతి

- మృతదేహంతో క్లినిక్ ఎదుట కుటుంబీకుల ధర్నా
- మహబూబ్‌నగర్ జిల్లా లింగంపేటలో విషాదం



వరుణ్‌తేజ్ (ఫైల్)

జడ్చర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతున్న బాలుడిని చికిత్స కోసం ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్తే, వైద్యం వికటించి ఆ బాలుడు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో చోటు చేసుకుంది. కుర్వపల్లి గ్రామానికి చెందిన కురుమయ్య, మాధవి దంపతుల కుమారుడు వరుణ్‌తేజ్ (11) జ్వరంతో బాధపడుతుండగా, తల్లిదండ్రులు ఆదివారం సాయంత్రం లింగంపేట గ్రామంలోని ఆర్ఎంపీ శ్రీశైలం వద్దకు తీసుకెళ్లారు. శ్రీశైలం బాలుడికి ఫ్లూయిడ్స్‌తో పాటు జ్వరం తగ్గడానికి ఇంజక్షన్ ఇచ్చాడు. చికిత్స తర్వాత ఇంటికి వెళ్లిన వరుణ్‌కు విపరీతమైన చలితో వణుకు మొదలైంది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు తిరిగి ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా, చలి తగ్గడానికి మరో ఇంజక్షన్ ఇచ్చాడు. అయినా బాలుడి పరిస్థితి మెరుగుపడకపోవడంతో జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలుడిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉన్నదని, వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా ఆదివారం అర్ధరాత్రి మార్గంమధ్యలోనే బాలుడు మృతిచెందాడు. ఆర్ఎంపీ అందించిన చికిత్స కారణంగానే తమ కుమారుడు మృతిచెందాడని ఆరోపిస్తూ, వరుణ్‌తేజ్ మృతదేహంతో తల్లిదండ్రులు ఆర్ఎంపీ క్లినిక్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తండ్రి కురుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు.

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో కీలక అడుగు!

- డీపీఆర్‌ను పీపీపీ అప్రైజల్ కమిటీకి సిఫారసు చేసిన సాంకేతిక పరిశీలన కమిటీ
- నెలాఖరుకల్లా ఆమోదించే అవకాశం!
- అనంతరం కేంద్ర మంత్రివర్గం ముందుకు



హైదరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం డీపీఆర్ విషయంలో వడివడిగా అడుగులు పడుతున్నాయి. డీపీఆర్ జూన్‌లో కేంద్రానికి చేరిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టు అప్రైజల్ సాంకేతిక పరిశీలన కమిటీ(పీఏటీఎస్సీ) తాజాగా ఈ డీపీఆర్‌ను పబ్లిక్- ప్రైవేటు- పార్టనర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ)కి సిఫారసు చేసింది. ఈ కమిటీలో కూడా ఈ నెలాఖరుకల్లా ప్రాజెక్టు ఆమోదం పొందనుందని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. రెండు కమిటీల్లో ప్రక్రియ పూర్తవగానే ఉత్తరభాగం డీపీఆర్ కేంద్ర మంత్రి వర్గానికి చేరనుంది. పీఏటీఎస్సీ భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) కేంద్ర కార్యాలయం పరిధిలో ఉంటుంది. ఇందులో ప్రాజెక్టు నిర్మాణం, వ్యయం, అవసరమైన సౌకర్యాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు? టోల్‌ప్లాజాలు, రెస్ట్‌ఏరియాలు తదితర అంశాలన్నింటినీ పరిశీలిస్తారు. ఆ డీపీఆర్‌పై సంతృప్తి చెందడంతో తాజాగా పీపీపీఏసీకి సిఫారసు చేశారు. ఈ కమిటీ కేంద్ర రవాణా శాఖ పరిధిలో ఉంటుంది. ఇందులో కేంద్ర రవాణా, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులు సహా మరో ముగ్గురు కీలక శాఖల ముఖ్య కార్యదర్శులు ఉంటారు. వీరంతా ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన కీలక అంశాలపై సమీక్షిస్తారు. అన్నీ అనుకూలంగా ఉన్నాయని భావిస్తే వెంటనే ప్రాజెక్టు ఆమోదయోగ్యమేనంటూ కేంద్ర మంత్రివర్గానికి సిఫారసు చేస్తారు. ఇదే చివరి దశ. అయితే, అన్ని అంశాలనూ పరిశీలించాకే ఈ రోడ్డును మంజూరు చేసిన నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్‌లోనూ త్వరగానే ఆమోదముద్ర పడుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

నిర్మాణ వ్యయం రూ.8వేల కోట్లు..

ఉత్తరభాగం సమగ్ర నివేదికలో ప్రాజెక్టు వ్యయం, భూ సేకరణ పరిహారం చెల్లింపులు, ఇతరత్రా అంశాలకు సంబంధించిన అన్ని వివరాలను పొందుపర్చారు. ఈ క్రమంలో రహదారి నిర్మాణానికి దాదాపు రూ.8 వేల కోట్లకు పైగా నిధులు అవసరమని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం కోసం సేకరించిన భూములకు చెల్లించాల్సిన పరిహారం దీనికి అదనంగా ఉంటుందని వివరించారు. భూ సేకరణ పరిహారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చెల్లించనున్నాయి. పరిహారం చెల్లింపునకు రూ.5,200 కోట్లు అవసరమని అంచనా. ఇక ఉత్తరభాగం మార్గాన్ని 6 వరసలతో నిర్మించనున్నారు. కేంద్ర క్యాబినెట్‌లో ప్రాజెక్టు ఆమోదం పొందగానే రహదారి నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించనున్నారు.

అడుగుకో వాహనం.. ఆగమాగం!

- చౌటుప్పల్ వద్ద ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ జామ్
- హైదరాబాద్‌లో కిటకిటలాడిన బస్సులు, మెట్రో రైళ్లు



భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్/కేతేపల్లి/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు ఊళ్లకు వెళ్లిన వారందరూ తిరిగి హైదరాబాద్‌కు పయనం కావడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65) కిక్కిరిసిపోయింది. చౌటుప్పల్ మండల పరిధిలోని రెడ్డిబావి నుంచి తూప్రాన్‌పేట వరకు వేలాది వాహనాలు హైవేపై బారులుతీరాయి. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ నెలకొనడంతో చౌటుప్పల్ పట్టణమంతా వాహనాలతో నిండిపోయింది. పట్టణంలో నాలుగు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారితోపాటు సర్వీసు రోడ్డుపైనా ట్రాఫిక్ స్తంభించింది. పంతంగి టోల్ ప్లాజాను దాటడానికి వాహనదారులకు అరగంటపైగా సమయం పట్టింది. సాధారణ రోజుల్లో ఇక్కడి నుంచి 35వేల వాహనాల రాకపోకలు సాగిస్తుండగా.. సోమవారం అదనంగా మరో 25వేల వాహనాలు ప్రయాణించాయి. పండుగ సెలవులకు వెళ్లి తిరిగి వచ్చిన ప్రయాణికులతో హైదరాబాద్‌లో బస్సులు, మెట్రో రైళ్లు కిటకిటలాడాయి. విజయవాడ వైపు నుంచి వచ్చిన వందలాది మంది ప్రయాణికులు ఒకేసారి ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌కు రావడంతో ఊపిరాడని పరిస్థితి నెలకొంది. హన్మకొండ నుంచి వచ్చిన వారు ఉప్పల్ మెట్రోస్టేషన్, నిజామాబాద్ నుంచి వచ్చిన వారు మియాపూర్ స్టేషన్, కరీంనగర్ నుంచి వచ్చిన వారు జేబీఎస్ స్టేషన్‌లో బారులుదీరడంతో మధ్యాహ్నం వరకు మెట్రో రైళ్లలో కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. సోమవారం 5 లక్షల మార్కును దాటినట్లు మెట్రోవర్గాలు చెబుతున్నాయి. సికింద్రాబాద్, కాచిగూడ, బేగంపేట, చర్లపల్లి, లింగంపల్లి రైల్వే స్టేషన్లలోనూ ప్రయాణికులతో తీవ్ర రద్దీ నెలకొంది. కాగా, చౌటుప్పల్ నుంచి హయత్‌నగర్, ఎల్బీనగర్ చేరుకోవడానికి సాధారణ రోజుల్లో 40 నిమిషాల సమయం పడితే, సోమవారం ఏకంగా 2.30 గంటలపైగా పట్టింది. నలువైపుల నుంచి వేలాది కార్లు ఒకేసారి హైదరాబాద్ చేరుకోవడంతో.. ప్రధాన రోడ్లపై రద్దీ నెలకొంది. ఈ వారంలో మొదటి వర్కింగ్ డే కావడంతో ఐటీ కారిడార్‌లోని కొండాపూర్ శరత్ సిటీ మాల్ నుంచి హైటెక్స్ మీదుగా మాదాపూర్ సైబర్ టవర్స్ దుర్గం చెరువు వరకు వాహనాలు నిలిచిపోయాయి.

ఐదేళ్ల గిరిజన బాలుడికి అరుదైన వ్యాధి

- లక్షమందిలో ఒకరికి వచ్చే 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ'
- చికిత్సకు రూ.కోట్లలో ఖర్చు.. మందులూ ఖరీదే
- ఆందోళనలో తల్లిదండ్రులు.. సర్కార్ ఆదుకోవాలని విజ్ఞప్తి



చిన్నారి జగన్

బొంరాస్‌పేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల బాలుడు.. ఆడిపాడే వయసులో లక్షమందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్సకు కోట్లలో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో రెక్కాడితే గానీ డొక్కాడని ఆ నిరుపేద గిరిజన తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. బాధిత బాలుడు వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలం వడిచర్ల గ్రామ పరిధిలోని ఉరెన్కితండాకు చెందిన జగన్ (5). కొన్నాళ్లుగా బాలుడు సరిగా నడవలేకపోతుండటం, కూర్చోవడం, నిల్చోవడంలో ఇబ్బందులు పడుతుండటంతో తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి జగన్ స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ యాదవ్, బొంరాస్‌పేట్ మండల వైద్యాధికారి హేమంత్ సోమవారం బాధిత కుటుంబాన్ని బొంరాస్‌పేట్ ప్రభుత్వాస్పత్రికి పిలిపించారు. బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యాధి నివారణకు ఆరోగ్యశాఖ వద్ద ఎటువంటి మందులు అందుబాటులో లేవని, ఈ వ్యాధికి మందులు ఖరీదైనవి అని.. ప్రైవేట్‌లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. బాధిత కుటుంబం పరిస్థితిని కలెక్టర్ ద్వారా ఉన్నతస్థాయి అధికారులకు చేరవేస్తామని చెప్పారు. ప్రభుత్వపరంగా నిమ్స్, నిలోఫర్ ఆస్పత్రుల్లో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే వైద్యం ప్రారంభిస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, వైద్యశాఖ పరంగా అండగా ఉంటామన్నారు. కాగా తమ చిన్నారికి వ్యాధి నయం అయ్యే విధంగా ప్రభుత్వం ఆదుకొని చికిత్స చేయించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

రోగనిరోధక వ్యవస్థపై పరిశోధనలు చేసిన
ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్

» అమెరికాకు చెందిన మేరీ బ్రన్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, జపాన్‌కు చెందిన సకగూచీకి సంయుక్తంగా ప్రకటన



ఫ్రెడ్ రామ్స్‌డెల్ సకగూచీ మేరీ బ్రన్‌కో

స్టాక్‌హోం, అక్టోబరు 6: మన శరీరంలోకి చొరబడే హానికారక సూక్ష్మజీవులపై యుద్ధం ప్రకటించి, కాపుగాయాల్సిన రోగనిరోధక వ్యవస్థ.. మన అవయవాలపైనే దాడి చేయకుండా చేసే 'పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్'పై కీలక పరిశోధనలు చేసిన మేరీ ఈ బ్రన్‌కో (64), ఫ్రెడ్ రామ్స్‌డెల్ (64), సకగూచి(74)లను ఈ ఏటి వైద్య నోబెల్ వరించింది. వీరిలో బ్రన్‌కో, రామ్స్‌డెల్ అమెరికన్లు కాగా.. సకగూచి జపనీయుడు. బ్రన్‌కో.. సియాటెల్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయాలజీ'లో సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. రామ్స్‌డెల్.. శాన్‌ఫ్రాన్సిస్కోలోని సోనోమా బయోథెరప్యూటిక్స్‌లో శాస్త్రీయ సలహాదారుగా పనిచేస్తున్నారు. ఇక.. సకగూచీ 'ఒసాకా యూనివర్సిటీ (జపాన్)'లోని ఇమ్యూనాలజీ ఫ్రాంటియర్ రిసెర్చ్ సెంటర్ గౌరవ ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రైజ్‌మనీ కింద ఇచ్చే 10.64 కోట్లను వీరు ముగ్గురూ సమానంగా పంచుకోనున్నారు. మన శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ పని తీరును తెలుసుకోవడానికి వారు చేసిన పరిశోధనలే కీలకమని నోబెల్ కమిటీ చైర్ ఒల్లె కాంపె కొనియాడారు.

ఏమిటీ పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్?

శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ వద్ద ఉన్న యోధులు.. టీ సెల్స్. అయితే, అవి కట్టు తప్పి మన శరీర అవయవాల మీదే దాడి చేయకుండా ఉండేందుకు ప్రాథమికంగా వాటికి మన ఛాతీపైభాగంలో బ్రెస్ట్ బోన్ (పక్కటెముకలను కలిపే మధ్య భాగం-స్టెమ్) కింద ఉండే థైమస్ గ్లాండ్ (శైశవ గ్రంథి)లో ప్రాథమిక శిక్షణ లభిస్తుంది. అయితే, కొన్ని టీ-సెల్స్ అక్కడ విపరీతంగా ప్రవర్తించడం ప్రారంభిస్తాయి. అవి బయటకు వస్తే.. మన అవయవాల మీదే దాడి చేసి రుమటాయిడ్ ఆర్థరైటిస్, సోరియాసిస్, లూపస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులు రావడానికి కారణమవుతాయి. అందుకే థైమస్‌లో 'సెంట్రల్ టోలరెన్స్' అనే వ్యవస్థ వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగించివేస్తుంది. కానీ, దాన్నీ తప్పించుకుని వచ్చిన టి-సెల్స్‌ను అదుపులో పెట్టేందుకు రోగనిరోధక వ్యవస్థలో ఇంకో ఏర్పాటు ఉంటుంది. అదే 'పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్'. ఈ వ్యవస్థ సీడీ4, సీడీ25, ఫాక్స్‌పీ3 వంటి ప్రత్యేక టి-సెల్స్ సాయంతో.. సదరు రోగ్ టి-సెల్స్‌ను అణచివేస్తాయి. అసలు ఇలాంటి వ్యవస్థ ఒకటి ఉందని కనుగొనడానికి ఆధారం ఈ ముగ్గురి పరిశోధనలే. సకగూచి 1995లో ఒక కొత్త టి-సెల్ ఉపవర్గాన్ని గుర్తించడంతో ఈ 'పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్' గురించి ప్రపంచానికి తెలియడం మొదలైంది. అప్పట్లో ఆయన గుర్తించిన టి-సెల్స్ ఉపవర్గాన్ని ఇప్పుడు రెగ్యులేటరీ టి-సెల్స్ లేదా టి-రెగ్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. వీటిని శాంతిదూతలు అనొచ్చు. అవసరానికి మించి పనిచేసే ఇమ్యూన్‌రెస్పాన్స్‌ను ఇవి అదుపులో పెడతాయి. సకగూచి వీటిని గుర్తించిన ఆరేళ్ల తర్వాత.. 2001లో బ్రన్‌కో, రామ్స్‌డెల్ ఫాక్స్‌పి3 జన్యువులో కలిగే ఉత్పరివర్తనాలే మానవుల్లో ఆటో ఇమ్యూన్ వ్యాధులకు కారణమని గుర్తించారు. ఆ తర్వాత రెండేళ్లకు.. 2003లో సకగూచి తన ఆవిష్కరణను, బ్రన్‌కో, రామ్స్‌డెల్ ఆవిష్కరణతో అనుసంధానం చేసి.. తాను గుర్తించిన టి-రెగ్స్ అభివృద్ధిని నియంత్రించే మాస్టర్ స్విచ్ 'ఫాక్స్‌పి3' జన్యువే అని నిరూపించారు. ఇది.. ఇమ్యూనాలజీ అనే కొత్త విధానానికి దారులు తెరిచింది. ఈ వివరాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులందరూ.. ఆటో ఇమ్యూన్ వ్యాధులను, క్యాన్సర్ వంటివాటిపై పోరాటానికి టి-రెగ్స్‌ను ఉపయోగించుకునే దిశగా పరిశోధనలు చేస్తున్నారు. కాగా.. 2025 సంవత్సరానికి గాను నోబెల్ పురస్కారాల ప్రకటన షురూ అయింది. మంగళవారం భౌతిక శాస్త్ర నోబెల్, బుధవారం రసాయన శాస్త్ర నోబెల్, గురువారం సాహిత్య నోబెల్ విజేతలను ప్రకటించనున్నారు. నోబెల్ శాంతి బహుమతి ఎవరికిచ్చేదీ శుక్రవారం, ఆర్థిక నోబెల్ విజేతను అక్టోబరు 13న (వచ్చే సోమవారం) ప్రకటించనున్నారు.

లోకం తీరు



బెంగాల్ బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలపై దాడి

» మాల్దా ఎంపీ ఖగెన్ ముర్ము తలకు గాయం

» ఇది తృణమూల్ పనే.. బెంగాల్‌లో అటవిక రాజ్యం: బీజేపీ

నగ్రకట, అక్టోబరు 6: వరదలతోపాటు కొండ చరియలు విరిగి పడటంతో అతలాకుతలమైన ప్రాంతాన్ని సందర్శించి బాధితులకు సాయం చేయడానికెళ్లిన బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము (మాల్దా), ఎమ్మెల్యే శంకర్ ఘోష్ (సిలిగురి)లపై సోమవారం దాడి జరిగింది. ఈ ఘటనతో అధికార తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ మధ్య ఆరోపణలూ ప్రత్యారోపణలు సాగాయి. ఇది అధికార తృణమూల్ కాంగ్రెస్ పనేనని, పశ్చిమ బెంగాల్‌లో అటవిక రాజ్యం నడుస్తోందనడానికి ఈ ఘటన నిదర్శనమని బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు. తమను 500 మంది వ్యక్తుల బృందం అడ్డుకున్నదని.. 'దీదీ దీదీ' అని నినదిస్తూ రాళ్లు విసిరారని, కర్రలతో దాడి చేశారని బీజేపీ నేతలు విమర్శించారు. ఈ దాడిలో ఎంపీ ఖగెన్ ముర్ము తలకు తీవ్ర గాయం, ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌కు స్వల్ప గాయం కావడంతో తొలుత స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేసి.. సిలిగురికి తరలించారు. ఈ దాడిలో ఎంపీ ఖగెన్ ముర్ము ప్రయాణిస్తున్న కారు ధ్వంసమైంది. మానవీయ సంక్షోభం నెలకొన్న వేళ విపక్షంపై అధికార తృణమూల్ గూండాలు దాడి చేశారని బీజేపీ ఆరోపించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. బాధల్లో ఉన్న ప్రజల వద్ద కేవలం ఫొటోలకు ఫోజులివ్వడానికి వెళ్లిన బీజేపీ నేతలు స్థానికులను రెచ్చగొట్టారని, ఇది వారి స్వయంకృతమని ఉత్తర బెంగాల్ మంత్రి ఉదయన్ గుహ ఆరోపించారు. ఈ దాడిని ఖండించిన ప్రధాని మోదీ.. బెంగాల్‌లో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు.

శత్రు సబ్‌మెరైన్లను పసిగట్టే ఆండ్రోత్

» విశాఖ తీరంలో జలప్రవేశం



విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళంలో మరో అత్యాధునిక యుద్ధ నౌక చేరింది. తీర ప్రాంతానికి సమీపంలోని సముద్ర జలాల్లో మాటువేసిన శత్రుదేశాల జలాంతర్గాముల (సబ్‌మెరైన్)ను పసిగట్టే సామర్థ్యం కలిగిన ఐఎన్ఎస్ ఆండ్రోత్ విశాఖ తీరంలో జలప్రవేశం చేసింది. విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో తూర్పు నౌకాదళం వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ఈ నౌకను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఆండ్రోత్' చేరికతో భారత నౌకాదళం శక్తి, సామర్థ్యాలు మరింత పెరుగుతాయన్నారు. ఈ నౌక తయారీకి కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్ అండ్ ఇంజనీర్స్(జీఆర్ఎస్ఈ)కు చెందిన ఇంజనీర్లు, డిజైనర్స్ శక్తివంచన లేకుండా కృషి చేశారని ప్రశంసించారు. భారత నేవీలో చేరిన రెండో యాంటీ సబ్ మెరైన్ వాటర్‌ఫేర్‌షాలో వాటర్‌క్రాఫ్ట్‌గా ఆండ్రోత్ నిలిచిందన్నారు.

నౌకా నిర్మాణంలో టాప్-5కి భారత్

» కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడి

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నౌకా నిర్మాణ రంగంలో భారత్‌ను టాప్-5 దేశాల్లో ఒకటిగా నిలబెట్టాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని కేంద్ర పోర్టులు, నౌకాయాన, జల రవాణాశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ).. కొరియా నుంచి కొనుగోలు చేసిన మొట్టమొదటి వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్ (వీఎల్‌జీసీ) నౌక శివాలిక్.. అబుదాబీ నుంచి లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)ను విశాఖపట్నం పోర్టుకు తీసుకువచ్చింది. సోమవారం ఇక్కడకి చేరిన ఆ నౌకకు సోనోవాల్ జెండా ఊపి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నౌకపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సమక్షంలో 112 ఆయిల్, గ్యాస్ క్యారియర్ నౌకల నిర్మాణానికి హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ కంపెనీలతో షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అవగాహన ఒప్పందం చేసుకుందని, మరో 15 రోజుల్లో వాటికి టెండర్లు పిలవనుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నౌకా నిర్మాణంలో 2030 నాటికి టాప్-10లోకి, 2047 నాటికి టాప్-5లోకి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

వారు గుహలో జీవిస్తుంటే నువ్వెక్కడున్నావ్?

» రష్యా మహిళ కేసులో 'తండ్రి'పై సుప్రీం కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబరు 6: కర్ణాటకలో తల్లీ, ఇద్దరు పిల్లలు ఓ గుహలో జీవించిన వ్యవహారంలో ఆ పిల్లల తండ్రిగా చెప్పుకొంటున్న వ్యక్తిపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వారు గుహలో జీవిస్తుంటే నువ్వెక్కడ ఉన్నావు అంటూ ప్రశ్నించింది. వారిపై నీకున్న హక్కేమిటి? అసలు నువ్వెవరు? అంటూ గట్టిగా నిలదీసింది. రష్యాకు చెందిన నైనా కుటీనా అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో కలసి కర్ణాటకలోని గోకర్ణ వద్ద ఓ గుహలో నివసిస్తుండగా ఈ ఏడాది జూలై 11న గుర్తించిన విషయం తెలిసిందే. ఏ విధమైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఆమె ఇక్కడ జీవిస్తున్నట్లు అధికారులు గుర్తించి రష్యాకు తిరిగి పంపించే ప్రయత్నం చేశారు. అయితే ఆ పిల్లలకు తండ్రిని అంటూ ఇజ్రాయెల్‌కు చెందిన డ్రార్ ష్లోమో గోల్డ్‌స్టీన్ ప్రత్యక్షమయ్యాడు. ఆ పిల్లలను రష్యాకు పంపకుండా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలంటూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా... గోల్డ్‌స్టీన్ సుప్రీంకోర్టులో సవాల్ చేశాడు. ఆ పిటిషన్‌ను సోమవారం విచారించిన ధర్మాసనం.. ఇదొక పబ్లిసిటీ వ్యాజ్యం అంటూ మండిపడింది.

బ్రాహ్మణుల వల్ల సమాజానికి జ్ఞానజ్యోతులు

» వారి సంక్షేమానికి కృషిచేయాలి: ఢిల్లీ సీఎం రేఖాగుప్తా

న్యూఢిల్లీ, అక్టోబరు 6: బ్రాహ్మణులు సమాజంలో జ్ఞానజ్యోతులను వెలిగిస్తారని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని పార్టీలు, అలాగే ప్రతి ప్రభుత్వం కూడా బ్రాహ్మణుల సంక్షేమం కోసం పని చేయాలని పేర్కొన్నారు. ఢిల్లీలో శ్రీ బ్రాహ్మణ సభ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'అఖిల భారత బ్రాహ్మణ సమ్మేళనం'లో ఆమె ప్రసంగించారు. "సమాజంలో ఎవరైనా జ్ఞాన దీపాలను వెలిగిస్తున్నారంటే అది మన బ్రాహ్మణ సమాజమే. బ్రాహ్మణులు శాస్త్రాలనే కాదు.. శస్త్రాలనూ పూజిస్తారు. శాస్త్రాలు, శస్త్రాల ఆధారంగానే సమాజాన్ని, దేశాన్ని రక్షించుకోగలం"అని వ్యాఖ్యానించారు. ధర్మ ప్రచారం ద్వారా సమాజ ప్రయోజనాల కోసం బ్రాహ్మణులు కృషిచేస్తున్నారని కొనియాడారు. రేఖాగుప్తా వ్యాఖ్యలు అభ్యంతరకరమని ఆమ్ ఆద్మీ విమర్శించింది.

కూటములు, కులాల కుంపట్లో..
అన్ని పక్షాలకూ అగ్ని పరీక్షే!

ప్రతిష్ఠాత్మకంగా మారిన బిహార్ ఎన్నికలు... మసకబారిన నితీశ్ ప్రతిష్ఠ.. మోదీపైనే ఎన్డీయే ఆశలు

» రాహుల్, తేజస్వి ఆధ్వర్యంలో మహా 'గట్టి' బంధన్ ప్రయత్నాలు

» ప్రశాంత్ కిషోర్ ప్రభావమెంత?





న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆటవిక పాలనతో 'జంగిల్ రాజ్'గా పేరు పొందిన బిహార్‌లో దంగల్ మొదలైంది. కూటములు, కులాల కుంపట్లతో సతమవుతున్న ఆ రాష్ట్రంలో ఎన్నికల యుద్ధానికి తెరలేచింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో రాజకీయం వేడెక్కింది. బిహార్‌కు వరాల జల్లు కురిపించడంతో పాటు ఆ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తున్న ప్రధాని మోదీకి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కూడా జాతీయ స్థాయిలో ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. స్థానికంగా జేడీయూ నేత, సీఎం నితీశ్‌కుమార్, ఆర్జేడీ నేత, లాలూ కుమారుడు తేజస్వియాదవ్‌తోపాటు కొత్తగా రంగంలోకి దిగిన జనసురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌ల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

ముక్కోణపు పోటీ.. మధ్యలో ఆప్!

ప్రస్తుతం బిహార్‌లో బీజేపీ, జేడీయూ, ఎల్‌జేపీ, పలు చిన్న పార్టీలతో కూడిన ఎన్డీయే కూటమి ఓ వైపు.. కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాల కూటమి మరో వైపు తలపడుతున్నాయి. కొత్తగా జనసురాజ్ పార్టీతో తెరపైకి వచ్చిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూటమి రాజకీయాలకు తానే ప్రత్యామ్నాయం అంటూ జనంలోకి వెళుతున్నారు. దీనికితోడు కొత్తగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా బిహార్‌లో అడుగుపెట్టింది. అన్ని స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పడమే కాదు.. 11 చోట్ల అభ్యర్థులను కూడా ప్రకటించింది. తాము పోటీ చేస్తామని బీఎస్పీ అధినేత్రి మాయావతి సోమవారం ప్రకటించారు.

ఎన్డీయే సత్తా చాటేనా..

ఒకప్పుడు జంగిల్ రాజ్‌గా పేరుపొందిన బిహార్.. నితీశ్ పాలనలో అభివృద్ధి వైపు మళ్లిందన్న అభిప్రాయం ఉంది. రెండు దశాబ్దాలుగా ఆయనకు 'సుశాసన్‌బాబు (మంచి పరిపాలకుడు)'గా పేరుంది. బిహార్‌లో వెనుకబడిన కులాల్లో ఒకటైన కుర్మి వర్గం జనాభా గణనీయంగా ఉంటుంది. అదే వర్గానికి చెందిన నితీశ్ కుమార్‌కు వారంతా మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు. అయితే ఈ విజయపరంపరను నితీశ్ కొనసాగించగలరా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. 2020లో బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నితీశ్.. మధ్యలో ఆ కూటమిని వదిలి, ఆర్జేడీ-కాంగ్రెస్‌తో చేరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, 2024లో మళ్లీ రాజీనామా చేసి ఎన్డీయే కూటమిలో చేరడంపై విమర్శలు వచ్చాయి. దానికితోడు ఇటీవల నితీశ్ ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం, పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మారవచ్చనే అభిప్రాయాలూ ఉన్నాయి. ఒకవేళ ఎన్డీయే గెలిచినా నితీశ్ సీఎం కాకపోవచ్చని, ఆయన శకం ముగిసినట్లేననే వాదనలూ ఉన్నాయి. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే ప్రధాని మోదీ కరిష్మాపైనే ఆశలు పెట్టుకుంది. దీనికి తగ్గట్టుగానే బిహార్‌లో వరుస పర్యటనలు చేస్తున్న ప్రధాని మోదీ.. పెద్ద సంఖ్యలో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్నారు.

రాహుల్ మహా 'గట్టి' బంధన్ ప్రయత్నాలు..

ఎన్డీయేకు దీటుగా నిలిచేందుకు ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమి గట్టి ప్రయత్నాలే చేస్తోంది. కూటమి తమ తరఫున తేజస్వి యాదవ్ సీఎం అభ్యర్థిగా ముందుపెట్టి ప్రచారం చేస్తోంది. బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ కలకలం రేపిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ఇటీవలే బిహార్‌లో రెండు వారాలపాటు 'ఓటర్ అధికార యాత్ర' నిర్వహించారు. ప్రచారంలోనూ ఆయన దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉంది. అయితే బిహార్‌లో కాంగ్రెస్‌కు పెద్దగా పట్టులేదు. ఆర్జేడీ వెనకే నడుస్తోంది. రాహుల్ పర్యటనలతో బిహార్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నా.. కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు దక్కుతాయి, అందులో ఎన్ని గెలుస్తుందన్నది తేలాల్సి ఉంది.

తేలనున్న తేజస్వి యాదవ్ భవిష్యత్తు

కొన్నేళ్లుగా బిహార్ రాజకీయాల్లో బాగా ఫోకస్ ఉన్న నాయకుడు 35 ఏళ్ల తేజస్వి యాదవ్. మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ కుమారుడిగా తెరపైకి వచ్చిన ఆయన... తమ పార్టీ ఆర్జేడీపై పూర్తి పట్టు సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో గణనీయమైన ప్రభావం చూపారు. మహాఘట్‌బంధన్ కూటమి అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఆయనకే ఎక్కువ. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన భవితవ్యం ఏమిటన్నది తేలిపోనుంది. బిహార్‌లో గట్టి పట్టున్న యాదవులు ఆర్జేడీ వెంట ఉండటంతో ఆ పార్టీ పట్టునిలుపుకొంటూ వస్తోంది. ఇటీవలి రాహుల్ ఓటర్ అధికార యాత్ర, తాను చేసిన బిహార్ అధికార యాత్రల జనంలో మంచి స్పందన రావడంతో తమ కూటమి గెలుపుపై తేజస్వి ఆశలు పెట్టుకున్నారు. ఎప్పటి మాదిరిగా ముస్లింలు, యాదవులు ఆర్జేడీ వైపు నిలుస్తారని భావిస్తున్నారు.

ప్రశాంత్ కిషోర్ ప్రభావం ఉంటుందా?

జన సురాజ్ పార్టీతో రంగంలోకి దిగిన ప్రశాంత్ కిషోర్ బిహార్‌లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కుల, మత, రాజకీయ కొలమానాలకు అతీతంగా ప్రజలను తమ పార్టీని ఆదరించాలని కోరుతున్నారు. సోషల్ మీడియాలో, యువతలో ఆయన వైపు సానుకూల స్పందన కనిపిస్తోంది. కానీ ఎన్నికల్లో ఎంత వరకు ప్రభావం చూపగలరన్నది తేలాల్సి ఉంది.



షెడ్యూల్ వివరాలను వెల్లడిస్తున్న జ్ఞానేష్ కుమార్

బిహార్ దంగల్ షురూ

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ పార్టీలు కోరడంతో అందుకు అనుగుణంగా తేదీలను నిర్ణయించామని తెలిపారు. దాదాపు 8.5 లక్షల మంది అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారని వివరించారు. బిహార్‌లో సోమవారం నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై వివాదం నేపథ్యంలో.. కౌంటింగ్‌లో చివరి రెండు రౌండ్లు మిగిలేసరికల్లా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కచ్చితంగా పూర్తి చేయనున్నట్టు వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ను శుద్ధీకరణగా జ్ఞానేశ్‌కుమార్ అభివర్ణించారు. దానితో 69 లక్షల ఓట్లను తొలగించినట్టు చెప్పారు. కాగా, బిహార్‌లో రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నా రు. తొలి విడతలో 121 స్థానాల ఎన్నికలకు అక్టోబర్ 10న నోటిఫికేషన్ విడుదలవుతుంది. 20వ తేదీ నాటికి నామినేషన్ల ప్రక్రియ పూర్తయి అభ్యర్థులు ఖరారవుతారు. నవంబర్ 6న పోలింగ్ జరుగుతుంది. రెండో విడతలో 122 స్థానాలకు అక్టోబర్ 13న నోటిఫికేషన్ ఇస్తారు. 23వ తేదీ నాటికి అభ్యర్థులు ఖరారవుతారు. నవంబర్ 11న పోలింగ్ జరుగుతుంది. మొత్తం అన్ని స్థానాలకు 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలు విడుదల చేస్తారు.

దేశవ్యాప్తంగా ఎనిమిది చోట్ల ఉప ఎన్నికలు

తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం సహా దేశవ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్ల ఉప ఎన్నికలకు కూడా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. జమ్మూకశ్మీర్‌లోని బుద్గామ్, నగ్రోటా, రాజస్థాన్‌లోని అంతా, జార్ఖండ్‌లోని ఘట్‌సిలా, పంజాబ్‌లోని తరన్ తరన్, మిజోరంలోని డంపా, ఒడిశాలోని నౌపాడ నియోజకవర్గాలకు నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. రెండు స్థానాల్లో గెలిచిన జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా బుద్గామ్ స్థానాన్ని వదులుకోవడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. రాజస్థాన్‌లోని అంతా స్థానం బీజేపీ ఎమ్మెల్యే కొందరిని తుపాకీతో బెదిరించిన కేసు కారణంగా అనర్హతకు గురవడంతో ఉప ఎన్నిక జరుగుతోంది. మిగతా ఆరు స్థానాల్లో ఎమ్మెల్యేలు మృతి చెందడంతో ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

జంగిల్ రాజ్ నుంచి బయటికి తెచ్చాం:షా

బిహార్‌ను జంగిల్‌రాజ్ (ఆటవిక రాజ్యం) నుంచి తమ ఎన్డీయే ప్రభుత్వమే బయటపడేసిందని.. అభివృద్ధి, సుపరిపాలన మార్గం చూపిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఈసారి కూడా ప్రజలు అభివృద్ధికే ఓటేస్తారని పేర్కొన్నారు. బిహారీలు మరో సారి ఎన్డీయేను గెలిపిస్తారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోసం ఓటేయనున్నారని ఆర్జేడీ నేత తేజస్వియాదవ్ పేర్కొన్నారు.

సీజేఐపై బూటు విసరబోయిన లాయర్!

(మొదటి పేజీ తరువాయి)

విహార్‌కు చెందిన న్యాయవాది రాకేశ్ కిశోర్ సుప్రీంకోర్టు బార్‌లో సభ్యుడు. ప్రధాన న్యాయమూర్తి విచారణ జరుపుతున్న ఒకటో నంబరు కోర్టు హాలులో న్యాయవాద దుస్తుల్లో వచ్చారు. నేరుగా ఎడమ వైపు నుంచి ప్రధాన న్యాయమూర్తి వేదిక దగ్గరకు వచ్చారు. కిందకు వంగి తన బూటు తీశారు. దాంతోపాటు కొన్ని కాగితాలను రోల్ లాగా చుట్టి గవాయ్ బెంచ్ దిశగా విసిరేశారు. ఆ సమయంలో ఇద్దరు జడ్జిలు కుడివైపు తిరిగి న్యాయవాదులతో మాట్లాడుతున్నారు. అతను బూటు విసురుతుండగానే భద్రతా సిబ్బంది స్పందించి, అడ్డుకున్నారు. వెంటనే అతన్ని బయటకు తీసుకెళ్లారు. "సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు" అంటూ వృద్ధ న్యాయవాది నినాదాలు చేశారు. బూటుతో పాటు రోల్ చేసిన కాగితాలు కూడా విసరడంతో ఏం విసిరాడో కూడా అక్కడున్న వాళ్లకు కాసేపటి వరకు అర్థం కాలేదు. పోలీసులు సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సహకారంతో వివరాలు సేకరిస్తున్నారు. న్యాయవాది చర్య వెనుక అసలు ఉద్దేశం ఏమిటో తెలుసుకోవాల్సి ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, సదరు న్యాయవాదిపై ఎలాంటి కేసు పెట్టడానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్ అంగీకరించకపోవడంతో 3గంటల విచారణ తర్వాత పోలీసులు అతన్ని వదిలేశారు. ఆయన బూటును, ఆయన దగ్గర స్వాధీనం చేసుకున్న పత్రాలను కూడా తిరిగి ఇచ్చేశారు. రాకేశ్ కిశోర్ తెల్ల కాగితం మీద "ప్రతీ సనాతన వాదికి నా సందేశం. సనాతన ధర్మానికి అవమానం జరిగితే హిందుస్థాన్ సహించదు" అని రాసుకున్నారు.

జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలపై కోపంతోనే..

మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలోని జవారీ ఆలయంలో మొఘలుల కాలంలో ధ్వంసం చేసిన విష్ణుమూర్తి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలన్న పిటిషన్‌పై ఇటీవల జస్టిస్ గవాయ్ చేసిన వ్యాఖ్యల మీద సదరు న్యాయవాది ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. అది వారసత్వ కట్టడం కావడంతో దానికి మార్పులు చేయడానికి అవకాశం లేదు. ఆ కేసు విచారణ సమయంలో పిటిషనర్ తరఫు న్యాయవాది పదేపదే పట్టుబట్టడంతో మీరు పరమ భక్తులంటున్నారు కదా, మీరే విష్ణుమూర్తిని వేడుకోండి అని ఆగ్రహంతో జస్టిస్ గవాయ్ స్పందించారు. అది ప్రజాహిత వ్యాజ్యం కాదు పబ్లిసిటీ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అన్నారు. మర్నాడు సీజేఐ తన వ్యాఖ్యల మీద వివరణ ఇచ్చుకున్నారు. తన వ్యాఖ్యలను సోషల్ మీడియా వక్రీకరించిందని, తాను అన్ని మతాలను గౌరవిస్తానని చెప్పారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సంఘటనపై మాట్లాడుతూ, "ప్రధాన న్యాయమూర్తి తనపై దాడి యత్నం మీద మానవత్వంతో స్పందించారు. దీన్ని న్యాయవ్యవస్థ బలహీనతగా భావించరాదు" అన్నారు. ఒక వ్యక్తి తుచ్ఛమైన ప్రచారం కోసం ఇలాంటి చర్యకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సీజేఐకి జెడ్ ప్లస్ భద్రత ఉంది. ప్రధాన న్యాయమూర్తి మీద చెప్పు విసరబోయిన న్యాయవాదిని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యత్వం నుంచి తాత్కాలికంగా తొలగించింది. తదుపరి నిర్ణయం తీసుకొనే వరకు ఆయన దేశంలో ఏ కోర్టులోనూ వాదనలు వినిపించే అవకాశం లేదు. గవాయ్‌పై దాడి యత్నాన్ని సుప్రీంకోర్టు అడ్వకేట్ ఆన్ రికార్డ్స్ సంఘం ఖండించింది. ఆయనపై సుప్రీంకోర్టు సుమోటో చర్యలు తీసుకోవాలని కోరింది. ఇది న్యాయవ్యవస్థపై, చట్టబద్ధ పాలనపై జరిగిన దాడిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. జస్టిస్ గవాయ్‌పై దాడియత్నాన్ని ఖండించడానికి ఏ మాటలూ చాలవని కాంగ్రెస్ ముఖ్యనేత సోనియాగాంధీ అన్నారు. దేశ చరిత్రలో ఇది చీకటి రోజని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఘటనకు బీజేపీ బాధ్యత వహించాలని కేసీవేణుగోపాల్ అన్నారు. ఆటగాడికి ఒంటిమీద గీతపడ్డా ట్విట్టర్‌లో స్పందించే ప్రధానికి జస్టిస్ గవాయ్ మీద దాడి కనబడలేదా? అని పవన్ ఖేరా అడిగారు. మరోపక్క ప్రధాని నరేంద్ర మోదీ జస్టిస్ గవాయ్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. జస్టిస్ గవాయ్‌పై దాడి దేశంలోని ప్రతీ పౌరుడిని ఆగ్రహానికి గురి చేసిందన్నారు.

ఐసీయూలో ఆరుగురు ఆహుతి

జైపూర్‌లోని ప్రభుత్వాస్పత్రిలో విద్యుదాఘాతం!

జైపూర్, అక్టోబరు 6 : రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీయూ విభాగంలో ఆరుగురు అగ్నికి ఆహుతయ్యారు. సహాయక సిబ్బంది ఐదుగురిని మాత్రం ఎట్టకేలకు కాపాడగలిగారు. ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ట్రామా సెంటర్ భవనంలోని న్యూరో ఐసీయూలో ఆదివారం అర్ధరాత్రి దాటాక ఈ ప్రమాదం జరిగింది. అందరూ గాఢనిద్రలో ఉన్న వేళ ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం అధికంగా ఉంది. ఈ సమయంలో అక్కడ క్రిటికల్ కేర్ సపోర్టు మీద 11మంది చికిత్స పొందుతున్నారు. స్టోర్‌రూమ్‌లో సంభవించిన విద్యుదాఘాతమే ప్రమాదానికి కారణమయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మృతుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన ఐదుగురికి చికిత్స కొనసాగుతోందని, తక్కిన ఐసీయూ విభాగాల్లోని వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించామని ట్రామా సెంటరు ఇన్‌చార్జి అనురాగ్ ధాకడ్ సోమవారం తెలిపారు. ఒక్కసారిగా అలుముకున్న మంటలు, పొగలతో న్యూరో ఐసీయూలోని గది గోడలు నల్లబారిపోగా, అత్యవసర వైద్య పరికరాలు పనికిరాని విధంగా వంగిపోయాయి. ఆ ప్రదేశమంతా పొగ చూరిపోవడంతో పోలీసులు చాలాసేపటివరకు ఆస్పత్రిలోకి వెళ్లలేకపోయారు. అగ్నిమాపక సిబ్బంది గది కిటికీలు బద్దలుకొట్టి లోపలకు ప్రవేశించాల్సి వచ్చింది. కాగా, మృతులు ఎనిమిది దాకా ఉంటారని మరో కథనం వినిపిస్తుండగా, ఈ వాదనను ఆస్పత్రి నిర్వాహకులు ఖండించారు. ప్రమాద ఘటనపై ప్రధాన మంత్రి మోదీ విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై రాజస్థాన్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ కమిటీని నియమించింది.

హెచ్చరించినా పట్టించుకోలేదు

మృతుల కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి నిర్వాహకులకు వ్యతిరేకంగా ప్రాంగణంలో నిరసన తెలిపారు. తమవారిని రక్షించాల్సిన సిబ్బంది, నిర్వాహకులు అక్కడి నుంచి పారిపోయారని పలువురు బాధితులు వాపోయారు. ఆహారం తీసుకురావడానికి బయటకు వచ్చి, తిరిగి వెళ్లేసరికే మంటల్లో తన తల్లి కాలిపోయిందని ఒకరు కన్నీరుపెట్టుకోగా, తన సోదరుడిని కోల్పోయానని మరో బాధితుడు వాపోయారు. విద్యుదాఘాతం గురించి వార్డుబోయ్, డాక్టర్‌కు తెలిపినా పట్టించుకోలేదని కొందరు ఆగ్రహంవ్యక్తం చేశారు.

శబరిమలలో బంగారం మాయంపై 'సిట్'

» కేరళ హైకోర్టు ఆదేశం

» నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచన

తిరువనంతపురం, అక్టోబరు 6: శబరిమల అయ్యప్ప దేవాలయంలో బంగారం మాయమయినట్టు ప్రాథమిక విచారణలో తేలడంతో దీనిపై లోతుగా దర్యాప్తు చేయించాలని సోమవారం కేరళ హైకోర్టు నిర్ణయించింది. పోలీసు ఏడీజీ హెచ్.వెంకటేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. బంగారు తాపడం ఉన్న రాగి రేకుల మరమ్మతు పనుల్లో అక్రమాలు జరిగినట్టు కనిపిస్తోందని జస్టిస్ రాజా విజయ రాఘవన్, జస్టిస్ కె.వి.జయకుమార్‌ల ధర్మాసనం తెలిపింది. ఈ కుట్రలో బెంగుళూరులో నివసిస్తున్న మలయాళీ ఉన్నికృష్ణన్ పొట్టితో పాటు ట్రావంకోర్ దేవస్వోం బోర్డు అధికారులకు సంబంధం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం చేసింది. సంపూర్ణంగా విచారణ జరిపి నెల రోజుల్లో నివేదిక అందజేయాలని 'సిట్'ను ఆదేశించింది. ఉన్ని కృష్ణన్ 2019లో అప్పటి దేవస్వోం బోర్డు చైర్మన్ ఎ.పద్మకుమార్‌కు పంపిన ఈ-మెయిల్ అక్రమాలకు కీలక ఆధారంగా ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. 'ద్వారపాలక విగ్రహాలకు బంగారు తాపడం రేకులను అమర్చిన తరువాత ఇంకా కొన్ని రేకులు నా వద్ద ఉన్నాయి. వాటిని ఓ బాలిక వివాహానికి వాడుకోవచ్చా?' అని ఆ మెయిల్‌లో ఉందని, దానిపై చర్యలు తీసుకున్నట్టు కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడింది.

ఖర్గేను పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, బీసీ రిజర్వేషన్లపైనా చర్చ



హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. ఇటీవల అస్వస్థతకు గురైన ఖర్గేకు వైద్యులు సర్జరీ ద్వారా పేస్ మేకర్‌ను అమర్చారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం బెంగళూరు వెళ్లిన సీఎం.. ఖర్గేను పరామర్శించారు. అయితే ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలూ చర్చకు వచ్చినట్లు సమాచారం. ఇటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కూడా బెంగళూరు వెళ్లి ఖర్గేను పరామర్శించారు. బీసీ రిజర్వేషన్‌పై వేసిన పిటిషన్ మీద సుప్రీంకోర్టు విచారణ అనంతరం.. ఢిల్లీ నుంచి వారు నేరుగా బెంగళూరు వెళ్లి ఖర్గేను కలిశారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ రాజకీయం



- చిత్తశుద్ధి ఉంటే హైకోర్టులో బలంగా వాదించాలి: రాంచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే.. హైకోర్టులో బలమైన వాదనలు వినిపించి ఆ వర్గాలకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. 'హైకోర్టులో ఒక కేసు పెండింగ్‌లో ఉన్నప్పుడు, అదే అంశంపై రిట్ పిటిషన్ దాఖలు చేస్తే, దానిని సుప్రీంకోర్టు తిరస్కరించడం, హైకోర్టులోనే వాదనలు వినిపించాలని సూచించడం సహజం. దీనిని కూడా కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేస్తున్నారు.. ఏదో ఘనకార్యం సాధించినట్లు ప్రచారం చేసుకుంటున్నారు' అని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు బీజేపీ కట్టుబడి ఉంటుందని రాంచందర్‌రావు పునరుద్ఘాటించారు. కాగా, మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన పలువురు ముస్లిం మైనారిటీ కార్యకర్తలు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

కాంగ్రెస్ నేతలపై రఘునందన్ ఫిర్యాదు

కాంగ్రెస్ నేతలు ఏ అధికారంతో ఓటరు కార్డులను పంపిణీ చేస్తున్నారని ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఇది ఓటరు కార్డుల చోరీ కాదా..? అని నిలదీశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతలు ఓటరు కార్డుల పంపిణీ దుకాణం పెట్టుకున్నారని, దీనిపై స్పందించాలని కోరుతూ ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఈవోను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. బహిరంగంగా ఓటరు కార్డులను పంచుతుంటే ఎన్నికల కమిషన్ మాట్లాడటం లేదని, కొత్త ఓటరు కార్డులను పంచుతున్న నవీన్ యాదవ్ పోటీకి అర్హుడెలా అవుతారని నిలదీశారు.

అంతర్జాతీయ నైపుణ్య పోటీల్లో పాల్గొనండి

- ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నైపుణ్య పోటీల్లో తెలంగాణ యువత పాల్గొనాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి కోరారు. ఈ పోటీలు వచ్చే సెప్టెంబరులో చైనాలోని షాంఘైలో జరగనున్నాయని, ఈ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలో ఉపాధి శిక్షణ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని సోమవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. రాష్ట్ర స్థాయి విజేతలు ఇండియా స్కిల్స్ కాంపిటీషన్‌లో పాల్గొని జాతీయ స్థాయిలో విజయం సాధిస్తే భారత దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, వెబ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, బేకరీ, కుకింగ్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ వంటి 63 విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగలవారు www.skillindiadigital.gov.in సందర్శించాలని కోరారు.


హైకోర్టులో అనుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం: మంత్రి సీతక్క

సిరిసిల్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో అనుకూలంగా నిర్ణయం వస్తుందన్న ఆశాభావంతో ఉన్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో స్వశక్తి సంఘాల మహిళలకు అందించే ఏకరూప చీరల బట్ట ఉత్పత్తిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 42 శాతం బీసీలకు, జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కొందరు హైకోర్టు, మరికొందరు సుప్రీంకోర్టుకు వెళ్లారని.. సుప్రీంకోర్టు పిటిషన్‌ను తిరస్కరించిందన్నారు. ప్రభుత్వం ఆశిస్తున్న 42 శాతం రిజర్వేషన్ నిర్ణయానికి అనుగుణంగా హైకోర్టు నిర్ణయం వస్తుందన్న ఆశాభావంతో ఎదురుచూస్తున్నామని తెలిపారు.

సత్తా చాటిన తెలంగాణ పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ ఆటగాళ్లు

హైదరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ ఆటగాళ్లు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. హరియాణాలో సెప్టెంబరు 20 నుంచి 24 వరకు జరిగిన 74వ జాతీయ స్థాయి పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ పోటీల్లో వివిధ కేటగిరీల్లో పతకాలు సాధించారు. పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులు డీజీపీ శివధర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సిబ్బందిని డీజీపీ అభినందించారు. ఐజీ ఎం.రమేష్ ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హైకోర్టులోనే తేల్చుకోండి!



(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9ని తీసుకొచ్చిందని చెప్పారు. సెప్టెంబరు 26న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కొంత మంది పిటిషనర్లు సెప్టెంబరు 28న తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. స్టే ఇవ్వడానికి నిరాకరించిందని వివరించారు. ఆ పిటిషన్లపై ఈ నెల 8న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉందన్నారు. అంటే, హైకోర్టు స్టే ఇవ్వకపోతే, సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని జస్టిస్ విక్రమ్‌నాథ్ అసహనం వ్యక్తం చేశారు. ఈ నెల 9న స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రానుందని, అందుకే అత్యవసరంగా సుప్రీంకోర్టును ఆశ్రయించామని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని జస్టిస్ విక్రమ్‌నాథ్ చెప్పగా.. ఉపసంహరించుకోవడానికి అవకాశం కల్పించాలని న్యాయవాది అభ్యర్థించారు. 'మీ కక్షిదారుకు అవగాహన ఉండకపోవచ్చు. కనీసం మీరైనా చెప్పాలి కదా? విచారణ పరిధి హైకోర్టులో ఉన్నందున అక్కడే తేల్చుకోండి' అని ధర్మాసనం తేల్చిచెప్పింది.

గంపగుత్తగా 42% చెల్లదు



- ఏబీసీడీలుగా బీసీలకు ఇవ్వాలని చట్టంలో ఉంది
- ఉమ్మడిగా ఇస్తే ఎంబీసీలు అన్యాయమైపోతారు
- జీవోను కొట్టేయాలంటూ మరో పిటిషన్ దాఖలు
- ఒరిజినల్ పిటిషన్‌తో 8న విచారణకు అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 9వ నంబర్ జీవోను సవాలు చేస్తూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది సి.శాంతప్ప, వికారాబాద్ జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన ఎస్ లక్ష్మయ్య కలిసి ఈ పిటిషన్ దాఖలు చేశారు. బీసీలకు మొత్తానికి కలిపి 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడం చెల్లదని, పంచాయతీరాజ్ చట్ట ప్రకారం బీసీల్లో ఉన్న క్యాటగిరీల వారీగా రిజర్వేషన్లు ఇవ్వాల్సి ఉంటుందని పిటిషనర్లు పేర్కొన్నారు. బీసీల్లో ఉన్న ఏ, బీ, సీ, డీ క్యాటగిరీల వారీగా రిజర్వేషన్లు ఎంత అనే అంశం లేకుండా జీవో ఇవ్వడం చెల్లదని చెప్పారు. అనంతరామన్ కమిషన్ వెనుకబడిన వర్గాలను నాలుగు గ్రూపులుగా విభజించిందని, గ్రూపుల వారీగా రిజర్వేషన్లు కల్పించకపోతే బీసీల్లో అత్యధికంగా ఉన్న మున్నూరు కాపు, ముదిరాజ్, యాదవ, గౌడ కులాలకే ఎక్కువ పదవులు వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల్లో ఉన్న అన్ని కులాలకు న్యాయం చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోకుండా బీసీలకు మొత్తానికి కలిపి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకపక్షంగా జీవో ఇచ్చిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల బీసీల్లోనే అత్యంత వెనుకబడిన కులాలు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న కులాలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు ఇస్తున్న రిజర్వేషన్లను పంచాయతీరాజ్ చట్టం-2018 సెక్షన్ 9(4) ప్రకారం క్యాటగిరీల వారీగా విభజించేలా ఆదేశించాలని, ఆ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులను సవరించి ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని పిటిషనర్లు కోరారు. హైకోర్టులో ఇప్పటికే బి.మాధవరెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో వాటితో కలిపి ఈ పిటిషన్ ఈ నెల 8న విచారణకు వచ్చే అవకాశం ఉంది.

ఇంప్లీడ్ పిటిషన్‌లు దాఖలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని సమర్థిస్తూ పలువురు ఇంప్లీడ్ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఇప్పటికే ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయగా.. కాంగ్రెస్ నేత వీహెచ్, మెట్టు సాయికుమార్, లక్ష్మణ్‌యాదవ్, బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు టీ చిరంజీవులు, బాలరాజు గౌడ్ తదితరులు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటరాదు అన్న నిబంధన విద్యా, ఉద్యోగాలకే వర్తిస్తుందని రాజకీయాలకు వర్తించదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా 50 శాతం గరిష్ఠ పరిమితి ఎప్పుడో దాటిందని గుర్తు చేశారు. ప్రస్తుత బీసీ రిజర్వేషన్లు సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఆధిపత్య కులాలు బీసీల నోటికాడి ముద్దను లాక్కుంటున్నాయని చిరంజీవులు అన్నారు. ఈ పిటిషన్లు అన్నీ 8న హైకోర్టు ఎదుట విచారణకు వచ్చే అవకాశం ఉంది.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కపట నాటకం

- బీసీలనూ ఊరిస్తూ రెండేళ్లుగా పబ్బం గడుపుకుంటోంది: బూరనర్సయ్యగౌడ్
- ఇంప్లీడ్ పిటిషన్ వేశా: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్/రాంనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కపటనాటకం ఆడుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. ఢిల్లీ వెళ్లిన మంత్రులు అక్కడ రాజకీయ డ్రామాకు తెరదీశారని దుయ్యబట్టారు. బీసీలకు రిజర్వేషన్లపై రెండేళ్లుగా ఊరిస్తూ కాంగ్రెస్ పార్టీ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని ఓ ప్రకటనలో విమర్శించారు. 'బీసీ ఉపప్రణాళికకు చట్టబద్ధత కల్పిస్తామని, వారి సంక్షేమానికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించలేదా? వాటి అమలుకు ఏ కోర్టు అడ్డుపడింది?' అని నిలదీశారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పాలని నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9కి అన్ని రాజకీయ పార్టీలు, వర్గాలు మద్దతు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఎవరైనా వ్యతిరేకిస్తే వారి భరతం పడతామని హెచ్చరించారు. హైకోర్టులో కొనసాగుతున్న వాదనలకు మద్దతుగా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశానన్నారు.

ఆ జీవో కోర్టు ముందు నిలవదు: జస్టిస్ ఈశ్వరయ్య

న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ సర్కారు ఇచ్చిన జీవో 9 న్యాయస్థానం ముందు నిలవదని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఎమ్మెల్యేలందరూ కలిసి ఇంప్లీడ్ పిటిషన్ వేసి ప్రభుత్వానికి మద్దతు తెలిపినా 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదన్నారు. ఎందుకంటే ఆ జీవో రాజ్యాంగబద్ధంగా లేదని, రాజ్యాంగ తీర్పులకు వ్యతిరేకమని చెప్పారు. తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేరిస్తేనే రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత లభిస్తుందని, అప్పుడే బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యమవుతుందని వివరించారు.

బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు!

సుప్రీంకోర్టు తీర్పు శుభ పరిణామం.. హైకోర్టులోనూ సానుకూల తీర్పే వస్తుందని ఆశిస్తున్నాం

- రిజర్వేషన్ల అమలుకు పనిచేస్తాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- న్యాయ ప్రక్రియలోనూ బీజేపీ, బీఆర్ఎస్‌లు సహకరించాలి
- జూబ్లీహిల్స్ టికెట్ బీసీకే: పొన్నం
- 42%పై అన్ని వర్గాలూ సహకరించాలి
- ప్రభుత్వ, పార్టీ పరంగానూ పోరాడి సాధిస్తాం: మహేశ్‌గౌడ్





న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర జరుగుతోందని, ఎవరెన్ని కుట్రలు చేసినా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన ఆయన.. హైకోర్టులోనూ సానుకూలమైన తీర్పే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో కేసు విచారణ నేపథ్యంలో ఆదివారం రాత్రే మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి భట్టి విక్రమార్క ఢిల్లీకి చేరుకున్నారు. న్యాయవాదులు, సంబంధిత అధికారులతో చర్చించారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు సుప్రీంకోర్టుకు వెళ్లారు. పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు తీర్పు వచ్చిన వెంటనే ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9పై కొంత మంది సుప్రీంకోర్టులో వేసిన కేసు వీగిపోయిందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వమే కాదని, దేశం మొత్తం గమనిస్తోందని చెప్పారు. రిజర్వేషన్లను అడ్డుకునేందుకు, ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లు సహకరించాలి

బీసీలకు 42 శాతం రిజర్వేన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతిచ్చినట్లుగానే న్యాయప్రక్రియలోనూ బీజేపీ, బీఆర్ఎస్‌లు సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కేంద్రం, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఆమోదం పొందేలా చూడాలని బీజేపీ బీసీ ఎంపీలు ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్‌లను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. ప్రచారం కోసమే ఢిల్లీకి వచ్చామని రాంచందర్‌రావు అనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. బీజేపీ అన్ని రకాల రిజర్వేషన్లకు వ్యతిరేమని ధ్వజమెత్తారు. సెంట్రల్ యూనివర్సిటీలో దళిత యువకుడి మృతికి రాంచందర్‌రావు కారకుడని ఆరోపించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. అక్కడి నుంచి పోటీ చేసే అవకాశం వంద శాతం బీసీకే దక్కుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జీవో 9కు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేయడం శుభ పరిణామమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఈ నెల 8న హైకోర్టులోనూ ప్రభుత్వానికి అనుకూలంగానే తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా పోరాటం చేస్తామని, రిజర్వేషన్ సాధిస్తామని తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లు బీసీ రిజర్వేషన్ల అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, బీసీల రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా వివిధ కోర్టుల్లో దాఖలైన పిటిషన్లను ఉపసంహరించుకోవాలని ఎంపీ మల్లు రవి పిటిషనర్లకు విజ్ఞప్తి చేశారు. బీసీల రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా కోర్టుల్లో దాఖలైన పిటిషన్ల వెనక కేటీఆర్ హస్తం ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ఆరోపించారు. బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన విషయంలో అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ కోరారు.

● బీసీలకు 42% రిజర్వేషన్లు వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9 న్యాయస్థానాల్లో చెల్లదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న అన్నారు. సుప్రీంకోర్టు హైకోర్టుకు వెళ్లమని మాత్రమే చెప్పిందని గుర్తుచేశారు.

'రెడ్డి కా హటావో- బీసీ రిజర్వేషన్లు బచావో'

- బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించం
- రెడ్డి సామాజిక వర్గాన్ని బీసీ వ్యతిరేకిగా ప్రకటిస్తున్నాం
- రెడ్లను రాజకీయంగా బొందపెట్టడమే లక్ష్యం: జాజుల

బర్కత్‌పుర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో కల్పించిన 42 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రెడ్డి జాగృతికి చెందిన మాధవరెడ్డి, గోపాల్‌రెడ్డి సుప్రీంకోర్టు, హైకోర్టులలో పిటిషన్‌లు దాఖలు చేయడాన్ని బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ చర్య కారణంగా రెడ్డి సామాజిక వర్గాన్ని బీసీల వ్యతిరేకిగా ప్రకటిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. రెడ్లను శాశ్వతంగా రాజకీయాల నుంచి వెలివేయడమే బీసీల లక్ష్యమని, 'రెడ్డి కా హటావో-బీసీ రిజర్వేషన్లు బచావో' నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ రిజర్వేషన్ల పెంపు, సుప్రీంకోర్టు, హైకోర్టులలో కేసులు, భవిష్యత్ కార్యాచరణపై నిర్వహించిన సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణలో రెడ్లను రాజకీయంగా బొంద పెట్టడమే బీసీల లక్ష్యమని స్పష్టం చేశారు. రెడ్డి సామాజిక వర్గంపై బీసీల యుద్ధం ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. గవర్నర్ తక్షణమే బీసీ బిల్లును ఆమోదించాలని, లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రెడ్డి సామాజిక వర్గం బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం, గవర్నర్ బిల్లును ఆమోదించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం పూలే, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా రెడ్డి సామాజిక వర్గం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని ప్రకటించాలని డిమాండ్ చేశారు.



మదిర హాస్పిటల్

కట్టేసి.. గాలికొదిలేసి..

- కొత్త దవాఖానాలకు మంజూరు కాని పోస్టులు
- ఒక్క టీవీవీపీ పరిధిలోనే 25 ఆస్పత్రులు
- ప్రజారోగ్యం పరిధిలో పీహెచ్‌సీ, సబ్ సెంటర్స్
- ఆర్థికశాఖ వద్ద ఫైలు.. వైద్యశాఖ అధికారుల చక్కర్లు

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం ఖమ్మం జిల్లాలో వంద పడకలతో మదిర ప్రాంతీయ ఆస్పత్రిని నిర్మించారు. కానీ.. ఆ హాస్పిటల్‌కు వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను కొద్ది రోజుల క్రితం వరకు మంజూరు చేయలేదు. మూడేళ్లుగా ఆ ఆస్పత్రిని అలా ఖాళీగా వదిలేశారు. దాంతో ఆస్పత్రి ప్రాంగణమంతా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కొత్తగా నిర్మించిన ఆ భవనంలోని కిటికీలు, తలుపులు పాడైపోతున్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గంలో కొత్తగా నిర్మించిన ఆస్పత్రి దుస్థితి ఇది! అదొక్కటే కాదు రాష్ట్రవ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో ఇటువంటి పరిస్థితే నెలకొంది. గణాంకాలు చూస్తే.. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోనే 25 ఆస్పత్రులను కొత్తగా కట్టారు. వాటిలో ఏడు వంద పడకల ఆస్పత్రులు (మధిర, బెల్లంపల్లి,ఆర్మూర్, గజ్వేల్, బాన్సువాడ, అలంపూర్, అచ్చంపేట, బాదేపల్లి(జడ్చర్ల)). మరో ఏడు చోట్ల 50 పడకల ఆస్పత్రులు, 11 చోట్ల 30 పడకల ఆస్పత్రులను కొత్తగా నిర్మించారు. కానీ.. సిబ్బంది లేకపోవడంతో వాటన్నింటినీ కొంత కాలంగా వాటిని నిరుపయోగంగా ఉంచారు. అలాగే రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుడి పరిధిలో కొత్తగా పలుచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్ర భవనాలను నిర్మించారు. సిబ్బంది లేక వాటినీ ఖాళీగా ఉంచారు. కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలో యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలను కూడా ఇలాగే నిర్మించి, నిరుపయోగంగా ఉంచారు. ఇటువంటివి రాష్ట్ర వ్యాప్తంగా వందకు పైగానే ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొన్నాయి. మధిర ఆస్పత్రికి తాజాగా కేడర్ స్ట్రెంత్ మంజూరైనప్పటికీ.. వైద్యుల నియామక ప్రక్రియ ప్రాసెస్‌లో ఉంది.

ఆర్థికశాఖ చుట్టూ ప్రదక్షిణలు

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని పాతిక ఆస్పత్రుల్లో కనీసం 1400 మంది సిబ్బంది అవసరమని వైద్య ఆరోగ్యశాఖ నిర్ధారించింది. కొత్తగా నిర్మితమైన వాటిలో కనీసం తొలుత 1200 మంది వైద్య, వైద్య సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలని కొద్ది నెలల క్రితం వైద్య ఆరోగ్యశాఖ ఆర్థికశాఖను కోరింది. కానీ కొత్త పోస్టుల మంజూరు విషయంలో ఆర్థికశాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. భవనాలు కట్టినా అవి ఖాళీగా ఉన్నాయని, పోస్టులు మంజూరు చేస్తే ఆస్పత్రులు అందుబాటులోకి వస్తాయని హెల్త్ సెక్రటరీ పలుమార్లు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిని స్వయంగా కలసి విజ్ఞప్తి కూడా చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

అదే అసలు సమస్య..

సాధారణంగా జనాభా అవసరాలకు తగినట్టుగా ఆస్పత్రులను ఏర్పాటు చేస్తారు. కానీ ఇటీవలికాలంలో ఆ ప్రాతిపదికన కాకుండా రాజకీయ పలుకుబడులతో ఆస్పత్రులు ఏర్పాటవుతున్నాయి. తమ ప్రాబల్యం పెంచుకునేందుకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి చేసి తమ ప్రాంతాల్లో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్స్‌ను మంజూరు చేయించుకుంటున్నారు. వెంటనే సర్కారు ఉత్తర్వులు జారీ చేస్తోంది. అయితే అదే ఉత్తర్వుల్లో ఆస్పత్రి ఏర్పాటుతో పాటు వైద్య సిబ్బందిని కూడా మంజూరు చేస్తే బాగుంటుంది. కానీ అలా జరగడం లేదు. దాంతో ఆస్పత్రుల నిర్మాణం పూర్తయినా సిబ్బంది లేక అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ. 8,800 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

అజిత్‌రెడ్డి పాల్గొన్నారు. చర్చల అనంతరం ఎలి లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళిక, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందించే సహకారంతో అధునాతన ఔషధ తయారీ యూనిట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఇక్కడి నుంచే దేశంలో ఎలి లిల్లీ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ నెట్‌వర్క్, సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనున్నట్టు పేర్కొంది. ఫార్మా తయారీ యూనిట్ ఏర్పాటుతో రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మారంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని.. వీలైనంత త్వరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్‌మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారి ఏర్పాటు చేస్తున్న అధునాతన యూనిట్.. తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుందని పేర్కొన్నారు. తాజాగా, దేశంలోనే తమ తొలి ఫార్మా తయారీ కేంద్రాన్ని తెలంగాణలో నెలకొల్పటానికి ముందుకొచ్చింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విస్తరణలో భాగంగా ఎలి లిల్లీ కంపెనీ భారీ పెట్టుబడులకు సిద్ధపడటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇది ఒక గర్వకారణమని అన్నారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామా హైదరాబాద్: సీఎం

దేశంలోనే ఫార్మా హబ్‌గా పేరొందిన హైదరాబాద్ ఇప్పుడు యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 1961లో ఐడీపీఎల్‌ను స్థాపించినప్పటి నుంచే హైదరాబాద్ దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామాగా మారిందని, ప్రస్తుతం 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని సీఎం పేర్కొన్నారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారాన్ని అందిస్తామన్నారు. హైదరాబాద్‌లో ఎలి లిల్లీ కంపెనీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రంలో పలువురికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎలి లిల్లీ విస్తరణ ఫార్మా రంగానికి కొత్త ఉత్తేజం అందిస్తుందని, ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ వేగవంతమైన వృద్ధిని సాధిస్తోందన్నారు.



ఎలి లిల్లీ కంపెనీ ప్రతినిధిని సన్మానిస్తున్న సీఎం రేవంత్

150 ఏళ్ల కంపెనీ

అమెరికాకు చెందిన ఎలి లిల్లీ కంపెనీ 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో కొనసాగుతోంది. ప్రధానంగా మధుమేహం, స్థూలకాయం, అల్జీమర్, క్యాన్సర్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తోంది. మన దేశంలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగళూరులో ఎలి లిల్లీ కంపెనీ కార్యకలాపాలున్నాయి. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్టులోనే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను ప్రారంభించింది.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న వంగపల్లి మణి సాయివర్మ

తెలుగు వారికి ఎన్ఎస్ఎస్ అవార్డులు

» ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఎన్ఎస్ఎస్ అవార్డులను అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో 2022-23కు గాను.. మై భారత్-నేషనల్ సర్వీస్ స్కీం(ఎన్ఎస్ఎస్) అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వలంటీర్లు సమాజ సేవలో చేసిన అత్యుత్తమ సహకారాన్ని గుర్తించి వారికి కేంద్ర యువజన వ్యవహారాల శాఖ ఏటా ఎన్ఎస్ఎస్ అవార్డులను ప్రదానం చేస్తుంది. వలంటీర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో గల విక్రమసింహపురి విశ్వవిద్యాలయానికి చెందిన ముమ్ముల పృథ్వీ రాజ్, నెల్లూరు చింతారెడ్డిపాలెంలోని నారాయణ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు చెందిన డి. రెడ్డి జిష్ణు, తెలంగాణలోని సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన వంగపల్లి మణి సాయివర్మకు రాష్ట్రపతి ఎన్ఎస్ఎస్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డు కింద గ్రహీతలకు రూ.లక్షతో పాటు వెండిపతకం, సర్టిఫికెట్ లభిస్తాయి.

ఆల్మట్టి ఎత్తు తగ్గింపుపై హామీతో రావాలి:కవిత

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం సొంత జిల్లాతోపాటు దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చే ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు తగ్గింపుపై హామీతో కర్ణాటక నుంచి తిరిగి రావాలని సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలే ఉన్నందున.. వారి పార్టీ అధిష్ఠానంతో చర్చించి తెలంగాణకు నష్టం కలుగకుండా చూడాలని సోమవారం తన ఎక్స్ ఖాతాలో రాసిన పోస్టులో పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించి రాజకీయాలు మాట్లాడేందుకు కర్ణాటకకు వెళ్లిన సీఎం రేవంత్.. ఆల్మట్టి ఎత్తు పెంపుపై బెంగళూరులోనే తేల్చుకుని రావాలన్నారు. బెస్ట్ అవెలబుల్ పథకం కింద ప్రైవేటు స్కూళ్లలో విద్యాభ్యాసం చేస్తున్న పేద విద్యార్థుల బకాయి ఫీజులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమష్టి కృషితోనే టీబీ నిర్మూలన: గవర్నర్ జిష్ణుదేవ్

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : టీబీ నిర్మూలన కోసం సమష్టి కృషి అవసరమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కళాకారులు, క్రీడాకారులు, ఎన్జీవోలు, కార్పొరేట్ సంస్థలు, విద్యాసంస్థలు ఇందుకోసం ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్‌భవన్‌లో సోమవారం నిర్వహించిన 76వ టీబీ సీల్ సేల్ క్యాంపెయిన్‌లో గవర్నర్ మాట్లాడుతూ.. టీబీ నిర్మూలన సవాల్ అని అన్నారు. పేదరికం, పౌష్టికాహారం, అవగాహన వంటి అంశాలతో ఇది ముడిపడి ఉందని వ్యాఖ్యానించారు. 'టీబీ ముక్త్ భారత్' ఉద్దేశం టీబీ నియంత్రణే కాదు.. దానిని పూర్తిగా నిర్మూలించడం అని గవర్నర్ పేర్కొన్నారు. టీబీ రహిత తెలంగాణ సాధనలో రాజ్‌భవన్ సమన్వయ కర్తగా వ్యవహరిస్తుందని చెప్పారు.

తుది తీర్పునకు లోబడే మత్స్యకార సంఘాల ఇన్‌చార్జీల నియామకం: హైకోర్టు

జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్లు/పర్సన్ ఇన్‌ఛార్జీల నియామకాలను ప్రభుత్వం చేపట్టినప్పటికీ అవి తామిచ్చే తుది తీర్పునకు లోబడే ఉంటాయని హైకోర్టు తెలిపింది. చీఫ్ ప్రమోటర్లు/ పర్సన్ ఇన్‌ఛార్జీల నియామకాలను నేరుగా ప్రభుత్వమే చేపట్టేలా సెప్టెంబరు 3న జారీ అయిన జీవో 60 విషయమై ఈ స్పష్టత ఇచ్చింది. ఈ జీవోను సవాల్ చేస్తూ హనుమకొండ జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ బుస్స మల్లేశం సహా మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టీ మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది డీఎల్ పాండు వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం ఏకపక్షంగా ఈ జీవోను తీసుకొచ్చిందని, దాన్ని రద్దు చేయాలని కోరారు. వాదనలు విన్న జడ్జి.. ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పశుసంవర్ధక, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ సహా పలువురికి నోటీసులు జారీచేశారు. ఒకవేళ జీవో 60 ప్రకారం ప్రభుత్వం నియామకాలు చేపట్టినా అవి తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడే ఉంటాయని తెలిపారు. తదుపరి విచారణ ఈ నెల 13కు వాయిదా పడింది.

'తెలుగు తప్పనిసరి' ఉత్తర్వులపై జోక్యానికి హైకోర్టు నిరాకరణ

పాఠశాల స్థాయిలో తెలుగు భాష సబ్జెక్టును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. పదో తరగతి వరకు తెలుగును బోధనను తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై సోమవారం చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. అకస్మాత్తుగా తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేయడం వల్ల 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఇబ్బంది ఏర్పడుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇప్పటికే రెండు విద్యాసంవత్సరాలకు మినహాయింపు ఇచ్చిందని హైకోర్టు గుర్తు చేసింది. తాజా విద్యాసంవత్సరంలోనూ తొమ్మిదో తరగతి విద్యార్థులకు సైతం ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నందువల్ల ప్రస్తుతానికి ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని పేర్కొంది.

బార్బడోస్‌లో సీపీఏ సదస్సుకు స్పీకర్, మండలి చైర్మన్ బృందం

హైదరాబాద్/వికారాబాద్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికాలోని బార్బడోస్ రాజధాని బ్రిడ్జ్‌టౌన్‌లో జరుగుతున్న కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సులో పాల్గొనేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ నేతృత్వంలో ప్రతినిధి బృందం సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లింది. ఈ బృందంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దంపతులు, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ దంపతులు, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, పలువురు అధికారులున్నారు. ఈనెల 11 వరకు జరిగే సదస్సులో పాల్గొననున్న బృందం.. అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా యూకే, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో పర్యటించనుంది. దీని ద్వారా ప్రపంచ పార్లమెంటరీ వ్యవస్థలు నడుస్తున్న తీరు, ఉత్తమ పద్ధతులు తెలుసుకొని వాటిని రాష్ట్ర శాసనసభా కార్యకలాపాల మెరుగుదల కోసం అమలుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మల్లోజుల లొంగుబాటు!

మావోయిస్టు పార్టీని వీడేందుకు సిద్ధమైన పొలిట్ బ్యూరో సభ్యుడు?

» పోలీసులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు అనుమానిస్తున్న పార్టీ
» తాజాగా మల్లోజుల మరో లేఖ విడుదల
» పార్టీ తప్పిదమే పోరాటాన్ని దెబ్బతీసింది
» ప్రాణత్యాగాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి
» పార్టీ నష్టపోవడంలో నేనూ కారకుడినే
» అందుకే తప్పుకొంటున్నా: మల్లోజుల

హైదరాబాద్/చర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోను.. పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన మల్లోజుల.. ఇటీవలి కాలంలో పార్టీ విధానాలను తప్పుబడుతుండడమే అందుకు నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొద్దిరోజుల క్రితం మావోయిస్టు అభయ్ పేరుతో.. సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు లేఖ విడుదల కావడం తెలిసిందే. తాజాగా మల్లోజుల వేణుగోపాల్ పేరుతో మరో లేఖ విడుదలైంది. పార్టీ తప్పిదమే సాయుధ పోరాటాన్ని దెబ్బతీసిందని పేర్కొంటూ 26 పేజీల లేఖను ఆయన విడుదల చేశారు. అభయ్ పేరుతో గతంలో విడుదలైన లేఖపై మావోయిస్టు పార్టీ అప్పుడే స్పందించింది. అభయ్ ప్రకటన ఆయన వ్యక్తిగతమని, దాంతో పార్టీకి సంబంధం లేదని పేర్కొంది. అదే సమయంలో ఇద్దరు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పోలీసుల ఎదురు కాల్పుల్లో మరణించారు. ఈ నేపథ్యంలో అభయ్ లొంగిపోయేందుకు పోలీసులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు మావోయిస్టు పార్టీ అనుమానిస్తోంది. మరోవైపు కీలక నేతలను బయటకు రప్పించేందుకు పోలీసులు ఆడుతున్న నాటకంలో భాగమనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అయితే మల్లోజుల గానీ, మావోయిస్టు పార్టీ ఇతర కీలక నేతలు గానీ ఎవరూ తమ అదుపులో లేరని తెలంగాణ పోలీసులు అంటున్నారు. అందుకు సంబంధించి సమాచారం లేదని చెబుతున్నారు.



గడువు సమీపిస్తుండడంతో

ఈ ఏడాది మార్చి చివరి నాటికి మావోయిస్టు పార్టీని తుదముట్టిస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అందుకు తగ్గట్లుగానే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో బలగాలు మోహరించి గాలింపు కొనసాగిస్తున్నాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పుల్లో పార్టీ క్యాడర్ ప్రాణాలు కోల్పోతున్నారు. కీలక నేతలు నేలకొరుగుతున్నారు. ఈ నేపథ్యంలో పరిస్థితుల్ని అంచనా వేస్తున్న పార్టీ క్యాడర్, కీలక నేతలు లొంగుబాటు బాట పట్టారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర కమిటీ సభ్యులతోపాటు వందల సంఖ్యలో క్యాడర్ పార్టీని వీడి పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. కేంద్రం విధించిన గడువు సమీపిస్తుండడంతో.. మల్లోజుల సైతం లొంగిపోయే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితమే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా మరో కేంద్ర కమిటీ సభ్యుడు వైభవ్‌తోపాటు మరొకరు లొంగిపోయినట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ అంశంపై పోలీసులు ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు.

పరిస్థితులు మారాయి..

ప్రస్తుతం పరిస్థితులు మారాయని, శత్రువులు బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పరుచుకున్నారని, తాము ఎక్కడికి వెళ్లినా వెంటనే సమాచారం వెళ్లిపోతోందని మల్లోజుల వివరించారు. దీనిని బట్టి రహస్య పార్టీ నిర్మాణం, విప్లవ నిర్మాణం, ప్రజల మధ్య ఆర్గనైజేషన్ టీం వల్ల జరగదని అర్థమైపోయిందన్నారు. అలాగే జనతన సర్కార్ స్కూళ్లలో చదివే పిల్లలకు ఎంత చదివినా గుర్తింపు లేదని, మళ్లీ బయట స్కూల్‌కు వెళ్తే వారు ఒకటి నుంచి చదవాల్సిందేనని గుర్తు చేశారు. దీనినీ కేంద్ర కమిటీ గుర్తించలేదని తప్పుబట్టారు. ఆధార్ కార్డులు తెచ్చుకోవడాన్ని కూడా పార్టీ వ్యతిరేకించిందని, కొందరు దొంగచాటుగా వెళ్లి కార్డులు తెచ్చుకున్నారని, ఇలాంటి తప్పిదాలు సెంట్రల్ కమిటీ అనేకం చేసిందని ఆరోపించారు. జరిగిన తప్పిదాలపై మాట్లాడితే కమిటీ ఎద్దేవా చేసిందని, నేడు ఫలితం అనుభవిస్తోందని అన్నారు. కగార్ కారణంగా అనేక మంది చనిపోయారని, కొంతమంది లొంగిపోతున్నారని, మరికొంత మంది ప్రమాదవశాత్తు అరెస్టవుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిణామాలు సమస్యలకు పరిష్కారాలు కావని, తీవ్రనిర్బంధంలో ఉద్యమాన్ని కొనసాగించలేమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉద్యమాన్ని కాపాడుకుని, క్యాడర్‌ను రక్షించుకోవాలని, అనవసర త్యాగాలను ఆపాలని మల్లోజుల సూచించారు.

పార్టీ తప్పిదమే సాయుధ పోరాటాన్ని దెబ్బతీసింది: మల్లోజుల

పార్టీ తప్పిదమే సాయుధ పోరాటాన్ని తెబ్బతీసిందని, అందుకే పట్టున్న ప్రాంతాల్లో పార్టీ క్యాడర్‌ను కోల్పోయిందని మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పేర్కొన్నారు. తన ఆవేదనను వినిపిస్తూ ఆయన తాజాగా ఓ లేఖను విడుదల చేశారు. అయితే ఆ లేఖపై ఆగస్టు అని రాసి ఉంది. దీంతో రెండు నెలల క్రితమే ఈ లేఖను ఆయన విడుదల చేసినట్టు తెలుస్తోంది. ఆ లేఖలో పార్టీ చేసిన తప్పిదాలు, ప్రస్తుత పరిస్థితులను ఆయన వివరించారు. ఈ లేఖ చదివి కామ్రేడ్‌లతో చర్చిస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. సుదీర్ఘ ఉద్యమంలో పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ చేసిన తప్పిదాలే ఉద్యమ పోరాటాన్ని దెబ్బతీశాయని మల్లోజుల పేర్కొన్నారు. కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో 28 ఏళ్లుగా పని చేస్తూ ఇంతటి నష్టాలు, బలిదానాలు కావడానికి తాను కూడా ఓ కారణమేనని, అందుకే తన బాధ్యతల నుంచి తప్పుకొంటున్నానని తెలిపారు. ఉద్యమంలో పార్టీ అనేక విజయాలు సాధించిందని, కానీ.. దానిని నిలబెట్టుకోలేక పోయిందని పేర్కొన్నారు. ఏడాదికి రెండు, మూడు దాడులు చేసి తమ బలాన్ని ఎక్కువగా ఊహించుకున్నామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల్ని బొక్కారు!

సూర్యాపేట జిల్లాలో ఎనిమిది మంది అరెస్టు

సూర్యాపేటక్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకం చెక్కులను కాజేసి సొమ్ము చేసుకున్న ఎనిమిదిమందిని సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి రూ.7.3 లక్షల నగదు, వినియోగించని 44 చెక్కులు, ఆరు బ్యాంక్ పాస్‌పుస్తకాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మేళ్లచెర్వుకు చెందిన ఒక వ్యక్తి 2023లో అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. తర్వాత సీఎంఆర్ఎఫ్ కోసం అప్పటి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ద్వారా దరఖాస్తు చేశాడు. నెలలు గడుస్తున్నా తనకు సాయం అందకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లి విచారించగా.. అతడి పేరిట చెక్కు విడుదలైందని, దాన్ని ఎవరో సొమ్ము చేసుకున్నారని తెలిసింది. చెక్కును ఎన్‌క్యాష్ చేసుకున్నవారి వివరాలు తెలుసుకున్న ఆ వ్యక్తి.. వారి వద్దకు వెళ్లి ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. సైదిరెడ్డి క్యాంపు కార్యాలయంలో వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసే పులిదిండి ఓంకార్, కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసే పెండెం వెంకటేశ్వర్లు దీని వెనుక ఉన్నట్టు వెల్లడైంది.

ఇలా సొమ్ము చేసుకున్నారు..

ఓంకార్, వెంకటేశ్వర్లు కలిసి.. 2023లో సైదిరెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి వచ్చిన 51 చెక్కులను వారి వద్దే దాచుకున్నారు. బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మాదాసు వెంకటేశ్వర్లు, బెల్లంకొండ పద్మ, మట్టపల్లి సైదులు, బెల్లంకొండ సైదులు, గొట్టిముక్కల వెంకటేశ్వర్లు అనే వ్యక్తులతో కలిసి..సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎవరి పేరిట విడుదలయ్యాయో అవే పేర్లు ఉన్న వ్యక్తులను గాలించి.. వారి బ్యాంకు ఖాతాల్లో ఆ చెక్కులు జమ చేయించారు. వచ్చిన సొమ్మంతా తాము పంచుకుని.. ఆ ఖాతాదారుడికి రూ.5 వేల నుంచి 10 వేల దాకా ఇచ్చారు. ఇలా ఏడు చెక్కులను మార్చి 9.5 లక్షలు కాజేశారు. కానీ, సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నవారిలో ఒకరు ఆరా తీయడంతో వీరి గుట్టు బయటపడింది. అక్కణ్నుంచీ ఆ వ్యక్తి నేరుగా వీరి వద్దకు వెళ్లి నిలదీయడంతో.. తాము కాజేసిన సొమ్ములోంచి అతడికి రూ.2.25 లక్షలు ఇచ్చారు. వారిపై బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు మేళ్లచెర్వు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తొలుత వారు బెల్లంకొండ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని సోమవారం మిగతా నిందితులను అరెస్ట్ చేశారు.

రాజ్యాంగం, దళిత సమాజంపై దాడి

» సీజేఐపై దాడి యత్నాన్ని ఖండించిన ఎంపీ మల్లు రవి, సీతక్క, కూనంనేని, జాన్ వెస్లీ
» అది రాజ్యాంగ పరిరక్షణ పునాదులపై దాడి: మహేశ్‌గౌడ్

న్యూఢిల్లీ, హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఎంపీ మల్లు రవి ఖండించారు. ఇది ముమ్మాటికీ భారత రాజ్యాంగం, దళిత సమాజంపై జరిగిన దాడి అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 75 ఏళ్ల దేశ చరిత్రలో సీజేఐ స్థాయికి ఎదిగిన రెండో దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి జస్టిస్ గవాయ్ అని గుర్తు చేశారు. ఆయన ప్రతిభ, మేధస్సుతో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ఈ దాడి యత్నం ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని విశ్వసించే అన్ని రాజకీయ పార్టీలు ఏకమై ఈ ఘటనకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీజేఐపై దాడి యత్నం దేశ న్యాయవ్యవస్థ, రాజ్యాంగ పరిరక్షణ పునాదులపైన జరిగిన దాడి అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీతక్క డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం అత్యంత దిగ్భ్రాంతికరమని, ఇది హేయమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సనాతన ధర్మం పేరుతో ఏకంగా ప్రధాన న్యాయమూర్తి మీదనే బూటు విసిరే ప్రయత్నం బెదిరింపు ధోరణి, అరాచకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సీజేఐపై దాడి యత్నం ఘటనపై స్పందించాలని సీపీఐ అగ్రనేత నారాయణ డిమాండ్ చేశారు. దాడి యత్నాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని, బాధ్యుడిని కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

తిరుపతి వీక్లీ స్పెషల్స్ ఇక తిరుచానూరు వరకే: రైల్వేశాఖ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-తిరుపతి మార్గంలో పలు ప్రత్యేక రైళ్లను ఇకపై తిరుచానూరు టెర్మినల్ వరకే నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. తిరుపతి స్టేషన్లో రైళ్ల రద్దీ పెరగడం, ప్రత్యేక రైళ్లకు నిర్వహణ సమస్యలు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. చర్లపల్లి-తిరుచానూరు-చర్లపల్లి, సికింద్రాబాద్-తిరుచానూరు-సికింద్రాబాద్, నాందేడ్-తిరుచానూరు,చర్లపల్లి-తిరుచానూరు-చర్లపల్లి, జాల్నా-తిరుచానూరు-జాల్నా రైళ్లు గతంలో మాదిరిగా తిరుపతి నుంచి కాకుండా 9నుంచి తిరుచానూరు టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయన్నారు. టెర్మినల్ మారినప్పటికీ మార్గమధ్యంలో వివిధ స్టేషన్లకు చేరుకునే వేళల్లో ఎటువంటి మార్పులేదని సీపీఆర్‌ఓ స్పష్టం చేశారు.

గూగుల్ మ్యాప్స్‌లో ఆర్టీసీ బస్సుల సమాచారం

» త్వరలో మీ టికెట్ యాప్‌తో క్యూఆర్ కోడ్ టిక్కెట్లు.. డిజిటల్ పాస్‌లు
» 3 ఏళ్లలో హైదరాబాద్‌కు ఈ- బస్సులు
» టీజీఎస్ఆర్టీసీ నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజా రవాణా మరింత స్మార్ట్‌గా మారుతోంది. టీజీఎస్ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తున్నప్పుడు గమ్యస్థానానికి ఎంత దూరంలో ఉన్నామన్న సమాచారం తెలుసుకోవడంతోపాటు క్యూఆర్ ఆధారిత డిజిటల్ బస్సు పాస్, బస్సు టికెట్ల వివరాలు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న 'గమ్యం' యాప్‌తో బస్సు బయలు దేరిన టైం, ఏ మార్గంలో ఎక్కడుంది, బస్టాప్‌కు ఎప్పుడు చేరుకుంటుంది వంటి పూర్తి సమాచారం ఇస్తున్నా అక్కడక్కడ కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. కనుక గూగుల్ మ్యాప్స్ సాయంతో మరింత కచ్చితత్వంతో బస్సుల రాకపోకల వివరాలను తెలుసుకోవచ్చు. ఇటీవల జరిగిన సమావేశ నిర్ణయం మేరకు టీజీఎస్ఆర్టీసీ అధికారులు.. బస్సుల సమస్త సమాచారాన్ని గూగుల్‌కు అందించనుండటంతో గూగుల్ మ్యాప్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వారం, పది రోజుల్లో గూగుల్‌కు ఆర్టీసీ బస్సుల డేటా అందించనున్న నేపథ్యంలో దీపావళికల్లా హైదరాబాద్ సిటీ బస్సుల సమాచారం ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుంది. దశల వారీగా రాష్ట్రంలోని మిగతా బస్సుల సమాచారం గూగుల్ మ్యాప్స్‌లో పొందుపరుస్తారు.



మీ టికెట్ ద్వారా డిజిటల్ టికెట్లు..

మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) విభాగం నిర్వహిస్తున్న 'మీటికెట్' యాప్ ద్వారా త్వరలో టీజీఎస్ఆర్టీసీ ఇంటర్‌సిటీ బస్సు సేవలు, క్యూఆర్ ఆధారిత డిజిటల్ బస్ పాస్‌లు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్ర స్మార్ట్ మొబిలిటీ ప్రణాళికలో భాగంగా చేపట్టిన సేవల విస్తరణతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతం కానుంది. ఇక బస్సు టికెట్లు, నెలవారీ పాస్‌లు 'మీ టికెట్ యాప్'లోనే పొందొచ్చు. క్యూఆర్ కోడ్ బస్సు టికెట్లు, డిజిటల్ పాస్ సేవల ప్రారంభ తేదీని త్వరలో ప్రకటిస్తామని ఈఎస్‌డీ తెలిపింది. దీంతో సాధారణ, మెట్రో డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, గ్రీన్ మెట్రో లగ్జరీ (ఏసీ), పుష్పక్ ఏసీ బస్సుల డిజిటల్‌గా టికెట్లు, పాస్‌లు పొందవచ్చు. గత జనవరి 9న ప్రారంభమైన మీటికెట్ యాప్‌ను 1.35 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకోగా, 2.6 లక్షల టికెట్ బుకింగ్స్, రూ.2 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయి. యాప్ రేటింగ్ 3.5 పై చిలుకు నమోదైంది. ఇందులో 221 ప్రదేశాల్లోని పర్యాటక సేవలు అందుబాటులో ఉన్నాయి.

గ్రీన్ ఫీ నిధులతో ఈవీ డిపోలు

శబ్ద, వాయు కాలుష్యం తగ్గించడానికి టీజీఎస్ఆర్టీసీ.. హైదరాబాద్ నగర పరిధిలో తిరిగే డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు ఆవలకు పంపి.. వాటి స్థానే ఎలక్ట్రిక్ బస్సులను వినియోగంలోకి తేనున్నది. ఒక్కో డీజిల్ బస్సుతో రోజుకు 2.15 కిలోల చొప్పున 2,926 బస్సులతో నిత్యం సుమారు 600 టన్నుల కర్బన ఉద్గారాలు వెలువడుతున్నాయి. పాత బస్సులు కావడంతో శబ్ద కాలుష్యం పెరగడంతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే తిరుగుతున్న 265 ఎలక్ట్రిక్ బస్సులకు మరో 3 నెలల్లో 275 ఈవీ బస్సులు జత కలుస్తాయి. వచ్చే 3 ఏళ్లలో హైదరాబాద్‌లో 2,800 ఈవీ బస్సులను అందుబాటులోకి తేనున్నది. ఇందుకోసం నగరంలోని అన్ని డిపోలను ఈవీ చార్జింగ్ డిపోలుగా మార్చడంతోపాటు, వాటికి హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణం చేపట్టనున్నది. ఈవీ బస్సుల చార్జింగ్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాకు హైటెన్షన్ విద్యుత్ లైన్ నిర్మాణానికి ఒక్కో డిపోకు 10 కోట్ల చొప్పున 392 కోట్ల భారం పడుతుందని భావిస్తున్నారు. దీన్ని రాబట్టుకునేందుకు గ్రీన్ ఫీ రూపంలో టికెట్లపై కనిష్ఠంగా రూ.5, గరిష్ఠంగా రూ.10 వసూలు చేయాలని నిర్ణయించింది. గ్రీన్ ఫీ రూపంలో ఒక ఏడాదిలో రూ.110 కోట్లు, రెండేళ్లకు 220 కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనా.

పామాయిల్ లక్ష్యం పూర్తిచేస్తారా? వైదొలుగుతారా?

» వారం రోజుల్లో ఏదో ఒకటి తేల్చుకొని ప్రభుత్వం వద్దకు రండి
» ఇలా నిర్లక్ష్యంగా పనిచేస్తే 10 లక్షల ఎకరాల లక్ష్యం నెరవేరదు
» పామాయిల్ కంపెనీల ప్రతినిధులపై మంత్రి తుమ్మల ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పది లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలు పెంచి... దేశంలో మొదటి స్థానంలో నిలవాలనే లక్ష్యంతో పని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి పామాయిల్ కంపెనీలు ఏమాత్రం సహకరించటంలేదని వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రైవేటు కంపెనీలు చేస్తున్న వ్యాపారానికి ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తున్నప్పటికీ... కంపెనీల నుంచి ఆశించిన సహకారం లభించటంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ నిర్ణీత వ్యవధిలో లక్ష్యం పూర్తిచేస్తారా? లేదంటే.. ఈ ప్రాజెక్టు నుంచి వైదొలుగుతారా? అనేది తేల్చుకోవాలని హెచ్చరించారు. వారం వ్యవధిలో కంపెనీల యాజమాన్యాలతో చర్చించి, ప్రతిపాదనలతో రాష్ట్ర ప్రభుత్వం ఎదుటకు రావాలని కంపెనీల ప్రతినిధులకు తుమ్మల సూచించారు. తదుపరి నిర్వహించే సమావేశానికి.. పామాయిల్ కంపెనీల యజమానులను కూడా ఆహ్వానించాలని, సీఎం రామకృష్ణారావు కూడా ఈ సమీక్షలో పాల్గొంటారని తుమ్మల తెలిపారు. అప్పుడు తాడో, పేడో తేల్చుకోవాల్సిందేనని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఏడాదికి 2 లక్షల ఎకరాల చొప్పున, ఐదేళ్లలో 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలు పెంచాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని, మిగిలిన మూడేళ్లలో ఈ లక్ష్యం పూర్తికావాల్సిందేనని టార్గెట్ విధించారు. సచివాలయంలో సోమవారం 13 పామాయిల్ కంపెనీల ప్రతినిధులు, ఉద్యానశాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పామాయిల్ కంపెనీల ప్రతినిధులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. పామాయిల్ లక్ష్యాన్ని కొన్ని కంపెనీలు ఎక్కువ తీసుకున్నాయని, నిర్ణీత వ్యవధిలో టార్గెట్ పూర్తిచేయటం చేతకాకపోతే వైదొలగాలని హెచ్చరించారు. రెండు, మూడు జిల్లాలు ఒకే కంపెనీకి ఉన్నప్పుడు తలకు మించిన భారం అనిపిస్తే వదులుకోవాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారులు కూడా ఈ ఏడాది చేసిన ప్రణాళికను మార్చాలని, ఇప్పుడున్న లక్ష్యాన్ని రెండింతలు చేయాలని, ఏడాదికి 2 లక్షల ఎకరాలు లక్ష్యాన్ని నిర్దేశించాలని, మూడేళ్లలో 10 లక్షల ఎకరాలకు పామాయిల్ సాగు విస్తీర్ణం చేరుకోవాల్సిందేనని తుమ్మల సూచించారు. కంపెనీల పనితీరు సక్రమంగా లేనప్పుడు ఒప్పందం రద్దు చేసుకోవాల్సిందేనని, ఏవైనా న్యాయపరమైన సమస్యలు వచ్చినా ప్రభుత్వం ఎదుర్కొంటుందని తెలిపారు. అవసరమైతే పోలీసులను పెట్టయినా ఆయా కంపెనీల నుంచి పామాయిల్ తోటలను స్వాధీనం చేసుకుంటామని, ఇతరులతో పనిచేయిస్తామని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.72 లక్షల ఎకరాల్లో 73,696 మంది రైతులు పామాయిల్ సాగుచేస్తున్నట్లు వివరించారు. ఖమ్మం జిల్లా కొణిజర్లలో గోద్రెజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న సీడ్ గార్డెన్ పనులు వేగవంతం చేయాలని, దేశంలోనే మొట్టమొదటిదైన సీడ్ గార్డెన్ నుంచి స్థానిక వాతావరణ పరిస్థితులు తట్టుకునే కొత్త హైబ్రీడ్ పామాయిల్ మొక్కల ఉత్పత్తి జరుగుతుందని, ఇది రైతులకు లాభదాయకమని, రానున్న రోజుల్లో తెలంగాణ పామాయిల్ హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.